“ ఎర్ర గులాబి ”

ఉద్యోగస్తురాలైన ‘ఒక తల్లి’

ఆధ్యాత్మిక ప్రయాణం.

రచయిత:

సరోజా గుళ్ళపల్లి

అనువాదం



నమస్తే,

అక్టోబర్ నాలుగు, 2023 న సరోజా మేడం గారు ఆంగ్లం లో ఏదో పోస్ట్ పెట్టారు BYM English గ్రూపులో. అది నాకు ఎంతో నచ్చింది. దానిని తెలుగు లో అనువాదం చేసి BYM తెలుగు గ్రూపులో పోస్ట్ చేసాను, అది చూసి మేడం గారు, తమ ఆధ్యాత్మిక ప్రయాణం గురించి రాసుకున్న "The Red Rose" అన్న గ్రంథాన్ని తెలుగులో అనువాదం చెయ్యమని చెప్పారు. మేడం గారు చెప్పింది చేసేయడమే. బాగా చెయ్యగలనా? లేదా?, అని కూడా ఆలోచించలేదు నేను. ఇంతకు ముందు ఎన్నడూ ఇలా కలం పట్టలేదు కాబట్టి, ఏవైనా తప్పులుంటే క్షమించగలరు.

ఇది రాయడం ప్రారంభించినదే తడవు, నా భౌతిక జీవితంలో, "అసంభవం" అనుకున్న కొన్ని సంభవాలైపోయాయి. అలా ఎన్నో అద్భుతాలు జరిగాయి నా జీవితంలో. ఇందులో నిగూఢంగా ఎన్నో ఆధ్యాత్మిక సందేశాలున్నాయి. అవన్నీ అనుసరించడమే, అంతే నేను చేసింది.

"ప్రేమంటే ఏదేదో చేసేయటం కాదు, ఏమీ చెయ్యకుండా ఉండడమే" లాంటి ఎన్నో గొప్ప గొప్ప ప్రతిపాదనలు సరోజా మేడం గారు మాత్రమే చెప్పగలరు. "సంపూర్ణంగా జీవించడం ఎలా", కృతజ్ఞత గురించీ,

క్షమాతత్వం గురించీ, సృష్టి యొక్క ఆకర్షణా సిద్ధాంతం గురించీ ఎన్నో దృష్టాంతాలతో సహా వివరించారు. 'పుట'లు తక్కువగా ఉండవచ్చు కానీ, నా దృష్టిలో దీనిని "సరోజ గీత" అని పిలవ దలుచుకున్నాను. ఇది చదువుతున్న ప్రతి ఒక్కరి జీవితంలోనూ మార్పు రాగలదు. మనకు సీతాయణం, థౌజండ్ సీడ్స్ ఆఫ్ జాయ్, సాక్షి ఇవన్నిటి కంటే ఈ "సరోజ గీత" ను అధ్యయనం చేసి, చక్కగా అందులోని విషయాలను పాటిస్తే చాలు. మన భౌతిక ప్రపంచంలో మాత్రమే కాదు, ఆధ్యాత్మికంగా కూడా మనం ఎంతో ముందుకు వెళ్లగలము..

ఇట్లు,

స్వరూపా భాస్కరన్.

BYM కుటుంబ సభ్యురాలు.

సెప్టెంబర్ 4, 2024

అంకితం

నన్ను ఇలా తీర్చి దిద్దిన

నా తల్లిదండ్రుల పాదపద్మములకు

అంకితమిస్తున్నాను.

ఇట్లు

సరోజా గుళ్ళపల్లి

ముందుమాట

"మేడం, మీరు పుస్తకం రాయాలి" ఆజ్ఞాపిస్తున్నట్లుగా చెప్పారు పత్రీజీగారు. "మీరు రాసిన పుస్తకానికి "ది రెడ్ రోజ్" అని పేరు పెట్టండి" అన్నారు.

అది మెల్బోర్న్ లో చలికాలం. ఒకానొక సాయంత్రం వేళ, అందరం శివ వాళ్ళింటి వరండాలో కూర్చుని ఉన్నాము. పత్రీజీ గారు మెల్బోర్న్ వచ్చారని తెలిసి, వారిని కలవడానికి శివ వాళ్ళింటికి వచ్చాము. పత్రీజీ గారు మెల్బోర్న్ రావడం ఇది రెండవసారి.

"ఏమిటి?" నేనేమిటి? పుస్తకం రాయడం ఏమిటి? ఆశ్చర్యపోతూ చూసాను. నా భర్త హరీష్ గారి వైపు 'ఏమిటి అంటున్నారు ఈయన' అన్నట్టు చూసాను.

హరీష్ గారు పెదవులు విడీవిడనట్లు చిన్నగా నవ్వుతు నా వైపే చుస్తున్నారు, ఏప్పటిలాగే తన మనసులోని భావాలు కనిపించకుండ.

"పుస్తకం రాయడం గురించి ఆలోచించండి మేడం" అన్నారు పత్రీజీగారు. "దేని గురించీ రాయమంటారు" అని అడిగాను భావరహితంగ. "మీ జీవిత అనుభవాల గురించి, ఆధ్యాత్మిక ప్రయాణం గురించీనూ" సూటిగా చూస్తూ అన్నారు, పత్రీజీగారు. "మీ అనుభవాలు చాలామందికి ఉపయోగపడవచ్చు. ఇవన్నీ రంగరించి పుస్తకం రాయండి మేడం".

తల పంకించాను సాలోచనగా. నేను పుస్తకం రాయడం గురించి పత్రీజీ గారే నిర్ణయం తీసేసుకున్నారు.. ఇక ఎప్పుడు రాయాలి?ఎలా

రాయాలి? అన్నదే నిర్ణయించుకోవాలి.

రాయడం అన్నది నాకు కొత్తేమీ కాదు. నిజం చెప్పాలంటే రాయడం అంటే నాకు మహా ఇష్టం. నేను రాసే ఉత్తరాలు కానీ, ఈమెయిల్స్ కానీ, అన్నీ కూడా పేరాలు, పేరాలుంటాయి.. పొట్టి కథలు, నాటికలు కూడా చాలా రాసాను గతంలో. కానీ పుస్తకం రాయడం, అదికూడా 'ఆత్మకథ' దీని గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు.

మరో సారి కలిసినప్పుడు పత్రీజీ గారు మళ్ళీ నేను పుస్తకం రాయడం గురించి ప్రస్తావించారు. నేను కూడా ఇక రాయాలనే నిర్ణయానికి వచ్చేసాను.

పత్రీజీ గారు అన్నారు "గతంలో 'ఒక యోగి ఆత్మకథ' అన్న గ్రంథం ఎంతోమందికి స్ఫూర్తినిచ్చింది మేడం. మీరు రాయబోతున్న మీ ఆత్మకథ కూడా రాబోతున్న ఎన్నో తరాలకు స్ఫూర్తినివ్వబోతోంది. ఆదరంగా చూసుకునే కుమార్తెగా, ప్రేమించే భార్యగా, బాధ్యతాయుతమైన తల్లిగా, గొప్ప గొప్ప విజయాలను అలవోకగా అందిపుచ్చుకున్న ఉద్యోగినిగా, ఆధ్యాత్మికంగా గొప్ప సాధకురాలిగా, మరియు ప్రశాంతచిత్తము స్వంతం చేసుకున్న తీరు, ఇవన్నీ అందరికి తెలియాలి. ఇలాంటి అనుభవాలు ఎందరికో, ఎన్ని తరాలకో స్ఫూర్తినిస్తాయి" అన్నారు.

ఇక నా ఉత్సాహానికి, ఆనందానికి అవధులు లేవు, నా మారదర్శకుడు అయిన పత్రీజీ గారి నోటి వెంట ఇలాంటి మాటలు వినడం అన్నది, ఆ తరువాత కొన్ని నెలలు తదేక దీక్షతో ఈ పుస్తకం రాసేలా చేసింది.

నా ఈ పుస్తకం ఏ విధంగానైనా, ఈ విశాల విశ్వం యావత్తు లోని ఏ ఒక్కరి ఆత్మ పురోగమనానికి తోడ్పడినా, నా ఈ జన్మ సార్ధకమైందను కుంటాను. నా జన్మ యొక్క ముఖ్యోద్దేశ్యం నెరవేరినట్టుగా భావిస్తాను.

ఆత్మసాక్షాత్కారం కోసం తపన పడుతూ, ఆధ్యాత్మికంగా ఎదుగుతూ, ఈ పుస్తక పఠనం చేస్తున్న నా ప్రియమైన పాఠకులకు అందరికి ఆధ్యాత్మిక ప్రశాంతతతో కూడిన జీవితం చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

ఇట్లు

సరోజా గుళ్ళపల్లి

ఫౌండర్ – బియాండ్ యువర్ మైండ్ ఫౌండేషన్

డిసెంబర్ 2012

విషయ సూచిక

1	నా అందమైన బాల్యం	11
2.	నృత్యం తో నేను	15
3.	అందమైన పొదరిల్లు	23
4.	చూపులు కలసిన శుభవేళ	30
5.	ఎంతెంత దూరం మా విదేశయానం	33
6.	మెల్బోర్న్ లో మా జీవితం	37
7.	నా ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభం	40
8.	ఆధ్యాత్మిక ప్రభంజనం “నా అలౌకిక స్థితి”	46
9.	గురువుగారి తో ముఖాముఖి	54
10.	దివ్య ప్రణాళిక	67
11.	నా నమ్మకానికి అతీతంగా	74
12.	మా చిన్నారి గురువులు	79
13.	జీవితం లో నూతనత్వం	89
14.	మధుర స్మృతులు	102
15.	స్వామి జీవానంద	110
16.	నా దినచర్య లో ధ్యానం	114
17.	నాలుగు ఆత్మల ప్రయాణం	121

1. నా అందమైన బాల్యం

నేను భారతదేశం లోని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోగల గ్వాలియర్ పట్టణంలో జన్మ తీసుకున్నాను. గరికపాటి వారి కుటుంబంలో ఉన్నతమైన భావాలు కల గొప్ప తల్లిదండ్రులకు ఏడవ సంతానంగా జన్మించాను.

మా తండ్రిగారు కీర్తిశేషులు శ్రీ శివరామ లక్ష్మీనరసింహ సోమ యాజులు గారు. మా తల్లిగారు శ్రీమతి లక్ష్మీ సోమిదేవమ్మ గారు. ఇద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారే. మా తండ్రిగారిది గుంటూరు పట్టణం కాగా, తల్లిగారిది ఒంగోలు జిల్లా లోని అమ్మన బ్రోలు.

నాన్నగారు బాగా చదువుకుని, చార్టెడ్ అకౌంటెంట్ గా కేంద్ర ప్రభుత్వంలో ఉన్నతోద్యోగిగా పనిచేసేవారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కావడం మూలాన దేశంలోని నలుమూలలకీ బదిలీలు ఉండేవి. అలా బదిలీ అయ్యి, గ్వాలియర్ వెళ్లిన సంవత్సరం తరువాత నేను పుట్టాను. నా తల్లిదండ్రులు గ్యాలియర్ కు వచ్చేవరకూ, నేను జన్మ తీసుకోకుండా వేచి ఉండి, వారు గ్వాలియర్ వచ్చిన తరువాత జన్మ తీసుకున్నానేమో.

నేను వారికి ఏడవ సంతానాన్ని. నా జీవితం, నన్ను ఎల్లప్పుడూ, అమితంగా ప్రేమించే, ప్రేమమూర్తులైన ఆరుగురు అక్కయ్యల పర్యవేక్షణలో ప్రారంభమైంది.

నేనెంతో ముద్దుగా, అందంగా ఉండేదాన్నని మురిసిపోయే మా అక్కయ్యలు, నాకు ఏమి కావాలన్నా సంతోషంగా చేసి పెట్టేవారు. 'పెద్దకుటుంబం' కావడంతో అమ్మకు అంత తీరిక ఉండేది కాదు, కాబట్టి

ఎక్కువ సమయం అక్కయ్యలతోనే గడిపేదాన్ని. చాలా చిన్న వయసులోనే నాకు మాటలు వచ్చేసాయి. తొందరలోనే 'వాగుడుకాయ' గా పేరు తెచ్చేసుకున్నాను. రెండేళ్లు దాటేసరికే నా వాగుడుతో విసిగిపోయిన అమ్మ, నన్ను ఇంటికి దగర్లోని ఒక కేథలిక్కుల పాఠశాలకు పంపించాలనుకున్నారు.

ఆరోజు నాకింకా గుర్తు, నాన్నగారు నన్ను తన సైకిల్ మీద 'సెయింట్ పాల్ పాఠశాల'కు తీసుకువెళ్లారు. నేను నా సరికొత్త లేత గులాబీరంగు గౌను వేసుకుని ఉన్నాను. నా రెండవ పుట్టినరోజు కి నాన్నగారు కొనిచ్చిన కొత్త గౌను అది. నాన్నగారికి గులాబీరంగు అంటే చాలా ఇష్టం. అప్పటికే, నాన్నగారు కొనిచ్చిన వివిధ రకాల గులాబీరంగు గౌనులు చాలా ఉండేవి నాదగ్గర.

పాఠశాలకు చేరిన తరువాత తెలిసింది మాకు, అక్కడ ఖాళీ లేదని, ఇక వచ్చే ఏడాదే ప్రవేశం దొరుకుతుందనీనూ. ఏమి చెయ్యాలి? నాన్నగారు కొద్దిగా నిరాశ పడ్డమాట వాస్తవమే. కానీ ప్రధానాచార్యులవారు "పాఠశాలంతా ఒకసారి చూసి వెళ్ళండి, వచ్చే ఏడాది పాపను చేర్పించవచ్చు" అని చెప్పారు. స్వయంగా మమ్మల్ని వెంట పెట్టుకుని ప్రతి తరగతీ చూపిస్తున్నారు. నాకు అర్థం కావడానికని నాన్నగారు "ఇక్కడ నువ్వు కూర్చోవడానికి చోటు లేదట అమ్మా, వచ్చే ఏడాది వద్దాములే" అని చెప్పారు అనునయంగా. ఇంతలో నేను చేరవలసిన తరగతిలోకి వచ్చాము.

ఆ తరగతి గది అంతా కలియచూసి "ఆ బెంచీ మీద కొద్దిగా చోటు ఉంది, నేను సర్దుకుని కూర్చుంటాను" అని ప్రధానాచార్యుల వారి దగ్గరికెళ్లి నిర్భయంగా చెప్పాను. నేను అడిగిన విధానానికి, పాఠశాలలో చేరాలనే నా తపన చూసి ఆయన ముచ్చటపడి, అప్పటికప్పుడు తన నిర్ణయం మార్చుకుని, నాకు ప్రవేశం కల్పించడానికి నిర్ణయించుకున్నారు.

"ఇలాంటి పట్టుదల, సమయస్ఫూర్తి మరియు నిర్భయత్వం ఇంత చిన్న వయసు పిల్లలో నేను ఎన్నడూ చూడలేదు" అని చెప్పారాయన. నాకప్పుడు తెలియదు, ఆ గుణాలే నా జీవిత గమనాన్నీ, నా వ్యక్తిత్వ పురోగమనాన్నీ, నిర్దేశించబోతున్నాయని.

అప్పటి మనదేశ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ గారు. ఒకనాడు ఉదయం ప్రార్థనా సమావేశంలో, ప్రధానమంత్రి గారి గురించి మాట్లాడుతూ, ప్రధానాచార్యులవారన్నారు, "మీలో పెద్దయ్యాక ప్రధానమంత్రిగా ఎవరు అవుతారు?" అని, వెంటనే నేను చెయ్యెత్తాను ఒక్క క్షణం కూడా తటపటాయించకుండా. తరువాత చుట్టూ కలియచూస్తే నేను మాత్రమే చెయ్యెత్తాను. నా ధైర్యాన్ని చూసి ఎంతో ముచ్చట పడి, ప్రధాన ఆచార్యులు గారు అప్పుటికప్పుడు నన్ను స్టేజీ మీదకు పిలిచి నా చొరవనూ, ధైర్యాన్నీ తెగ మెచ్చుకున్నారు. అప్పటికి నా వయస్సు మూడు సంవత్సరాలు మాత్రమే. ఆ నిర్భయత్వం అన్నది నా జీవితంలో అలా కొనసాగింది.

నా మాటకారితనం వల్ల స్నేహితుల్ని చేసుకోవడంలో నాకెన్నడూ ఇబ్బంది కలుగ లేదు. నేనే చొరవ తీసుకుని అందరితో కలివిడిగా మాట్లాడుతూ స్నేహితుల్ని కలుపుకుంటూ పోయేదాన్ని. ఇంట్లో కూడా అంతే, మా అక్కయ్యలందరూ నాకు స్నేహితులకంటే ఎక్కువే.

ఎప్పుడూ హాస్య చతురతతో కూడిన నా ధోరణి వల్ల, ఇంటి వాతావరణం ఎల్లప్పుడూ సందడి, సందడిగా ఉండేది. ఇంకో విధంగా చెప్పాలంటే, ఇంట్లో నేను ఒక జోకర్ ని. ప్రతిరోజూ సాయంత్రం పూట, భోజనాల బల్ల దగ్గర, అందరూ నా చుట్టూ చేరేవాళ్ళు. ఎవరో ఒకరిని అనుకరిస్తూ నేను మిమిక్రీ చేస్తూ, అందరినీ నవ్విస్తూ ఉండేదాన్ని. మేము రాత్రిపూట భోజనాలు చేసేటప్పుడు ఇలా సరదా సరదాగా, ఆనందంగా

గడచిపోయేది. సమయం తెలిసేది కాదు. ఒక్కొక్కసారి ఇలా సరదాగా మాట్లాడుకుంటూ గంటలు గడచిపోయేవి. ఈ అలవాటు ఇప్పటికీ నాలో మారలేదు. నా భర్త పిల్లలతో అలా సరదాగా, ఆనందంగా మాట్లాడుతూ భోంచేస్తాము.

నాచుట్టూ ఉన్న అందరూ సంతోషంగా ఉండేలా చూసుకునేదాన్ని. ఎవరైనా బాధపడుతుంటే చూడలేకపోయేదాన్ని. అది జంతువులైనా సరే, బాధలో ఉంటే తట్టుకోలేకపోయేదాన్ని. ఎవరైనా మా పెంపుడుకుక్కని ఇబ్బంది పెట్టినా, బాధ పెట్టినా ఒప్పుకునేదాన్ని కాదు. అందుకే నన్ను మా కుటుంబసభ్యులంతా "కుక్కల తరపు న్యాయవాది" అనేవారు.

ఎవరైనా అన్యాయం చేస్తున్నట్లు కానీ, వివక్షత చూపుతున్నట్లు కానీ, నా దృష్టికి వస్తే నేను ఒప్పుకునేదాన్ని కాదు. అది అక్కచెల్లెళ్ళ మధ్య ఏదైనా కుటుంబ తగాదాలైనా అయిండవొచ్చు, లేదా స్నేహితుల మధ్య గొడవలైనా అయిండవొచ్చు. ఇలా సూటిగా, నిర్మొహమాటంగా, నేను మాట్లాడే విధానం వల్ల నాకు బహుకొద్ది మంది మాత్రమే అత్యంత సన్నిహితులైన స్నేహితులు ఉండేవారు. కానీ నేను దేనినీ పట్టించుకునేదాన్ని కాదు.

చిన్నప్పట్నుంచీ కూడా నాకు ఏది 'సరి' అనిపిస్తే అది చేసుకుంటూ వెళ్ళిపోయే దాన్ని, కానీ ఎన్నడూ పర్యవసానం గురించి ఆలోచించే దాన్ని కాదు.

నాకు అయిదు ఏండ్ల ప్రాయం వచ్చినప్పుడు, మా తమ్ముడి రాకతో మా ఇంట్లో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పుడు మా తమ్ముడిని నేను బాధ్యతగా చూసుకోవాలి. 'అక్కయ్య'నయ్యాను కదా మరి. మా తమ్ముడు అందరి కంటిపాప అయ్యాడు. అందరికీ గారాబం తమ్ముడంటే.

2. నృత్యంతో నేను

ఏదైనాసరే నేను చురుగ్గా చక చకా నేర్చుకోవడం చూసి మా పాఠశాలలోని ఉపాధ్యాయులందరూ ముగ్దులై పోయేవారు. చిరకాలంలోనే నేను వారందరికీ ఇష్టురాలిని అయిపోయాను. చదువులో ఎంత శ్రద్ధ వహించేదాన్నో, ఆటలు, సంగీతం, నృత్యం అన్నింటిలో కూడా అంతే ఆసక్తి చూపేదాన్ని.

చక్కని శ్రావ్యమైన కంఠస్వరం కలిగి ఉండడం వలన, పాఠశాలలో జరిగే అన్ని సంగీత కార్యక్రమాల్లోనూ నేనే నాయకత్వం వహించేదాన్ని.

మొదటిసారిగా స్టేజీ మీద ప్రసంగించే అవకాశం నా ఎనిమిదేండ్ల ప్రాయంలో కలిగింది. పాఠశాలలో నాకు ప్రార్ధనా సమావేశంలో స్వాతంత్ర్యదినోత్సవం గురించి ప్రసంగించడానికి అనుమతిచ్చారు. అలా మొదలైన నాప్రసంగాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.

కానీ ఏదీ కూడా నృత్యం పట్ల నాకున్న ఆసక్తిని తగ్గించలేకపోయాయి. కాలం గడిచేకొద్దీ ఈ ఆసక్తి కాస్త మక్కువ కింద మారిపోయింది. నృత్యం అంటే నాకెందుకో అమితమైన అనురక్తి, ఇంకోవిధంగా చెప్పాలంటే నృత్యం అంటే నాకు ప్రాణం. ఇప్పటికీ, నాకు నృత్యం అంటే అత్యంత ఇష్టం. ఎప్పట్నుంచి నేను నృత్యం చేస్తున్నానని నాకు అంతగా గుర్తులేదు కానీ, మొదటి ప్రదర్శన మాత్రం నా మూడేళ్ళప్రాయంలో, మా పాఠశాలలో చేసాను. నాకిప్పటికీ ఆ స్టేజీ, మరియు మేము ఏ పాటకైతే నృత్యం చేశామో ఆపాట, అవన్నీ గుర్తున్నాయి.

హియర్ వుయ్ గో లూఫ్టీ లూ...

హియర్ వుయ్ గో లూఫ్టీ లూ...

హియర్ వుయ్ గో లూఫ్టీ లూ...

ఆల్ ఆన్ ఏ సాటర్డే నైట్.....

నాకిప్పటికీ గుర్తు. ఆరోజు కూడా అదే లేత గులాబీ రంగు గౌన్ వేసుకుని ఉన్నాను. నేను స్టేజీ మీద నృత్యం చేస్తుంటే స్టేజీ కింద ప్రేక్షకులలో కూర్చుని నా నృత్యాన్ని తిలకిస్తున్న 'మా కుటుంబ సభ్యులు' అందరూ సగర్వముగా, మురిసిపోతూ చూసారనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఇక ఆ రాత్రి నృత్యప్రదర్శన తరువాత నేను, మా ఇంట్లో ఉన్న పెద్ద పందిరి మంచాన్ని స్టేజీ గానూ, అమ్మ చీరల్ని 'తెర' లాగానూ వాడుకుని సరదాగా నృత్యం చేసి చూపుతూ ఉండేదాన్ని. నా తోబుట్టువులు చూసి ఆనందించేవారు. ఒక్కొక్కసారి నేను లీనమైపోయి నృత్యం చేస్తూ, ఎవరైనా ప్రేక్షకులు ఉన్నారా లేరా, అని కూడా పట్టించుకునే దాన్ని కాదు.

నేను చక్కగా నృత్యం చెయ్యడాన్నీ, మరియు నృత్యం పట్ల నాకున్న ఆసక్తినీ, మక్కువనూ గమనించిన మా ఉపాధ్యాయులందరూ, పాఠశాలలో జరిగే ప్రతి నృత్య కార్యక్రమంలో నేను పాల్గొనేలా చేసేవారు.

నేను మూడవ తరగతి చదువుతున్నప్పుడు, మా పాఠశాలలొనే "భరతనాట్యం" నేర్పించే తరగతులు ప్రారంభించారు. నేను నాన్నగారి దగ్గరికెళ్ళి 'నాక్కూడా నృత్యం నేర్చుకోవాలని ఉందనీ, నన్ను ఆ తరగతిలో చేర్పించమని' అడిగాను. నాన్నగారు ససేమిరా అన్నారు. అస్సలు ఒప్పుకోలేదు. ఆయన కొద్దిగా సంప్రదాయ భావాలు కలిగి వుండటం

మూలాన, నన్ను ఆ నృత్యం నేర్పించే తరగతిలో చేర్పించడానికి ఇష్టపడలేదు. ఉన్నత కుటుంబాలలో పుట్టిన అమ్మాయిలు నృత్యం నేర్చుకోరాదని ఆయన వాదన, ఏమి చేయగలను?. ఎంత ప్రయత్నించినా నాన్నగారిని ఒప్పించలేకపోయాను.

ప్రతి రోజూ సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్ళడానికి స్కూల్ బస్ కోసం ఒక అరగంట నిరీక్షించవలసి వచ్చేది. ఆ సమయంలో నృత్యం నేర్పుతున్న తరగతి వద్దకు వెళ్ళి, కిటికీ నుంచి చూస్తూ ఉండేదాన్ని. నాకు వారితో పాటు నృత్యం చేస్తున్న అనుభూతి కలిగేది. వాళ్ళు చేస్తున్న నృత్యం, ఆ భంగిమలు, హావభావాలు ఒలికించడాలూ, అన్నీ అలా, నా హృదయఫలకం పైన ముద్ర పడి పోయేవి. మళ్ళీ ఇంటికి వెళ్ళిన తరువాత, ఆ రోజు చూసిన నృత్యం అంతా, ఏమాత్రం పొల్లు పోకుండా చేసేసేదాన్ని. అంతగా లీనమై తిలకించేదాన్ని.

మాకు నృత్యం నేర్పించే గురువుగారు, నేను రోజూ అలా ఆసక్తిగా కిటికీ నుంచి చూడడాన్నీ, మరియు నాకు నృత్యం పట్ల ఉన్న ఆసక్తినీ గమనించి, ఒకరోజు నన్ను ఆ హాలు లోపలికి పిలిచి, ఇక మీదట లోపలే కూర్చుని వారు చేస్తున్న సాధనని తిలకించమన్నారు. ఇంకేముంది, రోజూ హాయిగా లోపలే కూర్చుని వాళ్ళు చేస్తున్న నృత్యాన్ని చూస్తూ ఉండేదాన్ని.

పాఠశాల వార్షికోత్సవం దగ్గర పడుతూ ఉంది. వార్షికోత్సవంలో భరతనాట్యం చేయబోయే విద్యార్థినులు ముగ్గురూ చక్కగా సాధన చేసుకుంటున్నారు. వారు 'శివతాండవ స్తోత్రానికి' నృత్య ప్రదర్శన చేయాలనుకున్నారు. ఆ ముగ్గురూ చేస్తున్న నృత్యం, ఆ భంగిమలూ, ఆ హావభావాలు ప్రదర్శించడం అన్నీ నేను ఇట్టే పట్టేసాను. నృత్యం నేర్పించే

గురువుగారు కూడా, వారికి మళ్ళీ, మళ్లీ ఎక్కడ ఎలాంటి 'హావభావాలు ప్రదర్శించాలి అన్నది చేసి చూపిస్తూ ఉన్నారు. అమ్మాయిలు భంగిమలు బాగానే చేస్తున్నారు కానీ హావభావాలు గురువుగారు ఆశించినంతగా ప్రదర్శించలేక పోయేవారు.

సరిగ్గా ఇంకొక వారం రోజుల్లో వార్షికోత్సవం ఉందనగా, జరిగిందది. నేను ఎప్పటిలాగే ఆ హాలులో కూర్చుని ఆ అమ్మాయిలు చేస్తున్న నృత్య సాధనని చూస్తున్నాను. ఆ రోజు ఎందుకో ఇద్దరే సాధన చేస్తున్నారు, మూడవ అమ్మాయి రాలేదు. ఇంతలో మా పాఠశాల ప్రధానాచార్యులవారు వచ్చి ఈ 'శివతాండవ స్తోత్రానికి నృత్యం చేయబోయే అమ్మాయిల్లో సృజన అనే అమ్మాయికి ఆరోగ్యం బాగలేనందున, తను పాల్గోనడం కుదరదని చెప్పారు.

నృత్యం నేర్పించే గురువుగారు తెగ మధనపడిపోయారు. ఈ చివరి క్షణంలో ఎవరు చెయ్యగలరు? ముగ్గురు అమ్మాయిలతో రకరకాల భంగిమలూ, విన్యాసాలూ చక్కగా సాధన చేయించేశారు. ఇంకొక్క వారం రోజుల్లోనే, మిగిలిన ఇద్దరు అమ్మాయిలతో, మొత్తం నృత్యాన్నీ, కొత్తగా తయారు చెయ్యాలి, ఇది చాల కష్టం కదా!

ఆయన సతమతమైపోతూ, ఉన్నట్టుండి ఏదో ఆలోచన వచ్చినట్టు నా వైపు చూసి "సరోజా, నువ్వు సృజన చెయ్యాల్సిన నృత్యం చేస్తావా అమ్మా", అన్నారు. నేను మరేమీ ఆలోచించకుండా "సరే గురువు గారు" అన్నాను. ఇది నాకు దొరికిన అద్భుతమైన గొప్ప అవకాశం. నా కల నెరవేరబోతున్నది. దీని గురించి కొన్ని వారాలుగా కలలు కంటున్నాను. నేనే స్టేజీ మీద 'శివతాండవ నృత్యం' చేస్తున్నట్లు కలలు వచ్చేవి, అది నిజమవబోతోంది.

మిగిలిన ఇద్దరు అమ్మాయిలూ ఈ విషయాన్ని జీర్ణించుకోలేక పోయారు. ఈ అమ్మాయేమిటి? మనతో సమానంగా నృత్యం చేయడం ఏమిటి?, అనుకున్నారో ఏమో. వాళ్ళు ఎన్నో రోజులుగా నృత్య సాధన చేస్తున్నారు. నాకు ఒక్క వారం మాత్రమే సమయం ఉంది. మరి నేను చెయ్యగలనో, లేదోనని వారికి సందేహం.

కానీ నృత్యం నేర్పుతున్న గురువుగారికి నామీద ఏదో నమ్మకం. వారు నన్ను రోజూ గమనిస్తూనే ఉన్నారు. నాకు నృత్యం పట్ల ఉన్న మక్కువను గుర్తించారు. నా కళ్ళలోనే నాకు నృత్యం పట్ల ఉన్న అనురక్తిని చూసారనుకుంటాను. నేను ఇన్ని రోజులనుంచీ ఆ అమ్మాయిలు చేస్తున్న సాధననీ తదేకంగా, ఏకాగ్రతతో గమనించడం చూసి ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్టున్నారు.

మొత్తం మీద సృజన చేయాల్సిన నృత్యం నేను చేయబోతున్నట్లు నిర్ణయం తీసుకున్న తరువాతనే, ప్రధానాచార్యులవారు, హాయిగా ఊపిరి తీసుకున్నారు. ఆవిడ "ఇంకేం సరోజ నృత్యం చేయబోతోంది కదా, ఇక నృత్యం గొప్పగా ఉండబోతోందిలే" నవ్వుతూ చెప్పి వెళ్ళిపోయారు. చెప్పొద్దు, నాకు కూడా ఆవిడ అలా చెప్పేసరికి, ఆవిడకి నామీద ఉన్న నమ్మకానికి ఎంతో సంతోషమనిపించింది. అప్పుటికి నా వయస్సు ఎనిమిది ఏళ్ళు మాత్రమే.

ఇక లేచి, మిగిలిన ఇద్దరు అమ్మాయిలతో కలసి నృత్య సాధన ప్రారంభించాను. నాకు కొత్తగా వారితో సాధన చేస్తున్నట్లు అనిపించలేదు. ఎందుకంటే వారి సాధన చూసి, చూసీ అన్ని భంగిమలూ చక్కగా వచ్చేసాయి నాకు. ఇక హావభావాలు కూడా, గురువుగారు ఆశించిన విధంగా, ఏదీ పొల్లుపోకుండా చేసి చూపించాను. పూర్తిగా నృత్యం అయ్యేసరికి గురువుగారు

చాలా సంతోషపడి పోయారు. మిగిలిన ఇద్దరు అమ్మాయిలు కూడా తృప్తి పడ్డారు. స్టేజీ మీద వారు చేయబోతున్న 'శివతాండవ నృత్యం' చక్కగా ఉండబోతోందని అర్థమైంది వారికి.

నిజం చెబుదును కదా! అలా స్టేజీ మీద శివతాండవ నృత్యం' చేస్తూ ఉంటే నాకు ఎంత సంతోషమైందో మాటల్లో చెప్పలేను. నా శరీరము, మనస్సు, ఆత్మ అన్నీ కలసి 'శివతాండవ నృత్యం' లో మమేకమై పోయినట్లు అనిపించింది.

నృత్య ప్రదర్శన విజయవంతంగా ముగిసింది. ఈ ప్రదర్శన తరువాత నృత్యం నేర్పించే గురువుగారు, నాకు ఆ మిగిలిన సంవత్సరం అంతా ఉచితంగానే నృత్యం నేర్పించారు. నాకు ఇది ఎంతో సంతోషాన్ని కలిగించింది.

తదుపరి సంవత్సరాలలో నేను మణిపురి, కథక్, మరియు నాగా స్టైల్ నృత్యాల్ని పాఠశాలలొనే నేర్చుకుని, ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాను.

నృత్యం చెయ్యడం అంటే నాకెంతో ప్రీతి. ఎంత సేపైనా విసుగూ, విరామం లేకుండా నృత్యం చేసేదాన్ని. ఇంట్లో కూడా ఖాళీగా ఉన్నప్పుడు, రేడియోలో వస్తున్న ఏదో ఒక పాటకు నేనే నృత్యం కట్టి చేసేదాన్ని. నా నృత్యానికి ఇంట్లో వాళ్లంతా కూడా అలవాటు పడిపోయారు. కానీ నేను నృత్యం చెయ్యడం నాన్నగారి కంటపడకుండా జాగ్రత్త వహించేదాన్ని.

అనతికాలంలోనే నేను మా వల్లీ అక్కయ్య తో కలసి, పాఠశాలలో జరగబోయే వార్షికోత్సవంలో నృత్యం చేయబోయే వారికి మేమే 'నృత్య సాధన' చేయించేవాళ్ళము. వారందరితో నృత్య సాధన చేయించడమే కాక, నృత్య ప్రదర్శన సమయంలో వారు వేసుకోవాల్సిన వేషధారణ పట్ల

కూడా ఎంతో శ్రద్ధ వహించేవాళ్ళము.

ఇలాగే నాలుగవ తరగతి పూర్తి అయింది. ఐదవ తరగతికి నన్ను కేంద్రీయ విద్యాలయం లో చేర్పించారు. ఇక్కడ నా నృత్యప్రదర్శనలకి ఇంకా మంచి అవకాశాలు రాసాగాయి. వివిధ కేంద్రీయ విద్యాలయాల మధ్యన రకరకాల పోటీలు నిర్వహించేవారు. నృత్యపోటీలు, ఆటలపోటీలు, నాటికలు, చర్చలు, లాంటివన్నీ జరిగేవి. మా పాఠశాల తరపున నేను వీటిలో పాల్గొనేదాన్ని.

ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న నేను, విశాఖపట్నంలో నా 'మొదటి ఉద్యోగం'లో చేరిపోయాను. ఇక ఇప్పుడు నాకు నృత్యం ఒక పద్ధతిగా, 'ప్రాథమిక అంశాల' నుంచీ నేర్చుకునే అవకాశం వచ్చింది. నా నృత్యం తరగతులకు నేనే రుసుము చెల్లించుకునే స్థితికి చేరుకున్నాను ఇప్పుడు మరి. కాబట్టి నేను కూచిపూడి నేర్చుకోవాలని చిన్నప్పట్నుంచీ ఉన్న 'తృష్ణను' తీర్చుకున్నాను. ఇంటికి దగ్గరలోనే ఒకరు 'కూచిపూడి' నేర్పించేవారు. రోజూ పని ముగించుకుని ఇంటికి వస్తూ, నృత్యం సాధన చేసి ఇంటికి చేరేదాన్ని.

అక్కడ నా 'సహ విద్యార్థినులు' అందరూ చాలా చిన్న పిల్లలు. నేను కూచిపూడి నృత్యంలోని ప్రాథమిక అంశాల నుంచీ అన్నీ నేర్చుకుంటున్నాను, కాబట్టి వారితోబాటు నేర్చుకోవలసి వచ్చింది. కానీ నాకు వారితో కలిసి నృత్యం నేర్చుకోవడం నామోషీగా అనిపించేది కాదు. ఎంతో ఉత్సాహంగా నృత్యం నేర్చుకున్నాను. నా వివాహం 'హరీష్'గారితో జరిగేవరకూ నా కూచిపూడి నృత్యసాధన కొన్ని ఏళ్ళ పాటు నిరాటంకంగా సాగింది, మా అమ్మాయి 'నవ్య' తన అయిదవ ఏట నుంచీ భరతనాట్యం తరగతులకి వెళ్ళింది. మెల్బోర్న్ లోనే 'భరతనాట్యం' నేర్పించేవారు ఉండేవారు. తను

వారిదగ్గర నృత్యం నేర్చుకుని, అద్భుతంగా ప్రదర్శనలు ఇస్తుంటే, నేనే అక్కడ నృత్యం చేస్తున్నట్లు అనుభూతి చెందుతూ ఆనందించేదాన్ని. మా 'నవ్య'కి కూడా 'భరతనాట్యం' పట్ల నాలాగానే ఎంతో ఆసక్తీ మక్కువ ఉండడం చూసి ఎంతో సంతోషపడ్డాను.

గత ఇరవై ఏళ్లుగా మెల్బోర్న్ లోనే ఉన్న ఎంతో మంది పిల్లలతో, నృత్య సాధనలు చేయించాను. అలా నృత్యంతో నాకున్న అనుబంధం కొనసాగింది. ఇప్పటికీ నృత్యం, నా జీవితంలో ఒక ముఖ్యమైన భాగమవ్వటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

3. అందమైన పొదరిల్లు

నేను హిందువుల కుటుంబంలో జన్మ తీసుకున్నాను. మా తల్లిదండ్రులు హిందూ సనాతనధర్మానికి కట్టుబడి ఉండేవారు. ప్రతిరోజూ ఉదయం పద్దతిగ పూజలూ, నైవేద్యాలు, స్తోత్రాలతో మా దినచర్య ప్రారంభమయ్యేది. ఏదైనా సరే విధిగా భగవంతునికి నైవేద్యం సమర్పించిన తరువాతనే మేము భోజనం చేయాలనే నియమం పెట్టారు మా తల్లిగారు.

నేను ప్రాధమిక పాఠశాలలో చదువుతున్న రోజుల్లో, మా ఇంటికి దగ్గరగా, అలా రోడ్డు దాటి అటువైపుకు వెళితే 'హనుమంతుల'వారి గుడి ఉండేది. నా దినచర్యలో భాగంగా, ప్రతిరోజూ పాఠశాలకు వెళ్ళేముందు ఈ గుడికి వెళ్ళి వచ్చేదాన్ని. ఉత్తర భారతదేశంలో 'హనుమంతుల' వారిని "భజరంగబలి " అని పిలుస్తారు. అలా నెమ్మది నెమ్మదిగా ఈ "భజరంగబలి" గారు మా జీవితాల్లో ఒక భాగమయ్యారు.

ప్రతిరోజూ నేనూ, మా తోబుట్టువు లందరమూ, గుడికి వెళ్ళి ఈయనని దర్శించుకుని పాఠశాలకు వెళ్ళే వాళ్ళము. మెల్లమెల్లగా ఈయనను మా 'అన్న'గా భావించడం మొదలుపెట్టాము. మాకు ఎలాగూ 'అన్నగారు' లేరు కదా! అందుకే మాకు ఏ అవసరం వచ్చినా, ఎల్లప్పుడూ ఈ 'అన్నగారు' మమ్మల్ని ఆదుకుంటారని భావన చేస్తూ ఉండేవాళ్ళము.

అమ్మ అన్ని పండుగలూ ఘనంగా, ఎంతో పద్దతిగా చేసేవారు. అమ్మ తన నేర్పరితనంతో, ఎంతో చాకచక్యంగా మేమందరమూ కూడా ఈ పండుగ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొనేలాగా చూసేవారు.

ఈ అన్ని పూజల్లోనూ 'గణేశ చతుర్థి ' మాకు ప్రత్యేకం. ఈ పండుగ రోజున మొత్తం పదిమందిమీ కలిసి పూజగదిలో కూర్చుని పూజ చేసేవాళ్ళము. ప్రతి ఒక్కరికీ, ఒక్కొక్క "ప్రత్యేకమైన పని" అప్పగించేవారు మా అమ్మగారు. పత్రి సేకరించడం, ఆవుపాలు తీసుకురావడం లాంటివి మేము చేసే వాళ్ళము. ఎక్కువ 'పత్రి' సేకరించడానికి మా తమ్ముడు, మరియు నాన్నగారు చిన్నపిల్లల్లాగా పోటీ పడటాన్ని, మా అక్కచెల్లెళ్ళ మందరమూ, నవ్వుతూ చూస్తూ ఉండేవాళ్ళము. ప్రతీ ఏటా ఇదే తంతు జరిగేది మరి.

మా ఇంట్లో ఘనంగా చేసుకునే పండుగల్లో దసరా కూడా ఒకటి. ఈ పండుగ సంబరాల్లో భాగంగా, పూజలు ఘనంగా చెయ్యడమే కాక సంగీత నృత్య కార్యక్రమాలు కూడా ఉండేవి. మా అక్కచెల్లెళ్ళ మందరమూ, ఈ పండుగ వస్తుందంటేనే ఎంతో సంబర పడిపోయేవాళ్ళము.

ఇంట్లో జరిగే ప్రతి ఒక్క విషయంలోనూ మా తోబుట్టువులందరమూ పాలు పంచుకునే లాగా చూసేవారు, మా తల్లిదండ్రులు. ఇదే మా అందరినీ కలిపి ఒక బంధానికి కట్టుబడేలా ఉంచిందని, తరువాతికాలం లో నాకు అర్థమైంది. ఇది ఒక గొప్ప పాఠంగా తీసుకున్న నేను, మా పిల్లలకి ఇలా ఒక బంధానికి కట్టుబడి ఉండేలా నేర్పించాను. ఈ బంధం లేకుంటే, పిల్లలు ఒకరిని ఒకరు పట్టించుకోకుండా చెట్టుకొకరు, పుట్టకొకరు అయిపోతారు, ఇప్పటి కాలంలో లాగా.

మా తల్లిదండ్రులు ఆధ్యాత్మికపరమైన పుస్తకాలంటే ఎంతో ఆసక్తి కలిగి ఉండేవారు. నాన్నగారి చిన్నపాటి ఆధ్యాత్మిక గ్రంథాలయంలో, వివేకానందులవారి గురించీ, రామకృష్ణపరమహంసగారి గురించీ,

ఆదిశంకరాచార్యుల వారి గురించీ అనేక గ్రంధాలు ఉండేవి.

రేడియోలో వార్తలు వినడం అయిపోయాక, చాలావరకూ నాన్న గారి కెంతో ఇష్టమైన గ్రంథం. "వివేక చూడామణి", చేతిలో పట్టుకుని కూర్చునేవారు. ఒకచేతిలో ఎర్రసిరా కలం' ఉండేది. చదువుతున్నప్పుడు ఏదైనా ముఖ్యమైన పంక్తులు వచ్చినప్పుడు, వాటి కింద గీతలు గీసి పెట్టుకునే వారు, మళ్ళీ ఎప్పుడైనా చూసుకోవడానికి వీలుగా ఉంటుందని.

మా అమ్మగారు కూడా ననాతన ధర్మాన్ని పాటించే కుటుంబ నేపధ్యం నుంచి వచ్చిన వారే. మా తాతగారు (అమ్మ యొక్క తండ్రిగారు) కూడా గొప్ప ఆధ్యాత్మిక చింతన కలిగిన వారవడం వలన, వారు చదివిన గొప్ప గొప్ప గ్రంథాల గురించి అమ్మకు వివరించేవారుట. అమ్మకు మూడేళ్ల ప్రాయంలోనే వారి తల్లిగారు పరమపదించారట. తాతగారికి అమ్మ ఒక్కరే సంతానం. తాతగారు ఎంతో ఆధ్యాత్మిక జ్ఞానం కలిగిన వారవడం చేత, ఆ పల్లెలో ఉన్న వారంతా తాత గారి దగ్గరికి ప్రతి రోజూ, సాయంత్రం పూట ఆధ్యాత్మిక సందేహాలు తీర్చుకోవడానికి వచ్చేవారుట. ఆ జరిగే ఆధ్యాత్మిక చర్చల సమయంలో అమ్మని కూడా తాతగారు తనతో పాటు తీసుకు వెళ్ళేవారట.

అలా తన తండ్రిగారి వద్ద నేర్చుకున్న ఆధ్యాత్మిక విషయాలన్నీ అమ్మ మాకు, ప్రతిరాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు చెప్పేవారు. నాకేమో వీటి గురించి ఇంకా కూలంకషంగా తెలుసుకోవాలని ఉండేది. కానీ అమ్మ, అంతా ఆ సృష్టి కర్త లీలగా చెప్పి ముగించేసేవారు.

నా విద్యార్థి జీవితం చాలా విజయవంతంగా ముగిసింది. చదువులో మెరుగ్గా ఉండే నేను, మంచి మార్కులతో ఉత్తీర్ణురాలినయ్యాను. చదువులోనే

కాకుండా ఎప్పుడూ నృత్యం, సంగీతం, ఆటలు, చర్చలు ఇలా అన్నింటా ఉండడం వలన నా విద్యార్థి జీవితం అంతా నిముషం తీరిక లేకుండా గడచిందనే చెప్పవచ్చు. నేను సంగీతం, నృత్యం, క్రీడలు, నాటికలు, చర్చల్లో పాల్గొనడం లాంటి ఎన్నోవిషయాల పట్ల అభిరుచి కలిగి ఉండేదాన్ని.

పన్నెండవ తరగతి ముగిసిన వెంటనే, నన్ను ఇంజనీరింగ్ చెయ్యమని సూచించారు, మా నాన్నగారు. అలాగే చేసాను నేను. "బాచిలర్ ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్" లో ప్రథమ శ్రేణి లో ఉత్తీర్ణత సాధించి పట్టభద్రురాలినయ్యాను. మా కళాశాలకు మొత్తానికి ప్రథమంగా నిలచి, బంగారు పతకం కూడా పొందాను.

ప్రేమమూర్తులైన ఆరుగురు అక్కయ్యలూ, మా ఏకైక తమ్ముడుతో నా విద్యార్థి జీవితమంతా ఎంతో హాయిగా గడిచిపోయింది. ఎప్పుడు పాఠశాల అయిపోతుందా, ఎప్పుడు ఇంటికి వెళ్ళిపోదామా అని ఎదురు చూసేదాన్ని. అంత సరదాగా, ఆనందంగా ఉండేది మా ఇంటి వాతావరణం. అక్కచెల్లెళ్ళమందరమూ, స్నేహితులలాగా ఎంతో సరదాగా ఉండేవాళ్ళము. ఒక్కొక్కసారి అమ్మ కూడా ఆనందంగా మాతో జట్టుకట్టేవారు.

అవి ఎంతో మధురమైన రోజులు. ఇక భోజనాల దగ్గర చెప్పక్కర్లేదు. గంటలు గంటలు దొర్లిపోయేవి. ఆరోజు జరిగిన విషయాలన్నీ చెప్పుకుంటూ గడిపేవాళ్ళము. ఇంకోరకంగా చెప్పాలంటే మా ఇల్లు 'లేడీస్ హాస్టల్' లాగా అనిపించేది. ఎందుకంటే ఇంట్లో ఉన్న పది మంది సభ్యుల్లో ఎనిమిది మందిమి ఆడవాళ్ళమే మరి.

నాన్నగారు గంభీరంగా, హుందాగా ఉంటూ, మేమందరమూ ఒకలాంటి 'క్రమశిక్షణ' పాటించేలా చూసుకునేవారు. నాన్నగారంటే మాకు

అందరికీ ఎంతో గౌరవం ఉండేది. కానీ ఆయనతో అంత చనువుగా ఉండేవాళ్ళం కాము.

మా ఆరుగురు అక్కయ్యలూ, నన్ను ఎంతో ప్రేమగా చూసుకునేవారు. వాళ్ళందరూ నాకెంతో ప్రత్యేకమైన వారు. వాళ్ళందరూ, విభిన్నమైన రీతిలో, ఒక్కొక్క ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగిన వారవడం విశేషం.

మా పెద్దక్కయ్య 'గిరిజ' డాక్టర్. ఈవిడ ఎంతో హుందాగా, అందంగా ఉంటారు. ఆవిడని నేను ఆదర్శంగా తీసుకునే దానిని. చిన్నగా ఉన్నప్పుడు అన్నింటికీ పెద్దక్కయ్య సలహా, సహాయ సహకారాలు తీసుకునే దానిని. తనది ఒక ప్రత్యేకమైన బాణీ. కుటుంబంలోనూ, స్నేహితులలోనూ ఒక ప్రత్యేక గుర్తింపు కలిగి ఉండేవారు. పెద్దక్కయ్య పెళ్ళప్పుడు నాకు పదేళ్ళు ఉంటాయేమో. అలా నాకు పెద్దక్కయ్యతో ఎడబాటు కలిగింది.

రెండవ అక్కయ్య 'కామేశ్వరి' చాలా చురుకైనవారు, తెలివైనవారు. తానే, చిన్నప్పుడు చాలావరకూ నా బట్టలన్నీ కుట్టేసేవారు, ప్రత్యేకంగా, కొత్త, కొత్తగా డిజైన్ చేసి మరీ, ఎంతో శ్రద్ధతో బట్టలు కుట్టి ఇచ్చేవారు. ఈ అక్కయ్య వంట కూడా చాలా రుచిగా వండేవారు.

మూడవ అక్కయ్య '[ప్రసూన'. నా యూనిఫామ్ సరిగ్గా ఉందా, లేదా అని తానే చూసుకునేవారు. నా చెప్పులు సరిగా ఉన్నాయా, లేవా? పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమానికీ సరిపడా చెప్పులూ, బట్టలూ ఉండేలా చూసుకునేవారు ఈ అక్కయ్య తన హృదయం బంగారం.

ఇక నాలుగవ అక్కయ్య 'శారద'. నేను ఇంజనీరింగ్ చేసేటప్పుడు, ప్రతి మూడు నెలలకు ఒకసారి పరీక్షలు జరిగేవి. ఈ పరీక్షల సమయంలో నేను మేలుకొని చదువుకోవడానికని, ఈ అక్కయ్య నాతోపాటు మేలుకుని

ఉండి, అప్పుడప్పుడూ 'టీ' పెట్టి ఇచ్చేవారు. నాకేదైనా కష్టం కలిగితే, నా కోసమని భగవంతుని ప్రార్థించేవారు. నేనేదైనా కావాలనుకున్నప్పుడు, అది నాకు దొరకాలని, తాను ఉపవాసాలుండి మరీ ప్రార్థించేవారు. తన మీద నాకెంతో నమ్మకం. తను మా కుటుంబంలోనే ఒక 'ప్రత్యేకమైన దివ్యత్వాన్ని' కలిగి ఉన్నారు అని అనుకునేదాన్ని. నా ప్రతీ ప్రశ్నకూ ఈ అక్కయ్య దగ్గర జవాబు ఉందనిపించేది.

అయిదవ అక్కయ్య 'భారతి'. తనకి కెమిస్ట్రీ అంటే చాలా ఇష్టం. నాకు ఆర్గానిక్ కెమిస్ట్రీ లో చాలా సహాయం చేసేవారు. తనకి చక్కగా ముస్తాబవ్వడం అంటే చాలా ఇష్టం. ఎప్పుడూ చక్కగా తయారై ఉండేవారు.

ఇక ఆరవ అక్కయ్య 'వల్లీ'. మేమిద్దరమూ ఒకే పాఠశాలలో చదువుకున్నాము. చాలా స్నేహంగా ఉండేవాళ్ళము. మా స్నేహాన్ని చూసి మా స్నేహితులందరూ ఎంతో ఈర్ష్య పడేవారు. మేమిద్దరం అన్ని విషయాలూ పంచుకునేవాళ్ళం. మా మధ్య దాపరికం ఉండేది కాదు. నాకంటే రెండేళ్లు మాత్రమే పెద్దవారైన, మా అక్కయ్య, నాపట్ల ఎంతో పెద్దరికం వహించేవారు.

ఇకపోతే మా తమ్ముడు 'ఫణి కిషోర్' చాలా ముద్దుగా ఉండేవాడు. మా అందరికీ తనంటే ఎంతో అపురూపం. తనకి అమ్మతో పాటు, మేము అక్కయ్యలము అందరమూ అమ్మలాగానే ప్రేమగా చూసుకునే వాళ్ళం కాబట్టి తనకి ఎనిమిది మంది అమ్మలం. మేము అందరమూ చూపించే ప్రేమ ఒక్కొక్కసారి తట్టుకోలేకపోయేవాడు.

నేను "మాస్టర్స్ ఇన్ ఎలక్ట్రానిక్ ఇంస్ట్రుమెంటేషన్"" పూర్తి చేసిన తరువాత నా మొదటి ఉద్యోగం ' HPCL రిఫైనరీ ' లో విశాఖపట్నం లో చేరాను.

నాన్నగారికి నేను ఇలా ఒంటరిగా అంత పెద్దనగరంలో ఉండడం ఇష్టం లేదు. అక్కడ తెలిసినవారు కానీ, బంధువులు కానీ, ఎవరూ లేరాయే. కానీ నేను ఎంతో దృఢ సంకల్పంతో మా తల్లిదండ్రుల్ని ఒప్పించి మరీ, విశాఖపట్నంలో, ఉద్యోగంలో చేరాను.

చేరక ఏమి చేస్తాను? నా దివ్యప్రణాళిక ప్రకారం, నా జీవితంలో ఒక అమూల్యమైన వ్యక్తి నా కాబోయే 'జీవితభాగస్వామి'ని, ఇక్కడే కలుసుకోవాలని రాసి పెట్టి ఉంటే, వేరే ఎక్కడో ఎలా ఉంటాను?

4.చూపులు కలసిన శుభవేళ

నా భర్త హరీష్ గారిని నేను మొదటిసారి విశాఖపట్నం లో కలిశాను. నేనూ, హరీష్ గారూ ఒకే కార్యాలయంలో పనిచేస్తూ ఉండేవాళ్ళము. ఎల్లప్పుడూ మృదు మందహాసంతో, ఎలాంటి పరిస్థితులలోనూ చెక్కు చెదరని ఒకలాంటి గంభీరతతో, అందరిలోనూ ప్రత్యేకంగా కనిపించే హరీష్ గారితో పరిచయం అవ్వడం, నెమ్మదిగా అది స్నేహంగా మారడం అంతా, ఎంతో గమ్మత్తుగా జరిగింది. మా కార్యాలయంలో గొప్ప "ప్రతిభావంతుడి"గా పేరు పొందిన వ్యక్తి 'మృదుభాషి', 'వినయశీలి'.

నేను చెయ్యగలిగిన దానికంటే ఎక్కువగానే ఉద్యోగ బాధ్యతలని తీసుకుని చేస్తుండడం, మరియు సాయంత్రం పూట కూచిపూడి నృత్య సాధనలతో, ఎవరి గురించీ ఆలోచించేంత సమయం కూడా నాకు ఉండేది కాదు కాబట్టి నేను హరీష్ గారితో నా జీవితాన్ని పంచుకోబోతున్నానని అర్థం కావడానికి కొన్ని సంవత్సరాలు పట్టింది. ఇరువైపుల పెద్దల ఆశీర్వాదాలతో మార్చ్ 1988 లో మా వివాహము జరిగింది.

నా ఈ ఇరవైనాలుగేళ్ల వైవాహిక జీవితంలో నేను తీసుకున్న నిర్ణయానికి బాధ పడవలసిన సందర్భాలు ఏవీ లేవు. ఆయన చాల ఉదార స్వభావం కలిగిన వ్యక్తి జీవితం పట్ల ఎంతో అవగాహన కలిగిన వ్యక్తి 'వివేకవంతుడు'. ఇలాంటి అద్భుతమైన వ్యక్తిత్వం కలిగిన వారిని నేను ఇంతవరకూ ఎరుగను అని చెప్పడం అతిశయోక్తి కాదనే అనుకుంటున్నాను. ఎంతో 'సహనశీలి'. గలగలా మాట్లాడుతూ, సందడి సందడిగా హడావుడి చేసే నా స్వభావానికి ఆయన పూర్తిగా వ్యతిరేక స్వభావం కలిగినవారు.

ఈ ఇరవైనాలుగేళ్ల వైవాహిక జీవితంలో ఆయన 'ఎవరి గురించైనా చెడుగా మాట్లాడటం' నేను వినలేదు. తనపట్ల దురుసుగా ప్రవర్తించిన వారితో కూడా, ఆయన దురుసుగా ప్రవర్తించేవారు కాదు. ఎంతో సంయమనం పాటించేవారు. ఎవరికైనా ఇంత సహనం, క్షమాగుణం ఉంటుందా అని ఆలోచించేదాన్ని. ఒక్కొక్కసారి ఆయన ఈ తత్వానికి నాకు చెప్పలేనంత చిరాకు, కోపము కూడా వచ్చేవి. ఆయన తరపున ఎదుటి వ్యక్తులతో వాదించేదాన్ని. ఈయనని అందరూ అలుసుగా తీసుకుంటున్నారని భావించేదాన్ని. నా స్వభావము అలాగే ఉండేది. ఎక్కడైనా, ఎవరికైనా, అన్యాయం జరుగుతున్నట్లు అనిపిస్తే అంగీకరించేదాన్ని కాదు.

మా పిల్లల ఆగమనంతో, మా జీవితాలు మరింత బిజీ అయిపోయాయి. అటు ఉద్యోగ బాధ్యతలు, ఇటు కుటుంబ బాధ్యతలతో రోజులు గడవడం సవాలుగా మారింది. కానీ ఎప్పుడూ ఒకరికి ఒకరం తోడుగా జీవితం సాగించాము. విదేశాల్లో ఉన్నాము కాబట్టి, మాకు కుటుంబ సభ్యుల సహాయం తీసుకోవడానికి కూడా అవకాశం లేదు. అందరూ భారతదేశంలోనే ఉన్నారు మరి. ఒకరికొకరం సహాయం చేసుకుంటూ ముందుకు సాగాము. ఇది మమ్మల్ని ఇంకా దగ్గరికి తెచ్చిందనే చెప్పవచ్చు.

మాకు వివాహం అయ్యాక, ఇద్దరమూ ఒకే దగ్గర పని చేస్తూ ఉండడం వలన ఆఫీసుకు ఇద్దరమూ కలిసి వెళ్ళి, వచ్చేవాళ్ళము. మొదట్లో ఒకే ఆఫీసులో పని చేసేవాళ్ళము. తరువాత వేరు వేరు ఆఫీసులలో పని చేస్తూ ఉండినా కానీ, ఇద్దరి ఆఫీసులూ దగ్గరగా ఉండడంతో ఇద్దరం కలిసే వెళ్ళి వచ్చే వాళ్ళం. మా ఇద్దరి మధ్య ఎలాంటి దాపరికాలూ ఉండేవి కాదు. అది కుటుంబపరమైన విషయాలైనా, వృత్తి పరమైన విషయాలైనా, లేక మరొకటి కావచ్చు, ప్రతిదీ పంచుకునేవాళ్ళము. చాలా వరకూ మధ్యాహ్నం 'భోజనానంతర విరామ సమయం' లో కూడా కలిసి

ఉండేవాళ్ళము.

మా స్నేహితులు కొంతమంది 'ఇంత సమయం మీరు కలిసే ఉంటారు కదా, మరి మీకు విసుగు అనిపించదా' అని అడిగేవారు. అస్సలు విసుగు అన్నదే లేదని జవాబు చెప్పేదాన్ని. ఆయన అన్ని విధాలుగా నాకు మార్గదర్శిగా, గొప్ప స్నేహితుడిగా ఉండేవారు. మరి విసుగు ఎందుకొస్తుంది? జీవితంలో సుఖదుఃఖాలలో, ఒడి దుడుకులలో ఒకరికొకరం 'తోడూ నీడగా' మా ప్రయాణం సాగించాము.

కొత్తదేశంలో, ఇద్దరు చిన్న పిల్లలూ, మరియు ఉద్యోగ బాధ్యతలూ, అన్నీ నెట్టుకురావడానికి నాకు ఆయన ప్రేమ, సహాయ సహకారాలు లేకుంటే ఇబ్బంది పడేదాన్నేమో. నేను ఏదైనా సాధించగలిగానూ అంటే, అది ఆయన అన్నింటికీ నాకు చేదోడు వాదోడుగా ఉంటూ నన్ను ఎంతగానో ప్రోత్సహించడం వల్లనే సాధ్యపడింది. నేను నిర్భయంగా తీసుకునే పెద్ద పెద్ద నిర్ణయాల వెనుక ఆయన నిశ్శబ్దంగా చేస్తున్న ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉండేవి.

మా ఇద్దరికీ సినిమాలు చూడడం అంటే ఎంతో ఇష్టం. మా లాగానే మా పిల్లలు కూడా సినిమాలు చూడడం అంటే ఆసక్తి చూపేవారు. ఈ ఒక్క విషయం వదిలి, మిగిలిన విషయాల్లో మాకు వేరు వేరు అభిరుచులు ఉన్నాయి. నాకేమో సంగీతము, నృత్యము అంటే ఇష్టం. ఆయనకేమో స్పోర్ట్స్ ఆటలు అంటే ఇష్టంగా ఉండేది.

హరీష్ గారికి ఒక తమ్ముడు, ఒక చెల్లెలు ఉన్నారు. అత్తగారింట్లో కూడా ప్రేమ, ఆదరణలకు కొదువలేదు. వీరు కూడా అనుబంధాలకు ఎంతో విలువ నిచ్చే వారు. ఉత్తములైన అత్తవారింటికి నాకు ఘన స్వాగతం లభించింది.

5.“ఎంతెంత దూరం” మా విదేశయానం

కలలో కూడా నేను విదేశాలకు వెళతానని అనుకోలేదు. నేను చదువుకునే రోజుల్లోనే, నా తోటి విద్యార్థులు చాలా మంది, పై చదువుల కోసం విదేశాలకు వెళ్ళడానికి దరఖాస్తులు చేసుకుంటుంటే, నేనేమో నా కుటుంబానికి దగ్గరగా ఇక్కడే భారతదేశం లోనే ఉండాలని నిర్ణయించుకున్నాను. అందుకే నేను పాస్‌పోర్ట్ కూడా తీసుకోలేదు, అస్సలు పాస్‌పోర్ట్ అవసరం కూడా రాదనుకుని ధీమాతో ఉన్నాను. అంతా మనం అనుకున్నట్లే జరిగితే ఇంకేముంది.

వివాహానంతరం దాదాపు రెండేళ్ల తరువాత, ఒకరోజు మా ఇంటికి, తపాలాలో ఒక పసుపురంగు కవరు వచ్చింది. ఆ ఉత్తరం ఆస్ట్రేలియా రాయబార కార్యాలయం నుండి హరీష్ గారికి వచ్చింది. ఆ ఉత్తరం సారాంశం ఏమిటంటే, వారి దేశంలో ఉద్యోగం చెయ్యడానికని, ఎప్పుడో దాదాపు రెండేళ్ళకితం హరీష్ గారు, వారి స్నేహితుడు రాజుతో కలసి పెట్టుకున్న ‘అర్జీ’ ని మంజూరు చేయడమైందనీ, మూడు నెలల లోపు హరీష్ గారి పాస్ పోర్ట్ వారికి పంపితే ‘పర్మనెంట్ రెసిడెన్సీ’ స్టాంపు వేసి పంపుతారని ఉంది.

సాయంత్రం ఆయన వచ్చిన వెంటనే ఈ ఉత్తరం గురించి ప్రస్తావించాను. అదెప్పుడో రెండేళ్ల క్రితం పెట్టుకున్న అర్జీ అనీ, అసలు దాని గురించే మర్చిపోయారనీ చెప్పారు. ఇలా అర్జీ పెట్టుకున్నదాని గురించి కుటుంబంలో ఎవరికీ తెలియదు అని కూడా చెప్పారు. దాని గురించి

నేను కూడా మరి పట్టించుకోలేదు. ఆ ఉత్తరాన్ని పక్కకు పెట్టి నా పనేదో చూసుకున్నాను.

ఇలా కొన్ని వారాలు గడిచాయి. ఒకరోజు ఇల్లు సర్దుతుండగా మళ్ళీ ఆ ఉత్తరం నా కంట పడింది. చెత్త బుట్టలో పడేయ్యడానికి ముందు మరొక్కసారి చదువుదామని తీసి చూసాను. అందులో ఆస్ట్రేలియా రాయబార కార్యాలయం వారు ఇచ్చిన గడువు సరిగ్గా ఇంకో మూడు వారాలు మాత్రమే ఉంది... ఇక మేము, ఏమి చేయాలన్నది. నిర్ణయించుకోవాలి.

ఇద్దరం కూర్చుని కూలంకషంగా చర్చించుకున్నాము. పెద్దగా మాకు బాధ్యతలు అంటూ ఏమీ లేవు. కాబట్టి ఒకటి, రెండేళ్లు విదేశాల్లో గడిపి రావడం మంచిదే అని తోచింది మా ఇద్దరికీ. సరే చూద్దాం అనుకుని ఆస్ట్రేలియా రాయబార కార్యాలయం వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాము. నేను పాస్ పోర్ట్ చేయించుకోవడమూ, మరియు వారికి పంపవలసిన 'కాగితాలు అన్నీ' పంపడం అంతా ఒకదాని వెనుక ఒకటిగా చేసేసాము. మరొక్కనెల తిరిగేసరికి మా ఇద్దరి పాస్ పోర్టులు కూడా ఆస్ట్రేలియన్ రాయబార కార్యాలయం వారు, 'పర్మ నెంట్ రెసిడెన్సీ' స్టాంపు వేసి మాకు పంపించేశారు.

మేము మునుపెన్నడూ విదేశాలకు వెళ్ళలేదు కాబట్టి, ఎంతో ఉత్సాహంగానే ఉండినాము. ఏదో సెలవులకు, ఎక్కువ రోజులకు వెళుతున్నట్లు తోచింది మాకు. అంతకంటే మరేమీ లేదు. కానీ అసలు సమస్య ఏమిటంటే మా ఇరు కుటుంబాలను ఎలా ఒప్పించాలి?

ఇద్దరమూ ఆలోచనలో పడ్డాము. మా ఇద్దరికీ కూడా, మా కుటుంబాలతో మంచి సంబంధ బాంధవ్యాలు, మరియు గాఢమైన

అనుబంధం ఉంది. కాబట్టి వారు మమ్మల్ని దూరంగా పంపడానికి ఒప్పుకోరని మా ఇద్దరికీ తెలుసు. పెద్దల అంగీకారం లేకుండా మేము విదేశాలకు వెళ్ళడం, మా ఇద్దరికీ కూడా ఏ మాత్రమూ ఇష్టం లేదు. చాలా సున్నితంగా వారికి, మాకు దొరికిన ఈ అవకాశం గురించీ, మరియు మేము తీసుకున్న నిర్ణయం గురించీ చెప్పాము.

నాన్నగారికి ఈ వార్త అంతగా రుచించలేదు. మా అత్తయ్య గారు కూడా ససేమిరా అన్నారు. విదేశాల్లో అటు పుట్టినింటివారు కానీ, ఇటు మెట్టినింటివారు కానీ ఎవరూ లేరు అప్పట్లో. ఇరు కుటుంబాల వారిని ఒప్పించడమే చాలా పెద్ద పనైంది మాకు. చివరికి అందరి ఆశీర్వాదాలతోనే మేము విదేశాలకు పయనం అయ్యాము.

ముందుగా హరీష్ గారు వెళ్ళి, అక్కడ వసతులూ, సదుపాయాలు అన్నీ సమకూర్చుకున్న తరువాత నేను వెళ్ళేలాగా నిర్ణయించుకున్నాము. ఒక నెల లోపే ఆయన ప్రయాణం. వారికి వీడ్కోలు చెప్పడానికి అందరమూ చెన్నై వెళ్ళాము. హరీష్ గారు విమానాశ్రయం లోపలికి వెళుతుంటే నాలోని భాగమేదో నన్ను వీడి దూరంగా వెళుతున్నట్లుగా తోచింది. హరీష్ గారితో ఈ రెండేళ్ల వైవాహిక జీవితం ఎంతో అద్భుతంగా గడిచింది. ఆత్మీయులకు వీడ్కోలు చెప్పడం ఇంత కష్టంగా ఉంటుందా? భారమైన హృదయంతో చెన్నై విమానాశ్రయం నుంచి వెనుదిరిగాను.

విశాఖపట్నం తిరిగి వచ్చేస్తుంటే నాకేదో వెలితిగా, బెంగగా అనిపించింది. ఆ తరువాతి మూడు నెలల 'నిరీక్షణ కాలం' హరీష్ గారు నాకు 'ఎంత అపురూపమైన వ్యక్తి' అన్నది అర్థం అయ్యేలా చేసింది. పగలంతా పనితో గడిచిపోయేది. మిగిలిన సమయంలో మా అక్కయ్య కుటుంబం నాకు తోడుగా నిలబడ్డారు. అక్కయ్య కుమార్తె 'శారద' మరియు అక్కయ్య

కుమారుడు 'సంతోష్'లతో గడిపే దాన్ని. మొత్తం మీద ఎలాగోలా మూడు నెలలూ గడిచిపోయాయి.

సిడ్నీ వెళ్ళేటప్పుడు, నాకు వీడ్కోలు చెప్పడానికి ఢిల్లీ విమానాశ్రయానికి విచ్చేసిన అమ్మనూ, అక్కయ్య కుటుంబాలనూ వదిలి వెళ్ళేటప్పుడు ఎంతో బాధపడ్డాను. కానీ హరీష్ గారిని కలుసుకోబోతున్నాను కాబట్టి కొద్దిగా ఊరట చెందాను.

దాదాపు ఒక సంవత్సరకాలం సిడ్నీ లోనే ఉన్నాము. ఇక్కడ గడిపిన ఈ కొద్ది సమయంలో కూడా మాకు చాలామంది స్నేహితులయ్యారు. వారందరూ కూడా మా లాగే భారతదేశం నుంచి సిడ్నీకి వచ్చినవాళ్ళే. కానీ ఉద్యోగావకాశాలు మెల్బోర్న్ లో మెరుగ్గా ఉండడంతో సిడ్నీ నుంచి మెల్బోర్న్‌కి తరలి వెళ్ళాము.

సిడ్నీలో మేము గడిపిన కాలం, ఎన్నో మధురస్మృతుల్ని మిగిల్చింది. ఈ మెల్బోర్న్‌కి రావడం అన్నది నా దివ్యప్రణాళిక లోని భాగం అని కానీ, ముందు ముందు జరగబోయేదంతా నేను ఏమాత్రం ఊహించలేదు. ఎంతో సాధారణంగా మెల్బోర్న్‌కి వచ్చేసాము.

6. మెల్బోర్న్ లో మా జీవితం

1992 ఫిబ్రవరి నెలలో మేము మెల్బోర్న్ కి చేరుకున్నాము. నా జీవితంలో ఈ సంవత్సరం ఒక మైలురాయి లాంటిదని చెప్పుకోవచ్చు. ప్రపంచం లోనే అతి గొప్ప 'ఆయిల్ అండ్ గ్యాస్ మల్టీ నేషనల్ ఆర్గనైజేషన్' లో నేను ఉద్యోగంలో చేరడం, మరియు అన్నిటికంటే ముఖ్యంగా మా కలల పంట, మా తొలి సంతానం 'నిఖిల్' ఈ భూమి మీద జన్మ తీసుకోవడం అన్నీ ఈ సంవత్సరమే జరిగాయి.

డిసెంబర్ పదవ తేదీ, గురువారం, వేసవికాలంలో నిఖిల్ పుట్టాడు. నా ప్రసవానికి వచ్చిన మా తల్లిగారు మనవడిని చూసి ఎంతగానో మురిసిపోయారు. నిఖిల్ లాంటి గొప్ప మాష్టర్ మమ్మల్ని తల్లిదండ్రులుగా ఎంచుకున్నందుకు మేమిద్దరమూ ఎంతో సంతోషపడ్డాము.

దాదాపు మూడేళ్ళ తరువాత 1996, మార్చ్ ఎనిమిది, శుక్రవారం నాడు, మా గారాలపట్టి 'నవ్య' మమ్మల్ని తల్లిదండ్రులుగా ఎంచుకుని ఈ భూమ్మీద జన్మ తీసుకుంది.

అటు ఉద్యోగ బాధ్యతలూ, ఇటు పిల్లల ఆలనా పాలనలతో మాకు పూర్తిగా జీవితం మరింత బిజీగా అయిపోయింది. కాబట్టి నేను ఇంకా క్రమ పద్ధతిలో, ప్రణాళిక ప్రకారం అన్నీ అమర్చుకునేదాన్ని. అప్పుడే పిల్లలతో కావలసినంత సమయం గడపగలిగేవాళ్ళము.

ఇది చాలదన్నట్లు అడపాదడపా సంఘసేవ కార్యక్రమాలు, మరియు 'ఇక్కడున్న మన ప్రవాస భారతీయులు' నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమంలో

పాల్గొనడం లాంటి వాటి వలన నిముషం తీరిక లేకుండా పోయింది.

ఇక్కడ జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే పిల్లలకు, నృత్యం కట్టి వారితో సాధన చేయించడం, సంగీత కార్యక్రమంలో పాల్గొనేవారికి తర్ఫీదు ఇవ్వడం లాంటి వాటితో సమయం ఎలా గడిచేదో తెలిసేది కాదు. ఇక్కడ కూడా మాకు మంచి స్నేహితుల సహచర్యం లభించింది. అది మా అదృష్టంగా భావిస్తున్నాను. ఇక వారంతాల్లో చెప్పాల్సిన పనే లేదు. ఎవరో స్నేహితులు మా ఇంటికి రావడం, లేదా మేము స్నేహితుల ఇళ్లకు వెళ్లడం, లాంటివి జరుగుతూ ఉండేది. కానీ మేము మాత్రం పిల్లల విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకునేవాళ్ళము. వారి 'ఆలనాపాలన' ల విషయంలో ఎలాంటి అశ్రద్ధ చేయలేదు.

సమయం యొక్క విలువ బాగా అర్థం చేసుకున్న నేను, ఎప్పటికప్పుడు చాకచక్యంతో ఇంటా, బయట అన్ని పనుల్ని చక్కగా నెట్టుకు వచ్చేదాన్ని. సమయపాలన అన్నింటా పాటించేదాన్ని. అప్పుడే నాకు సేవా కార్యక్రమాలకూ, మరియు సాంస్కృతిక కార్యక్రమాలకూ సమయం దొరికేది.

ఇంతే కాకుండా ఎవరైనా మన దేశం నుంచి ఆస్ట్రేలియాకు ఉద్యోగరీత్యా కానీ, లేదా ఉద్యోగం చూసుకోవడానికి వచ్చిన వారికి మా చేతనైనంత సహాయ సహకారాలు అందించేవాళ్ళము. ఉద్యోగ అవకాశాల గురించి సలహాలు ఇవ్వడం, మరియు అన్ని విధాలుగా మార్గదర్శకత్వం వహించేవాళ్ళము. ఆస్ట్రేలియా ప్రభుత్వం వారు కూడా కొత్తగా ఇక్కడికి వచ్చిన విదేశీయులకి సహాయం చేసేవారు. కానీ అవి అందడానికి కొంత సమయం పడుతుంది. అంతవరకూ ఇబ్బంది పడకుండా మా ఇంట్లోనే వారికి అన్ని వసతులూ కల్పించి వాళ్ళు ఏ విధంగానూ ఇబ్బంది పడకుండా చూసుకునే వాళ్ళము.

పంతొమ్మిది వందల తొంభైలల్లో ఆస్ట్రేలియాలో ఉద్యోగం దొరకడం కష్టంగా ఉండేది. ఆర్థిక మాంద్యం ఉండేది అప్పట్లో, కాబట్టి కొత్త వాళ్ళకి మా చేతనైన సహాయం చేసేవాళ్ళము.

మేము ఎంతగా ఇక్కడ తీరిక లేకుండా ఉండినా కానీ, భారతదేశం లోని మా కుటుంబాలతో మాత్రం సత్సంబంధాలు కొనసాగించాము. చాలా వరకూ డిసెంబర్ నెలలో, పిల్లలకి వేసవి సెలవులు ఇచ్చినప్పుడు భారతదేశానికి వచ్చి వెళ్ళేవాళ్ళము. దీనివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు పిల్లలు నేర్చుకోవడమే కాకుండా, మా కుటుంబాలతో కూడా ఎంతో చక్కటి అనుబంధం కలిగి ఉండేవారు.

మా పిల్లలు ప్రతి వేసవి సెలవుల్లో ఇండియా వెళ్ళడానికై ఎదురు చూసేవారు. భారతదేశం అంటేనే బందువులు, స్నేహితులు వారిపై చూపే ప్రేమ, అనురాగాలు వారికి గుర్తుకొచ్చేది. ఈసారి భారతదేశం వెళ్ళినప్పుడు రుచి చూడాల్సిన రకరకాల వంటలూ, చూడవలసిన సినిమాల గురించి ఎంతో ఉత్సాహంగా రెండు, మూడు నెలల ముందు నుంచే నిర్ణయించుకునేవారు.

7. నా ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభం

పెద్ద మల్టీనేషనల్ ఆర్గనైజేషన్ లో మంచి ఉద్యోగం, మంచి భర్త చక్కటి రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలూ, సంఘంలో మంచి పేరూ, పలుకుబడీ అన్నీ ఉన్నాయిప్పుడు. పదేళ్ల బాబు 'నిఖిల్, ఏడేళ్ళ పాప నవ్య'లతో ఎంతో ఆనందంగానూ, బిజీ గానూ గడుస్తున్న రోజులవి.

ఉదయం ఎనిమిది గంటల నుండి, సాయంత్రం అయిదు గంటల వరకూ ఆఫీసు కార్యనిర్వహణలో గడచిపోయేది. ఉద్యోగంలో కూడా మంచి పేరు తెచ్చుకున్నాను. పనిలో 'నాణ్యత లోపం' జరగకుండా ఎంతో అంకిత భావంతో పని చేసేదాన్ని. మల్టీనేషనల్ కంపెనీ లో పనిచేస్తున్నాను కాబట్టి ఆ పోటీ ప్రపంచానికి ధీటుగా నేను కూడా నాకు కేటాయించిన పని నిర్ణీత సమయంలో ముగించేసేదాన్ని. కొంతమంది సాయంత్రం అయిదు తరువాత కూడా పని చేసుకుంటూ ఉండేవారు. వారందరూ పనే లోకంగా బ్రతికేవారు. నేను కూడా చేస్తున్న ఉద్యోగానికి ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేదాన్ని, కానీ మా నిఖిల్, నవ్యలు చిన్న పిల్లలు కావడంతో సాయంత్రం అయిదు గంటల తరువాత ఇక కార్యాలయంలో ఉండేదాన్ని కాదు.

జీవితంలో అన్నిటికంటే కూడా నేను మొదటి ప్రాధాన్యత పిల్లలకు ఇచ్చేదాన్ని. మొదట పిల్లలు, తరువాతే ఏదైనా. చేస్తున్న ఉద్యోగం పట్ల ఎంతో అకుంఠిత దీక్షతో పనిచేసే నేను, మా పిల్లల పెంపకం విషయానికి వస్తే అంతకంటే ఎక్కువ శ్రద్ధ చూపించేదాన్ని. అటు ఉద్యోగానికీ, ఇటు కుటుంబానికీ న్యాయం చేయడానికి ప్రయత్నించేదాన్ని. కాబట్టి నా జీవితం ఇంకా బిజీ అయిపోయింది. ఉద్యోగంలో పనులు సమర్ధవంతంగా

ముగిస్తూనే, నా కుటుంబాన్ని సంతోషంగా ఉంచడానికి ప్రయత్నించేదాన్ని. దానివలన నా జీవితం పరుగు పందెం లాగా మారింది. మా పిల్లల పాఠశాలలో ఏ ఫంక్షన్ కైనా తల్లిదండ్రుల్ని ఆహ్వానించారంటే, నేను తప్పనిసరిగా వెళ్లి పాల్గొనేదాన్ని. ప్రతీ బుధవారం వారికి పాఠశాలలో ఉపన్యాసాలు చదవవలసి వచ్చేది.

అందుకని ఆఫీసులో ముందుగానే అనుమతి తీసుకుని మరీ, వారికి సహాయం చేసేదాన్ని. అందరు ఉద్యోగం చేసే తల్లుల్లాగే నేను కూడా మా పిల్లలకు అమ్మ 'తన సమయం' మా కివ్వడం లేదనే భావన రానీయకుండా, ఎంతో శ్రద్ధ తీసుకునే దాన్ని. మా కుటుంబ సభ్యులు ఎవరైనా ఉండి ఉంటే నాకు కొద్దిగా పిల్లల పెంపకంలో వెసులుబాటు ఉండేదేమో, కానీ ఎవరూ ఇక్కడ లేకపోవడంతో కొద్దిగా ఇబ్బందిపడ్డ మాట వాస్తవం.

ప్రతి రోజూ చెయ్యవలసిన పనుల జాబితా రాసుకునేదాన్ని. ఈ జాబితాలో నేను చెయ్యకుండా మిగిలిపోయిన పనుల్ని, మరుసటి రోజుకు వాయిదా వేసేదాన్ని. ఈ జాబితాల కాగితాల్ని ఎక్కడ మరచిపోతానోనని రిఫ్రిజిరేటర్‌కు అతికించి పెట్టుకునేదాన్ని. అన్నీ సమర్థవంతంగా ముగించడానికి ప్రయత్నించేదాన్ని. ఏదైనా చేయలేకపోతే నన్ను నేను నిందించుకుని, మళ్ళీ ఆ పనులన్నీ నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి ప్రయత్నించేదాన్ని.

కానీ నేను చెయ్యవలసిన పనుల జాబితా, ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉండేది. ఇలా రాసిపెట్టుకుని ఒక ప్రణాళిక ప్రకారం పనులు చేసుకోవడం వల్ల ఒకింత అన్ని పనులూ చేసుకో గలిగే దాన్ని. లేకపోతే అటు ఇంటి పనులూ, ఇటు ఆఫీస్ పనులూ పూర్తి చెయ్యడం కష్టం అయ్యేది. ఇవి

కాకుండా సంఘసేవ, అవసరం ఉన్నవాళ్ళకి సహాయ పడటం మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో వారాంతాల్లో కూడా నిముషం వృధా చేయకుండా గడిపేసేదాన్ని. ఏదో పరుగు పందెంలో పాల్గొన్నట్లు ఎప్పుడూ ఉరుకులు పరుగుల మీద కాలం గడచిపోతూ ఉండేది నాకు. వీరందరికి సేవ చెయ్యడం, అందరూ సంతోషంగా ఉన్నారా లేదా అని చూసుకునేదాన్ని. 'నేను అన్నీ చెయ్యగలను, 'అన్నీ చేసెయ్యాలి' అంతే, అని అనుకునేదాన్ని. నా గురించి నేను పెద్దగా పట్టించుకునే దాన్ని కాదు.

నేను చాలా సమర్థవంతురాలిని, కాబట్టి అన్నీ ఒంటి చేత్తో చేసెయ్యాలి అనుకునేదాన్ని. వీరందరినీ చూసుకోవడం, అందరికీ సహాయం చెయ్యడం, నా బాధ్యతగా అనుకునేదాన్ని. అలా చెయ్యలేకపోతే, నా అసమర్థతకు నామీద నాకే చాలా కోపం వచ్చేది. నన్ను, నేను క్షమించుకోలేక పోయేదాన్ని. అందరికి న్యాయం చెయ్యాలి అంతే, అనుకునేదాన్ని. అటు ఉద్యోగపరమైన బాధ్యతలు, ఇటు పిల్లల పోషణ, సంఘం పట్ల నా బాధ్యత, మరియు కొత్తగా ఆస్ట్రేలియాకు వలస వచ్చిన భారతీయులకు మా సహాయ సహకారాలు అందించడం, ఇవన్నీ క్రమం తప్పకుండా చేస్తూ ఉండేదాన్ని. పైకి నవ్వుతూ, చలాకీగా పనులు చేసుకుంటూ, సరదాగా ఉన్నట్లు కనిపించినా, నా లోపల జీవించడానికి పోరాడుతున్న 'నన్ను' నా భర్త హరీష్ గారు మాత్రం గుర్తించారు.

అది అక్టోబర్ 2002 మధ్యాహ్న సమయం అప్పుడు జరిగింది అది. ఉన్నట్టుండి నాలో ఏదో నిశ్శబ్దం. "జీవితం అంటే ఇంతేనా" ఇప్పటికి దాదాపు రెండు, మూడు నెలల నుంచీ నేను రాత్రింబవళ్ళు పని చేస్తూనే ఉన్నాను. అటు మానసికంగా, ఇటు శారీరకంగా అలసిపోయాను. ఒకలాంటి ఉద్వేగం, మాటలకు అందడం లేదు. ఏమీ అర్థం కాని స్థితి.

ఆలోచనల్లేవు, ఏమీ లేదు, అంతా నిశ్శబ్దం. ఉద్యోగ పరమైన బాధ్యతలు నిర్వహించే సమయంలోనే ఈ అలజడి మొదలయ్యింది. వెంటనే సెలవు పెట్టి ఇంటికి వచ్చేసాను. నాలో ఏదో జరుగుతోంది. విచిత్రమైన స్థితిలో ఉన్నాను. ఆలోచించడం మానేశాను. ఏదో స్తబ్ధత.

అలా కూర్చుని కిటికీలోంచి మా తోటని చూస్తూ గంటలు, గంటలు గడిపేసేదాన్ని. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎన్నో రోజులు గడచిపోయాయి. ఏదో వెలితి. ఒంటరిగా అలా కూర్చుని ఉండి పోతున్నాను. లోపల ఏదో విపరీతమైన అలజడి, దానితో పోరాడాలని కూడా నాకు లేదు. ఇక గెలవడం ఎక్కడ? ఎందుకు పోరాటం? ఎందుకు గెలవడం?

'కడలితరంగం' లా ఎంతో సందడిగా ఉండే నేను, అందరినీ కలుపుకుంటూ, నాలుగు చేతులతో అన్నింటినీ సమర్థవంతంగా నెట్టుకు వస్తున్న నేను, పిల్లల్నీ, వారి అవసరాల్నీ, ఎప్పుడూ కనిపెట్టుకుని ఉండే నేను, ఇలా కూర్చుని నిశ్శబ్దంగా ఉండడాన్ని వారు భరించలేక పోతున్నారు.

నా భర్త హరీష్ గారూ, నా పిల్లలూ, ఇలా నన్ను చూడలేక, ఏమి చెయ్యాలో అర్థం కాక సతమతమవుతున్నారు. నాకు కొద్దిగా సమయం ఇస్తే అన్నీ అవే సర్దుకుంటాయి అని నా భర్త హరీష్ గారు నిర్ణయించుకున్నారు.

కొన్నాళ్ల తరువాత, మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నేను మా ఇంటి ముందు తచ్చాడుతున్నాను. బయట ఏమి జరుగుతోందని పట్టించుకునే స్థితిలో లేను. ఎవరో నన్ను పిలుస్తున్నారు. ఎవరూ? ఒకావిడ పిలుస్తున్నారు. ఆవిడ్ని నేను ఎవరింటికో వెళ్ళినపుడు చూసాను, ఆవిడ్ని. ' పిన్నిగారూ' అని పిలిచాము అందరమూ, ఆ పిన్నిగారే పిలుస్తున్నారు. "ఎలా ఉన్నావమ్మా?"

"ఎక్కడికో వెళ్తున్నట్టున్నావు?" అని అడుగుతున్నట్టున్నారు. నేను జవాబు ఇచ్చానా? తెలియదు. వేరే లోకంలో ఉన్నానాయే. వాళ్ళింటికి రమ్మని పిలుస్తున్నట్టున్నారు. నిశ్శబ్దంగా అనుసరించాను ఆవిడ్ని.

మా ఇంటికి దగ్గర్లోనే వారిల్లు ఉంది. వారింటికి తీసుకెళ్లిన పిన్నిగారు నన్ను కూర్చోమన్నారు. నేను బాసింపట్టు వేసుకుని కూర్చున్నాను. చేతులు రెండూ జోడించి ఒడిలో పెట్టుకోమని చెప్పారు. కళ్ళు రెండూ మూసి ఉంచి 'శ్వాస మీద ధ్యాస' పెట్టమన్నారు. ఏమీ ప్రశ్నించకుండా 'పిన్నిగారు' చెప్పినదాన్ని అనుసరిస్తున్నాను. కొన్ని నిముషాల వరకూ, అంతా తెలుస్తూనే ఉంది, మళ్ళీ ' నిశ్శబ్దం'.

ఒక గుడిలో ఉన్నాను నేను. గుడి కట్టడం, నిర్మాణాన్ని బట్టి అయిదవ శతాబ్దం నాటి గుడి అది అనుకుంటాను. చిన్న గుడి అది, కానీ గోపురం పెద్దగా ఉంది. గుడిలో వెలుగుతున్న దీపాలు అక్కడక్కడా వేలాడుతున్నాయి. నేలంతా చిత్తడిగా ఉంది. దగ్గర్లోనే ఎక్కడో నీటి ప్రవాహం ఉన్నట్టు ఉంది. గుడి ప్రాంగణంలో ఎవరూ లేరు ఎందుకో? గుడి మధ్యలో శివలింగం, అలా నిలబడి చూస్తున్నాను, ఆ ప్రశాంతతను, పవిత్రతనూ ఆస్వాదిస్తున్నాను.

ఏమిటో పిన్నిగారి గొంతు వినిపిస్తోంది. "సరోజా" "అమ్మా సరోజా" "పావు తక్కువ నాలుగు అయ్యింది, మరి పిల్లల్ని బడి నుంచి తీసుకురావాలేమో కదమ్మా" అంటున్నారు. ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. ఎక్కడున్నాను? అర్థం కావడానికి కొంత సమయం పట్టింది. పిన్నిగారి ముందు కూర్చుని ఉన్నాను. ఏదో తెలియని ప్రశాంతత. చాలా నేపు నేను విశ్రాంతి తీసుకున్నట్టు తోచింది. ఆ అలజడి ఎక్కడ? కళ్ళ నిండుగా నీళ్లతో పిన్నిగారిని అడిగాను. "నేను ఇంతసేపు ఏమి చేశాను" అని. ఆవిడ అన్నారు " ధ్యానం చేసావమ్మా",

అప్పుడు చేతి గడియారం చూసుకున్నాను. దాదాపు రెండు గంటల కంటే ఎక్కువ సమయం నేను అదే స్థితిలో గడిపానని అర్థమైంది. ఒక్క రెండు నిముషాలు గడిచిందని అనుకుంటున్న నాకు ఇది ఒక అద్భుతమైన విషయంలా అనిపించింది.

'ఓ దీనినే ధ్యానం అంటారన్నమాట' అనుకున్నాను. నా లోపలంతా కడిగేసినట్లు శుభ్రంగా ఉన్న భావన. పిన్నిగారితో ఇదే చెప్పాను. ఆవిడ ఎంతో సంతోషించారు. ఈ ధ్యానాన్ని 'ఆనాపానసతి' అంటారన్నారు అవిడ. ఈ ధ్యానాన్ని గౌతమ బుద్దుల వారు కూడా చేసేవారని చెప్పారావిడ. అంత కష్టం కూడా కాదు. మనం చేయాల్సిందంతా శ్వాస మీద ధ్యాస పెట్టడమే. మళ్ళీ వస్తానని ఆవిడ దగ్గర వీడ్కోలు తీసుకుని పిల్లల్ని తీసుకు రావడానికి వారి పాఠశాలకు బయలుదేరాను.

ఈ గడచిన కొన్ని గంటల్లో ఏదో జరిగింది. ఏదో నూతన శక్తిని పొందినట్టు అనిపిస్తుంది. ఆ వెలితి, అలజడి, అసహాయత ఇవన్నీ మటుమాయమై పోయాయి. నా చుట్టూ ప్రపంచం, నా లోపల ప్రపంచం అంతా నూతనత్వం సంతరించుకున్నాయి. ప్రపంచం అంతా ఉన్నట్టుండి అందంగా కనిపిస్తుందేమిటో. నాకింక బాగా గుర్తు. నాకిష్టమైన పాటేదో కూనిరాగం తీస్తూ వెళ్ళాను బడికి, మా పిల్లల్ని తీసుకురావడానికి.

నాకు ఆ సమయానికి తెలియదు, నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైందనీ, జీవితానికి ఒక కొత్త అర్థం ఉందనీ, నా జీవిత గమ్యం నిర్దేశింపబడి ఉందనీను, నా ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభమైంది. నిర్భయంగా ఆ దారిలో అడుగుపెట్టాను. ఇంకో దారిలో వెళ్ళాలనే ఆలోచన నాకెన్నడూ రాలేదు.

8. ఆధ్యాత్మిక ప్రభంజనం –నా అలౌకిక స్థితి

ఆ తరువాత గడచిన కొన్ని వారాలు ఒక 'అందమైన కల' లాగా గడిచాయి. పిన్నిగారితో మాట్లాడి, ప్రొద్దున, సాయంత్రం ఇద్దరమూ కలిసి ధ్యానం చేసేలాగ నిర్ణయం తీసుకున్నాము. ఆవిడ సమక్షంలో ధ్యానం చెయ్యడం అన్నది నాకు ఎంతో స్వాంతన మరియు ఉత్సాహాన్ని ఇచ్చింది.

పిన్నిగారితో కలిసి గంటసేపు ధ్యానం చెయ్యడం తోనే నా దినచర్య ప్రారంభమయ్యేది. హరీష్ గారు ఆఫీసుకు, పిల్లలు పాఠశాలకు వెళ్లిన వెంటనే కూర్చుని రెండు, మూడు గంటల పాటు ధ్యానం చేసుకునేదాన్ని. సాయంత్రాల్లో పిన్నిగారితో కలిసి దగ్గర్లోనే ఉన్న, కొత్తగా వియత్నామీయులు కట్టించిన 'బుద్ధులవారి' గుడికి వెళ్లి, వారి ధ్యాన మందిరంలో ధ్యానం చేసేదాన్ని.

ఆ ధ్యాన మందిరం స్ప్రింగ్ వేల్ రోడ్డులో ఉంది. ఆ ధ్యాన మందిరం లోపలి వాతావరణం ఎంతో ప్రశాంతతను సంతరించుకుని ఉంది. అందుకే ఆ ధ్యాన మందిరం అంటే నాకు ఎంతో ఇష్టం. అక్కడ కూర్చుని ధ్యానం చేస్తుంటే ఎంతో ప్రశాంతతను పొందేదాన్ని. ఎంతైనా గుడి వాతావరణం ఒకలాంటి పవిత్రతనూ, ప్రశాంతతను కలిగి ఉంటుంది కదా మరి. ఆ గుడిలో అడుగు పెట్టిన తోడనే వేరే ప్రపంచంలోకి అడుగు పెట్టిన అనుభూతికి లోనైయ్యేదానిని. సాయంత్రం ఆ గుడిలో ధ్యానం చేయడం కోసమని నిరీక్షిస్తూ ఉండేదాన్ని.

నా కుటుంబ సభ్యులకు, నేను మామూలు మనిషి అవ్వడం ఎంతో ఊరట కలిగించింది. నాలోని మార్పు ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉన్నప్పటికీ,

నేను అన్ని బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉండటంతో వారు కూడా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. ఆ సమయంలో నా భర్త హరీష్ గారు, ఇంటి పనుల్లోనూ, పిల్లల అవసరాలు చూడటంలోనూ ఎంతో సహకరిస్తూ నాకు ఎక్కువ ఒత్తిడి కాకుండా, నేను ఎంచుకున్న మార్గాన్ని ఇంకా క్షుణ్ణంగా పరిశోధించడానికి నాకు కావలసినంత వెసులుబాటు కల్పించారు.

ఒకరోజు పిన్నిగారు నాకు రెండు ఆడియో కేసెట్లు ఇచ్చారు. 'ఆత్మ విజ్ఞానము మరియు 'ముక్తిమార్గము', "ఇవి విని ఆనందించు తల్లీ" అని దీవించి ఇచ్చారావిడ. ఇంటికి వచ్చీ రావడం తోనే ఆ రెండు ఆడియోలూ పెట్టుకుని ఏకధాటిగా విన్నాను. అది పూర్తి అయ్యేసరికి నా కళ్ళనుండి ఆనందబాష్పాలు ధారలుగా కారిపోతున్నాయి. అందులో నుండి జాలువారిన ప్రతి పదం కూడా నా ఆత్మని స్పర్శించాయి. జరుగుతున్నదంతా ఒక ప్రణాళికా బద్ధంగా జరుగుతోందని అర్థమైంది. ఆ ఆడియోలో ఉన్నదంతా నా కోసమే రికార్డ్ చేశారా అన్నట్టుంది. జీవితానికి కొత్త నిర్వచనం చెప్పారు అందులో. జీవితసారం అర్థం కావడానికి, కళ్లముందు అడ్డుగా ఉన్న తెర ఏదో తొలగి పోయినట్టైంది. గడచిన ముప్పై ఏళ్ల నా జీవితాన్ని పునరావలోకనం చేసుకుని, నేను పోషించిన పాత్రను తలుచుకుని నవ్వుకున్నాను. ఈ రెండు క్యాసెట్లు నాకు, నా ఆధ్యాత్మిక ప్రయాణానికి ఎంతగానో ఉపయోగ పడ్డాయి.

గత కొన్ని వారాలుగా నా జీవితంలో జరుగుతున్నదంతా అర్థవంతంగా కనిపించసాగింది. నేను ఎందుకు అంత ఉద్విగ్నతకు, అలజడికి గురి అయ్యాను అన్నది తేటతెల్లమైంది. ఇది నా ఆధ్యాత్మిక పురోగమనానికి పిలుపు అన్నమాట. నేను జన్మ తీసుకుని ఈ భూమ్మీదికి రాక పూర్వమే నా ఆధ్యాత్మిక ప్రయాణం ఎప్పట్నించి మొదలుపెట్టాలో నిర్ణయించుకుని

వచ్చానన్నమాట. నేను ఏమేమి చెయ్యాలని ఈ భూమ్మీదికి వచ్చానో, అవన్నీ ఒక ప్రభంజనంలాగా, ఒక వెల్లువలాగా ప్రారంభమైంది..ఆ రోజు ఆఫీసులో జరిగినదంతా ఒక 'నూతన అధ్యాయానికి ప్రారంభం' అన్నమాట. జరుగుతున్న జీవితాన్ని పరిశీలన చేసుకోవడానికి జరిగిన సంఘటనలుగా భావిస్తున్నాను. నన్ను నేను పునః పరిశీలించుకుని నా ఆధ్యాత్మిక ప్రయాణం లో ముందుకు సాగాను.

" ఇంతకీ ఈ క్యాసెట్లు చేసిన వ్యక్తి ఎవరు ?" అనుకుని ఆ కవరు పైన చూస్తే ఒక నెరసిన గడ్డంగల వ్యక్తి ఫోటో ఉంది అక్కడ. ఆయన పేరు 'బ్రహ్మర్షి పత్రీజీ ' అని ఉంది. చూసిన వెంటనే నా మనసులో మెదిలిన ఆలోచన 'ఆయన నా ఆత్మబంధువు, నా మార్గదర్శి, నా స్నేహితుడు' అని.

మరుసటి రోజు పిన్నిగారింటికి వెళ్ళిన వెంటనే ఎంతో ఆతురతతో ఆ కవరు మీద కనిపించిన ఆయన గురించి అడిగాను. ఆవిడ ఈ పత్రీజీగా పిలువబడే ఆయన 'పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ యొక్క వ్యవస్థాపకులు అని చెప్పారు. అంతే కాదు, మన దేశంలోనే కాకుండా, ప్రపంచమంతటా ఆధ్యాత్మికంగా సంపూర్ణమైన పరివర్తన (మార్పు) తీసుకురావడానికి, ఆనాపానసతి ధ్యానాన్ని, ఆత్మజ్ఞానాన్నీ, అందరికీ అందుబాటులోకి తెస్తున్న 'మహామనీషి' గా చెప్పారు. "అవునా" అనుకున్నాను.

ఆ రోజు సాయంత్రం ఆ క్యాసెట్లు మళ్ళీ శ్రద్ధగా విని అందులో పత్రీజీ గారు ప్రస్తావించిన గ్రంథాల జాబితా రాసుకున్నాను. మాకు దగ్గరలోనే ఉన్న గ్రంథాలయానికి వెళ్ళి నేను తయారు చేసుకున్న జాబితాలో ఉన్న మొదటి గ్రంథం 'ఒకయోగి ఆత్మకథ' కోసం చూస్తుంటే ఆ గ్రంథం నా కోసమే నిరీక్షిస్తూ బల్ల మీద కనబడింది. మరి ఇంకేమీ ఆలోచించలేదు.

వెళ్ళి అక్కడే కూర్చుని చదవడం ప్రారంభించాను. ఏకబిగిన అలా చదివేసికానీ, లేవలేదు నేను.

నాలోపల ఒక కొత్త ప్రపంచం బహిర్గతం అవుతున్న అనుభూతి కలిగింది. ఒక అద్భుతమైన అనుభూతి. నా చుట్టూ ఉన్న ప్రపంచం అంతా అర్థవంతంగా, అంతటికీ ఒక ఉద్దేశ్యం, ఒక పరమార్థం ఉన్నట్టు గోచరించసాగింది. ఈ అద్భుతమైన నూతన ప్రపంచానికి తాళంచెవి ఏదో నాకు దొరికినట్లు అనిపించింది. నేను కొత్తగా కనుక్కున్న ఈ నూతన ప్రపంచం నుంచి నాకు వెనుతిరగాలని లేదు.

జరుగుతున్నదంతా నా కుటుంబంతో పంచుకోవాలని తోచింది. వారిని కూర్చోపెట్టి అన్నీ చెప్పాను. వారు కూడా ఈ కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టాలని కోరుకున్నాను. ఆ రోజు సాయంత్రం హరీష్ గారితో కలిసి వాహ్యాళికి వెళ్ళినపుడు నేను తెలుసుకున్న సత్యాన్ని విపులంగా చెప్పాను. నా ఈ కొత్త ప్రపంచం గురించి మొత్తం పూసగుచ్చినట్లు వివరించాను. నేను చేస్తున్న ధ్యానం గురించి, తద్వారా నేను పొందుతున్న అనుభవాల గురించి, అద్భుతమైన ఈ ప్రయాణం గురించి ఆయనకు చెప్పాను.

ఇక ఆ రోజు నుండి నేను పొందిన ధ్యాన అనుభవాలని, మరియు గ్రంథాలు చదివి నేను నేర్చుకున్న జ్ఞానాన్నీ కూడా ప్రతీది హరీష్ గారితో పంచుకునేదాన్ని. ఆయన తన ప్రశాంత చిత్తాన్ని కోల్పోకుండా ఎంతో ఓపికగా వినేవారు. ఒక్కొక్కసారి నేను సరైన మార్గంలోనే వెళుతున్నానా? అనే సందేహం ఆయన కళ్ళల్లో కనిపించి, కనిపించనట్లు కనిపించేది. కానీ నేను ముందుకంటే సంతోషంగా, చలాకిగా, చురుగ్గా ఉండటాన్ని గమనించిన ఆయన, మరి ఇక ఏమి అనలేదు. నేను మాత్రం కొత్తగా జీవితంలోని ప్రతి నిముషాన్నీ, ఆనందంగా ఆస్వాదిస్తున్నాను.

ఇంకో రెండు గ్రంధాలు 'యు ఫరెవర్ ' 'ది వైట్ బుక్ ' లోబ్ సాంగ్ రాంపాగారివి చదవడం, నా ఆలోచనా సరళినీ, నా జీవితాన్ని మరింతగా ప్రభావితం చేశాయి. నాలో విలీనమై ఉన్న అంతర్గత శక్తిని గుర్తించ గలుగుతున్నాను. నాలోపలే దాగి ఉన్న గొప్ప పెన్నిధిని కనుక్కున్నట్టు అయ్యింది. మా పిల్లలకు నేను నేర్చుకున్నదంతా చెబుతూ గంటలు, గంటలు గడిపేసేదాన్ని.

మునుపు నేను విపరీతంగా సాంఘిక నవలల్ని ఏకబిగిన చదివేసే దాన్ని. అలాంటి పుస్తకాల మీదికి దృష్టి పోవడం లేదిప్పుడు. నా దృష్టంతా, ఇప్పుడు ఓషో గారి రచనల మీద పడింది. విచిత్రాలు జరగడం ప్రారంభమైంది. నేను ఏ గ్రంథం చదవాలనుకుని గ్రంథాలయానికి వెళతానో, ఆ గ్రంథం నా కోసమే కాచుకుని ఉన్నట్లు కనిపించేది. నా చెయ్యి తనంత తానుగా వెళ్లి, ఏ అల్మారా లోని, ఏ అరలో చెయ్యి పెడితే అక్కడే ఆ గ్రంథం ఉండేది. తీసుకుని చక్కగా చదివి ఇంటికి వచ్చేసేదానిని. మొదట్లో ఇదంతా కాకతాళీయంగా జరిగిందని అనుకున్నాను. కానీ మళ్ళి, మళ్ళి అలాగే జరుగుతూ ఉండడంతో, నా సంకల్ప శక్తి వల్ల ఇలా జరుగుతూ ఉందని గుర్తించాను.

నేను చదువుతున్న గ్రంథాల జాబితా అలా పెరుగుతూనే ఉంది. డాక్టర్. వైనె డయ్యర్ గారు (Dr. Wayne Dyer) రచించిన 'మానిఫెస్ట్ యువర్ డెస్టినీ' మరియు 'పవర్ ఆఫ్ ఇంటెన్షన్' లాంటి గొప్ప, గొప్ప రచనల్ని ఆపోశన పట్టేసాను. చాలా మంది సన్నిహితులకు నేను ఈ 'మానిఫెస్ట్ యువర్ డెస్టినీ' అన్న రచనను బహూకరించాను..

నాకు ఈ గ్రంథాలు చదవాలన్న తృష్ణ ఇంకా పెరిగిపోయింది. చదివినవే మళ్లీ మళ్లీ చదివేదాన్ని. మొదట్లో గ్రంథాలయానికి వెళ్ళి అక్కడే కూర్చుని

చదవలేక, ఇంటికి తెచ్చుకుని చదివి, తిరిగి గ్రంధాలయంలో ఇచ్చి వేసేదాన్ని. నిదానంగా నాకు, ఎప్పుడు, ఏ గ్రంథం కావాలంటే, ఆ గ్రంథం చదవాలన్న కోరిక బలపడటంతో నాకు నచ్చిన ఆధ్యాత్మిక గ్రంథాలన్నీ సేకరించడం ప్రారంభించాను. ప్రస్తుతానికి నా గ్రంథాలయంలో చాలా గ్రంధాలు ఉన్నాయి.

ఆ వేసవి సెలవులకు నేను, హరీష్ గారు, మా పిల్లలతో కలసి 'గోల్డ్‌కోస్ట్'కి వెళ్ళాము, అక్కడ సముద్రానికి ఎదురుగా ఉన్న ఒక అందమైన అపార్ట్మెంట్ లో బస చేసాము. ప్రతి రోజూ ఉదయాన్నే నేను సముద్రతీరంలో కూర్చుని గంటలు, గంటలు ధ్యానం చేస్తూ గడిపేసేదాన్ని.

అప్పుడు ఒక మహాద్భుతమైన అనుభవం కలిగింది. అక్కడికి వెళ్ళిన నాలుగవ రోజు కూడా, రోజూలాగానే కూర్చుని ధ్యానం మొదలు పెట్టాను. ఒక్క క్షణంలో నేను నా శరీరాన్ని వదలి, మరు క్షణంలో ఎక్కడో ఉన్నాను. కానీ కాళ్ళు రెండూ బాసింపట్టు వేసుకుని కూర్చునే ఉన్నాను. ధ్యాన స్థితిలోనే ఉన్నాను. కానీ ఆ గోల్డ్‌కోస్ట్ బీచ్‌లో మాత్రం లేను. అంతా శూన్యం. నా చుట్టూ కోట్ల కొద్ది నక్షత్రాలూ, గ్రహాలూ, నక్షత్ర మండలాలు మిలమిలా మెరుస్తూ ఎంతో అందంగా కనిపిస్తున్నాయి. అద్భుతమైన దృశ్యం. అలా ఆ దృశ్యాన్ని చూస్తూ, తరిస్తూ, 'అలౌకిక స్థితి' లో ఎంతకాలం గడచిపోయిందో తెలియలేదు. నేను మళ్ళీ ఈ బాహ్య ప్రపంచానికి వచ్చేటప్పటికి, ఎంత సమయం గడిచిందో తెలియదు. నా స్థితిని అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టింది.

నా లోపల అంతర్గతంగా జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక పరివర్తనను అర్థం చేసుకోవడానికి నేను ప్రయత్నిస్తుంటే, ఈ బయటి ప్రపంచం నన్ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంది. ఇప్పటికి కొన్ని వారాలుగా

ఉద్యోగానికి సెలవు తీసుకున్న నేను, తిరిగి కార్యాలయానికి వెళ్లలేదు. వారేమో నేను మళ్ళీ ఎప్పుడు తిరిగి వచ్చి, నా పనిని చూసుకుంటానోనని వేచి చూస్తున్నారు. నాకేమో కొత్త ప్రపంచంలోకి అడుగు పెట్టినట్టుంది. ఈ స్వేచ్ఛా ప్రపంచంలో విహరిస్తున్న నాకు తిరిగి ఇప్పుడిప్పుడే ఆ ఉరుకులు, పరుగుల జీవితానికి వెళ్లాలని లేదు.

చివరికి నన్ను సరిచేయమని ఒక కౌన్సిలర్ (సలహాదారుని) పంపించారు. వారం వారం వచ్చి ఆవిడ నన్ను మానసిక సమస్యలనుంచి తొందరగా బయట పడేయటానికి సలహాదారుగా వచ్చారు. ఎంత తొందరగా నేను ఈ మానసిక సమస్యల నుంచి ఉపశమనం పొందితే అంత తొందరగా వెళ్లి పనిలో చేరుతానని వారి ఉద్దేశ్యం. "అలాగే కానీ" అని నేను ఆ వచ్చినావిడతో కూర్చుని గంటలు, గంటలు మట్లాడేసేదాన్ని.

ప్రతివారం ఆవిడ రావడంతోటే, నేనూ, ఆవిడా కూర్చుని చక్కగా కొన్ని గంటలసేపు మాట్లాడుకోవడం జరిగేది. ఈ మధ్యకాలంలో ఆధ్యాత్మికంగా ఎంతో నేర్చుకున్న నాకు, జీవితం ఎంతో 'సానుకూల దృక్పథంతోనూ, నిశ్చింతగానూ, నిండుగానూ, కనిపిస్తూ ఉంది. నా స్థితి ఏమిటి అని ఆవిడకి తెలిసిపోయింది. నాకు ఎలాంటి కౌన్సిలింగ్ అవసరం లేదని ఆవిడకి అర్థమైంది. నేను చదువుతున్న గ్రంథాలలోని జ్ఞానాన్ని, చక్కగా ఆవిడకి చెప్పేదాన్ని. రెండు, మూడు వారాల్లోనే మేము మంచి స్నేహితులమైపోయాము.

చివరికి ఆవిడ, తాను ఎదురుక్కొంటున్న సమస్యల గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. ఆవిడ, తన ఉద్యోగంలో భాగంగా, కష్టాలతోనూ, సమస్యలతోనూ, సతమతం అవుతున్న ఎంతో మందితో మాట్లాడవలసి వస్తుందనిన్నీ, వాళ్ళు చెబుతున్నదంతా ఎంతో

సంయమనంతోనూ, సానుభూతితోనూ విని, వారికి సలహాలు ఇవ్వవలసి ఉంటుందని చెప్పారు. ఇవన్నీ వినీ, వినీ ఆవిడ చాలా ఒత్తిడికి లోనవుతున్నట్టు కూడా చెప్పారు. దీనివలన ఆవిడ తన కుటుంబానికి సరిగ్గా న్యాయం చెయ్యలేక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు చెప్పుకుని వాపోయారావిడ.

జీవించడం అంటే కొత్త అర్థం తెలుసుకున్న నాకు, ఏదీ సమస్యగా అనిపించడం లేదు. జీవితాన్ని ఎదురీదకుండా, 'సంపూర్ణంగా ఎలా జీవించాలో' చెప్పాను ఆవిడకి. ఎవరినో ఉద్ధరించడానికో, ఎవరి కోసమో కాకుండా 'నీకోసం, నువ్వు' జీవించి చూడమని చెప్పాను.

జీవితాన్ని కష్టంగానూ, భారంగానూ గడపకుండా ఎపుటికప్పుడు ఒక్క అడుగు వెనక్కి వేసి జరుగుతున్నదంతా మళ్ళీ పునరావలోకనం చేసి చూడమని చెప్పాను.

కొంత కాలం తరువాత ఆవిడ దగ్గర నుంచి నాకు ఇ-మెయిల్ వచ్చింది. అవిడతో పంచుకున్న జ్ఞానానికీ, స్నేహానికీ, కృతజ్ఞతలు చెపుతూ, చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి, తాను జీవితంలో ఏమి సాధించాలనుకున్నారో, అది సాధించడానికి ముందుకు వెళుతున్నట్లుగా చెప్పారు. ఈ కొద్ది కాలంలోనే చాలా నేర్చుకుని, ఎంతో ఎదిగినట్లుగా చెప్పారావిడ.

"సరోజా, మీరిచ్చిన సలహాల వలన నా జీవితమే మారిపోయింది, కృతజ్ఞతలు" అని చెప్పారు. ఇలా నేను అనుకోకుండా అనధికారికంగా కౌన్సిలింగ్ సెషన్స్ ప్రారంభించడానికి ప్రోద్బలం కలిగింది.

చివరికి, కొంతకాలం తరువాత తిరిగి వెళ్ళి నా ఉద్యోగంలో చేరిపోయాను. చేరకపోతే జరగదని కాదు కానీ, నేను ఇక దేనికి భయపడనక్కర్లేదు. నా నిర్భయత్వం, నన్ను తిరిగి ఉద్యోగంలో చేరేలా చేసింది.

9. గురువుగారితో ముఖాముఖి

గ్రంథ పఠనం అన్నది నా దినచర్యలో ఒక ముఖ్యమైన భాగమైంది. ప్రతి రాత్రీ నిద్రించడానికి ముందు కాస్సేపు ఏవైనా ఆధ్యాత్మిక గ్రంథాల పఠనం చేసేదాన్ని. ముందు పిన్నిగారు నాకు "పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్" **(PSS)** వారిచే ముద్రింపబడిన కొన్ని పత్రికలూ, పుస్తకాలూ ఇచ్చారు. అవి చదవడం పూర్తి అయిన తరువాత, విరామం దొరికినప్పుడల్లా, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారి వెబ్ సైట్కి వెళ్ళి వారు ముద్రించిన పత్రికలలోని వ్యాసాలను ఆన్ లైన్ లో చదవడం అలవాటైంది నాకు.

ప్రతిసారీ నేను ఈ వెబ్ సైట్ చూసినప్పుడల్లా ఈ నెరసిన గడ్డంతో "సుభాష్ పత్రీజీ" అన్న పేరుగల ఆయన నన్ను సూటిగా చూస్తున్నట్లు కనిపించేవారు. ఈ పత్రీజీగారు "పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్మెంట్" (PSSM) అన్న సంస్థ స్థాపించారనీ, ధ్యానానికి ఉన్న శక్తిని, తను స్వయంగా ఎన్నో పరిశోధనలు చేసి మరీ తెలుసుకున్నారనీ, 1979 లోనే ఆత్మ సాక్షాత్కారం పొందారని తెలుసుకున్నాను. అప్పటినుంచీ ధ్యాన ప్రచారం చెయ్యడం, శాకాహారపద్ధతిని ప్రోత్సహించడం తన జీవిత ముఖ్యోద్దేశ్యంగా చేసుకుని, ప్రపంచం నలుమూలలకూ ఈ జ్ఞానం చేరాలని తపన పడుతున్న మహామనీషి ఆయన అని తెలుసుకున్నాను. కులాలకు, మతాలకూ అతీతంగా, శాస్త్రబద్ధంగా, సహేతుకంగా ఈ ధ్యానం గురించి, మరియు శాకాహారం గురించి ప్రచారం చేస్తూ, అందరినీ ఆకట్టుకుంటున్నారు.

ఈ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారి పత్రికల ద్వారా నేను తెలుసుకున్నది ఏమిటంటే ఈ పత్రీజీ గారు "ఆనాపానసతి" ధ్యానాన్ని

ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారనీ, ఆయనకున్న ఒక్కగానొక్క గొప్ప సంకల్పం. ఈ ప్రపంచం అంతటిని "ధ్యాన జగత్"గా మార్చేయాలని చూస్తున్నారని తెలిసింది. ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ ధ్యానులుగా మారి పోవాలని ఆయన నిరంతరమూ, ఎంతగానో శ్రమిస్తున్నారని తెలిసింది. పత్రీజీ గారి ద్వారా ధ్యానం నేర్చుకుని, తమ తమ జీవితాలని చక్కగా మలచుకున్న ఎంతో మంది ధ్యానుల గురించి ఈ పిరమిడ్ సొసైటీ వారు ముద్రిస్తున్న పత్రికలలోని వ్యాసాలలో చెప్పబడి ఉంది. పిన్నిగారు నాకు ఇచ్చిన అన్ని ఆడియో క్యాసెట్ల మీద పత్రీజీ గారి ముఖచిత్రం ఉండేది, ఆ క్యాసెట్లు అన్నీ నా మంచం ప్రక్కనే ఉన్న బల్లమీద పెట్టబడి ఉండేవి. కాబట్టి ఉదయం లేస్తూనే నాకు, క్యాసెట్ల మీద ఉన్న పత్రీజీగారి ముఖచిత్రం కనిపించేది.

ఆయన పిరమిడ్ల గురించి చేస్తున్న ప్రయోగాలూ, పరిశోధనల గురించి ఎంతో ఉత్సాహంగా చదువుతూ ఉండేదాన్ని. ఆయన పిరమిడ్ శక్తి గురించి, మరియు పిరమిడ్ ధ్యానం గురించి రాసిన పలు వ్యాసాలు ఎంతో అద్భుతంగా, స్ఫూర్తిదాయకంగా ఉండేవి. పిరమిడ్ మన సర్వతోముఖాభివృద్ధికి చిహ్నం అని చెప్పవచ్చు. ఎందుకంటే పిరమిడ్‌కు ఉన్న నాలుగు వైపులూ కూడా, వరుసగా జంతు సామ్రాజ్యం, వృక్ష సామ్రాజ్యం, ఖనిజ సామ్రాజ్యం మరియు మానవ సామ్రాజ్యాన్ని సూచిస్తున్నాయి. ఈ నాలుగు సామ్రాజ్యాలూ అన్నీ పిరమిడ్ లో ఏకత్రితమై పోయి ఉంటాయి. అంటే ఈ నాలుగు సామ్రాజ్యాలు కలిసి 'ఏకత్వం'లో ఉంటాయి. ఇదే కదా, ఆధ్యాత్మికత అంటే.

పత్రీజీ గారి వ్యాసాలు చదివి, చదివి నాకు ఇంకా పిరమిడ్ల గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో, మాక్స్ టోత్ మరియు గ్రెగ్ నిల్సన్ గార్లు రచించిన "పిరమిడ్ పవర్" అన్న గ్రంథాన్ని చదివాను. ఈ గ్రంథంలో

పిరమిడ్ల పుట్టుక గురించి, మరియు ఎన్నో నిగూఢమైన రహస్యాల గురించి, ఆసక్తికరమైన విషయాల గురించి, సంపూర్ణంగా, సరళంగా చెప్పబడి ఉంది. పిరమిడ్లలో ఉద్భవించే కొన్ని నిగూఢ శక్తులను ఏవిధంగా ప్రయోగించుకోవచ్చు లాంటివి అన్నీ కూడా చెప్పారు.

ఎన్నో వేల ఏళ్లనాటి కట్టడాలైనా, చెక్కు చెదరకుండా నిలచి ఉన్న ఈ పిరమిడ్ల నిర్మాణంలో అంతర్గతంగా దాగి ఉన్న రహస్యాలేమిటి? తాంత్రిక పరమైన, మరియు శాస్త్రపరమైన ఎన్నో రహస్యమైన అంశాలను, ఈ గ్రంథంలో విశదీకరించారు. ఈ గ్రంథంలో, పిరమిడ్లలో చేసిన ఎన్నో పరిశోధనల గురించి కూడా వివరించారు. పిరమిడ్ లోపల పెట్టిన రేజర్ బ్లేడు పదును తగ్గకుండా ఉండడం, భోజనం పాడవకుండా ఎక్కువకాలం నిల్వ ఉండడం గమనించి, ఈ పిరమిడ్లలలో ఏదో శక్తి నిక్షిప్తమై ఉన్నట్టు గుర్తించారు. దీని గురించి పత్రీజీ గారు కూడా ఎన్నో పరిశోధనలు చేసి ఇవన్నీ అక్షర సత్యాలని ధృవీకరించారు.

1991లో పత్రీజీ గారి ఆధ్వర్యంలో కర్నూలు లో మొట్టమొదటి పిరమిడ్ నిర్మించారు. 1996 లో ఉరవకొండలో రెండవ పిరమిడ్ నిర్మాణం జరిగింది. ఆ తరువాతి కాలంలో ఆంధ్ర రాష్ట్రం అంతటా ఎన్నో పిరమిడ్లు నిర్మించబడ్డాయి.

ప్రప్రథమంగా ఈ పిరమిడ్ ధ్యానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత పత్రీజీగారికే దక్కింది. మామూలు ధ్యానం కంటే పిరమిడ్ లోపల చేసే ధ్యానం మూడింతలు శక్తివంతమైనదని నిరూపించారు. పిరమిడ్ల గురించి పత్రిజీ గారు వ్రాసిన వ్యాసాల వలన నాకు ఎంతో అవగాహన కలిగింది. పత్రీజీ గారు చెప్పిన ప్రకారం ఒక పిరమిడ్, మరొక పిరమిడ్‌తో ఒకలాంటి 'బంధనం' లో ఉంటుంది. కాబట్టి ఒక పిరమిడ్ నుంచి ఇంకొక

పిరమిడ్‌కి, శక్తి ప్రవహిస్తూ ఉంటుంది.

అంతే కాకుండా ప్రతి పిరమిడ్‌లో కూడా శక్తి నిక్షిప్తంగా దాగి ఉంటుంది. అంటే మనం ఎన్ని పిరమిడ్లు ఈ భూమి మీద కట్టుకోగలిగితే అంత శక్తి వాటిలో కేంద్రీకృతమై ఉంటుంది. ఆ చుట్టుపక్కల పరిసరాలను ప్రభావితం చేస్తుంది. ఎవరైతే పిరమిడ్‌కు వచ్చి ధ్యానం చేసుకోగలుగుతారో, వారికి ఈ శక్తి మరింతగా లభ్యమౌతుంది.

అలుపెరగకుండా పత్రీజీ గారు పిరమిడ్ ధ్యాన ప్రచారం గురించి, అహర్నిశలూ శ్రమించడం, నిస్వార్థంగా ఈ ధ్యానం అందరికీ నేర్పించాలని ఆయనకున్న తపన నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది.

నా దినచర్యలో భాగంగా ప్రతిరోజూ ఆయన ఆడియో క్యాసెట్ వింటూ, మా కార్యాలయానికి వెళ్ళడం, అక్కడ పని ముగించుకుని ఇంటికి వచ్చాక, రాత్రి పడుకోబోయే ముందు మళ్ళీ పత్రీజీ గారి వ్యాసాలను చదవడం చేసేదాన్ని.

అనతికాలంలోనే ఈ పత్రిజీ గారు మరియు ఈ 'పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వెబ్ సైట్, నా జీవితంలో ఒక అంతర్భాగంగా కలిసి పోయారు.

ఒకరోజు ఇలాగే చదువుతూ ఈ 'నెరసిన గడ్డం కలిగిన వ్యక్తి చెప్పిన ఒక వాక్యం నా ఆలోచనల్ని, నా నమ్మక వ్యవస్థను, మరియు నా జీవితాన్నే మార్చేసింది. "ఇంకొకరి గొప్పతనాన్ని గురించి, ఇంకొకరికి కలిగిన అత్మ సాక్షాత్కారం గురించీ పాటలు పాడుకుంటూ, పొగుడుతూ ఎన్ని జన్మలు గడుపుతావు?

ఇంకొకరి గొప్పదనాన్ని గురించి, ఇంకొకరికి కలిగిన అత్మ సాక్షాత్కారం గురించీ పొగుడుతూ, పాటలు పాడుకుంటూ గడిపితే మన జీవితాల్లోని

సమస్యలు తీరి పోతాయా? మనం చేసే ధ్యానం, మనకు కలిగే ఆత్మ సాక్షాత్కారం మాత్రమే మన సమస్యల్ని నివారించేందుకు ఉపయోగపడతాయి".

ఇప్పుడు నాకు అసలు విషయం అర్థమైంది. 'పత్రీజీ గారికి ఆత్మ సాక్షాత్కారం కలిగింది, అంటే నాక్కూడా ఈ ఆత్మ సాక్షాత్కారం కలగవచ్చు'. ఆత్మ సాక్షాత్కారం అంటే ఒక చర్య కాదు, ఇది ఒక స్థితి. ఇది ఒక జీవన విధానం. ఆయన చెబుతున్న ప్రతి విషయమూ నన్ను, 'ఉన్న స్థితి' నుంచి 'ఉన్నత స్థితికి' తీసుకు వెళుతూ ఉంది.

మేము సరిగ్గా ఈ సమయంలోనే అంటే 2004, డిసెంబర్‌లో భారతదేశానికి వచ్చాము. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వాళ్ళు హైదరాబాదులో ఏడు రోజుల ధ్యాన మహాసభ నిర్వహించబోతున్నట్లుగా తెలిసింది. హైదరాబాదులోనే ఉన్న మా కుటుంబంతో కొంతకాలం గడపబోతున్న నాకు, ఈ ధ్యాన మహాసభ, ఈ సారి హైదరాబాదులో జరగబోతుందన్న వార్త ఎంతో సంతోషాన్ని కలిగించింది. పత్రీజీ గారి ఆధ్వర్యంలో జరిగే ఈ ధ్యాన మహాసభలో కలుసుకోవడానికి దేశం నలుమూలల నుండి ధ్యానులు వచ్చి పాల్గొంటారని తెలిసింది. నేను కూడా ఇందులో పాల్గొనగలిగితే, ఎంత అద్భుతంగా ఉంటుందో కదా!

హైదరాబాద్ చేరుకున్న మేము, ముందుగా బేగంపేట్‌లోనే ఉన్న మా అక్కయ్యగారి ఇంటికి చేరుకున్నాము, ఆ రోజు ప్రాంతీయ వార్తా పత్రికల్లో, ఈ ధ్యాన మహాసభ, సికింద్రాబాద్ గ్రౌండ్స్‌లో ఆ రోజు సాయంత్రం ప్రారంభం కానున్నట్లు సమాచారం ఇచ్చారు. అంటే ఈ ధ్యాన మహాసభ మా అక్కయ్య గారింటికి దగ్గరలోనే అని తెలిసింది. మావారు, రెండు రోజులు నన్ను హైదరాబాద్‌లోనే ఉండి, ధ్యాన మహాసభలో పాల్గొనమని

చెప్పి, పిల్లలిద్దరినీ తీసుకుని, మా అత్తగారింటికి, విశాఖపట్నం వెళ్ళి పోయారు. అదే రోజు సాయంత్రం నేను మా అక్కయ్య గారి అమ్మాయి 'శిల్ప'ని తీసుకుని ధ్యాన మహా సభకు వెళ్ళాను. శిల్ప కూడా ఈ ధ్యానం గురించి, మరియు ధ్యాన మహాసభ గురించి తెలుసుకోవాలనే కుతూహలం చూపడంతో దారి పొడుగునా తనకి ధ్యానం ఎలా చెయ్యాలి? ధ్యానం వల్ల కలిగే ఉపయోగాలు ఏమిటి? లాంటివన్నీ చెప్పాను.

అక్కడికి చేరేసరికి ధ్యానం ప్రారంభమైపోయింది. కొన్ని వేలమంది అలా కూర్చుని, కళ్ళు మూసుకుని ధ్యాన మగ్నులై ఉన్నారు. లౌడ్ స్పీకర్ నుంచి ఎంతో మధురంగా నాదం వినిపిస్తూ ఉంది. నాకు ఎంతో అద్భుతమైన అనుభూతి కలిగింది. నా కల నిజమైందనిపించింది.

మేము ఆలస్యంగా చేరాము, కాబట్టి చివరి వరుసలో కూర్చోవలసి వచ్చింది. కుర్చీలో కూర్చున్న తరువాత చుట్టూ ఒకసారి పరికించి చూసాను. దూరంగా స్టేజీ మీద కొంతమంది వాయిద్యాలు పెట్టుకుని కూర్చుని ఉన్నారు. వారు వాయిస్తున్న నాదం వింటూ అందరు ధ్యానం చేస్తున్నారు. దూరం ఎక్కువ కావడం వల్ల స్టేజీ మీద ఉన్నవారు సరిగ్గా కనిపించడం లేదు. స్టేజీ నుంచి పిల్లనగ్రోవి, ఎంతో మధురంగా, చెవులకింపుగా వినిపిస్తూ ఉంది. ఎవరు వాయిస్తున్నారో కానీ అద్భుతంగా, మధురాతి మధురంగా ఉంది. నెమ్మదిగా కళ్ళు రెండూ మూసుకుని 'పిల్లనగ్రోవి' వింటూ ధ్యానం లోకి జారిపోయాను. అంతలో ఎవరో భుజం మీద తడుతున్నారు. శిల్ప 'ఇంటికి వెళదాం రమ్మంటోంది'. అప్పటికే రాత్రి తొమ్మిది దాటింది. తొమ్మిది లోపల ఇల్లు చేరాలని అమ్మ ఇచ్చిన ఆదేశం ప్రకారం తిరుగు ప్రయాణం అయ్యాము. మాతో పాటు ఇంకెవ్వరూ తోడు లేరు కాబట్టి తొందరగా ఇంటికి చేరమని అమ్మ అదే పనిగా చెప్పి పంపారు. ధ్యానం ఇంకా

జరుగుతూనే ఉంది. నాకు వదిలి వెళ్ళడానికి మనస్సే రాలేదు. తప్పనిసరిగా వెనుదిరిగాము.

ఇంటికి చేరుకున్నా కానీ, నా ధ్యాసంతా ధ్యానం చెయ్యాలనే ఉండడంతో, ఎవరితోనూ మాట్లాడాలనిపించక నిశ్శబ్దంగా గది లోపలికి వెళ్లి మరో రెండు గంటలు ధ్యాన నిమగ్నురాలినయ్యాను. అప్పుడు నాకు స్ఫురించింది, ఆ ధ్యాన మహాసభలో, పిల్లనగ్రోవి వాయించింది మరెవరో కాదు, పత్రీజీ గారని. ఆయన వాయించిన పిల్లనగ్రోవి, నేనింతకు ముందే విని ఉండటంతో చాలా నిరుత్సాహ పడ్డాను. ఎందుకంటే పత్రీజీ గారికి అంత దగ్గరగా వెళ్లి కూడా ఆయన్ని చూడలేకపోయాను. ఈ ధ్యాన మహాసభ గురించి ఆలోచిస్తూనే అలా నిద్రలోకి జారుకున్నాను. కానీ ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు ధ్యాన మహాసభకు చేరుకుందామన్న ఆలోచనలు నన్ను సరిగ్గానిద్ర పోనీయలేదు.

ఉదయం లేస్తూనే అమ్మతో చెప్పాను 'మళ్ళీ ధ్యాన మహాసభకు ఈ రోజు కూడా వెళ్ళాలి' అని. కానీ అమ్మ అంతగా సంతోషించినట్లు కనపడలేదు. భర్త, పిల్లలతో అత్తగారింటికి వెళ్ళి గడపకుండా ఇలా ధ్యాన మహాసభలకు తిరుగుతున్నానని ఆవిడ బాధ. ఈ రెండు రోజుల తరువాత ఎటూ అత్తగారింటికి వెళుతున్నాను. అయినా అమ్మ ఆలోచనలు అమ్మవి. 'జీవితంలో బాధ్యతలు అన్నీ ముగించిన తరువాత ఈ ధ్యానం, ఆధ్యాత్మికతల గురించి ఆలోచించవచ్చు' అని ఆవిడ నాకు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. ఈ ధ్యానంలో పడి, నేనెక్కడ కుటుంబాన్నీ, బాధ్యతలనీ విస్మరిస్తానేమోనని బెంగ పెట్టుకున్నారు. ఆవిడ తప్పు కాదు. తల్లిగా ఆవిడ బెంగ ఆవిడది. కానీ గడచిన రెండేళ్లలో నేను నేర్చుకున్న జీవిత పాఠాలు, నన్ను వెనుకంజ వేయనీయలేదు. నా దృక్పథం లో ఆధ్యాత్మికత, మరియు జీవితం రెండూ

కలిసిపోయి ఉన్నాయి. జీవితంలో ఆధ్యాత్మికతను జోడించినప్పుడే సంపూర్ణమైన, ఆనంద దాయకమైన, మెరుగైన జీవితాన్ని పొందగలమన్నదే నేను నేర్చుకున్న సిద్ధాంతం. నేనెంచుకున్న ఈ మార్గంలో నాకు ఏదీ అడ్డంకి కానేరదు.

ఈ మార్గంలో నేను ఒంటరి ప్రయాణం చెయ్యటం లేదు. నేను నేర్చుకున్న ప్రతి విషయమూ నా కుటుంబంతో పంచుకునేదాన్ని. కానీ నా కుటుంబమంతా ఈ ఆధ్యాత్మిక మార్గంలోనే నడుస్తూ ఉందని అమ్మకు ఎలా నచ్చ చెప్పాలి? నేనే కాకుండా, నా భర్త పిల్లలు అందరం ధ్యానం చేస్తున్నామని తెలిస్తే ఆవిడ ఇంకా బాధ పడతారేమోనని తోచింది. అందుకే అమ్మతో మరీ వాదించకుండా మౌనంగా ధ్యాన మహా సభకు బయలుదేరాను.

నిన్నటిలాగే ఈ రోజు కూడా జనంతో క్రిక్కిరిసిపోయి ఉంది. ఎక్కడ చూసినా ధ్యానులే. ఉదయం సమయం కావడం వలన నిన్నటికంటే కొద్దిగా వెలుతురుగా ఉంది.

నెమ్మదిగా వెళ్లి ఖాళీగా ఉన్న ఒక కుర్చీలో కూర్చుని స్టేజీ వైపు దృష్టి సారించాను. స్టేజీ మీద ఒక ధ్యాని తన ధ్యానానుభవాలని పంచుకుంటున్నారు. ఇంతలో బ్రహ్మర్షి పత్రీజీ గారు ఇక సభలో ప్రసంగించనున్నారని తెలిపారు. వారి ప్రసంగం వినాలని ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాను. గత పన్నెండు నెలలుగా, నా ఆధ్యాత్మిక పురోగమనం లో నాకు మారదర్శకత్వం వహిస్తున్న పత్రీజీ గారిని చూడాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతూ ఉంది.

చివరికి పత్రీజీ గారు స్టేజీ మీదకి రానే వచ్చారు. కానీ నేను కూర్చున్న చోటు నుంచి స్టేజీ కొంచెం దూరంగా ఉండటంతో నాకు ఆయన సరిగ్గా

కనిపించడం లేదు. కాస్సేపటికి పత్రీజీ గారి ప్రసంగం అయిపోయింది.

అందరూ ఆయన వైపుకు వెళుతున్నారు, పలకరించడానికి. నేను కూడా ముందుకు కదిలాను, ఆయనను దగ్గర్నించి చూడాలన్న కుతూహలంతో, కారు పార్క్ దగ్గరికి ఆయన నడవడం చూసి అటువైపు నడిచాను. ఇప్పుడు పత్రీజీ గారు కొద్దిగా కనిపిస్తున్నారు. ఇంకా కూడా వంద మీటర్ల దూరంలో ఉన్నారు. ఇంతకంటే దగ్గరగా వెళ్ళడానికి సాధ్యపడలేదు. వేలకొద్ది ధ్యానులు ఆయన్ను చుట్టేస్తున్నారు. అలా నిట్టూరుస్తూ నిలుచుండిపోయాను. 'ఎప్పటికైనా పత్రీజీ గారితో మాట్లాడగలనా? దగ్గర నుండి చూడగలనా?' కానీ అక్కడ ఉన్న చాలామందికి ఏదో భావన కలిగి ఉంటుంది. దూరం నుంచే గమనిస్తున్నాను. పత్రీజీ గారు అందరితో ఎంతో ప్రేమగా, ఆదరంగా మాట్లాడుతున్నారు. అందరికి షేక్ హాండ్ ఇస్తున్నారు. కొంతమంది పత్రీజీ గారిని కావిలించుకుంటున్నారు, ముట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. వారందర్నీ పలకరిస్తూనే పత్రీజీ గారు కారు పార్క్ వైపు సాగిపోయారు. నేను కొద్దిగా నిరుత్సాహంగా ఇంటికి చేరుకున్నాను.

మరుసటిరోజు నేను మధ్యాహ్నం విమానంలో విశాఖపట్నం వెళ్ళిపోవాలి. కాబట్టి నేను పొద్దున కాస్సేపు ధ్యాన మహాసభకు వెళ్ళి పన్నెండు గంటల కంతా ఇల్లు చేరుకుంటే మధ్యాహ్నం విమానం బయలుదేరే సమయానికి విమానాశ్రయానికి చేరుకోవచ్చని అనుకున్నాను. అదే మాట అమ్మతో చెప్పాను. అమ్మ మళ్ళీ అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆవిడతో సమయం గడపకుండా ధ్యాన మహాసభలకు వెళుతున్నానని అమ్మకు బాధ. ఉదయం పది గంటలకల్లా అక్కడికి చేరుకున్నాను. అప్పటికే అందరూ ధ్యానం చేస్తున్నారు. నిశ్శబ్దంగా వెళ్లి నేను కూడా ధ్యానానికి కూర్చున్నాను.

ధ్యానం ముగిసిన తరువాత పత్రీజీ గారు ప్రసంగించారు. దాదాపు పన్నెండు గంటలపుడు అందరికీ కొద్దిగా విరామం ఇచ్చారు. ఇక అందరూ గురువుగారిని కలుసుకోవడానికని ముందుకు వెళుతున్నారు. నేను కూడా ముందుకు వెళ్ళడానికి ప్రయత్నించాను. ఇంకొద్దిసేపట్లో నేను ఇక్కడ్నించి బయలుదేరాలి. విమానాశ్రయానికి సమయానికి చేరుకోవాలి మరి.

ఉన్నట్టుండి ఆగిపోయాను. నాకు పత్రీజీ గారిని కలుసుకోవాలని గట్టి సంకల్పం ఉంది కాబట్టి అది జరిగి తీరుతుంది. ఎక్కడున్నానో అక్కడే ఆగిపోయాను, చుట్టూ ఉన్నట్లుండి కలకలం మొదలైంది. పత్రీజీ గారు ఇటువైపుగా వస్తున్నారు. అందరినీ పలకరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఏమి జరుగుతుందని అర్థం చేసుకునేలోపే పత్రీజీ గారు నా ఎదురుగా నిల్చుని ఉన్నారు. నన్నే సూటిగా చూస్తున్నారు. నమ్మ లేకపోతున్నాను. నాకు అయిదు అడుగుల దూరంలో ఉన్నారంతే. నీళ్ళు నిండిన కళ్ళతో, సంభ్రమాశ్చర్యాలతో అలా చూస్తుండిపోయాను. ఈయననే నేను రోజూ ఉదయాన్నే నా మంచం పక్కన ఉన్న బల్లమీద పెట్టివున్న క్యాసెట్ల మీద చూస్తూ ఉన్నది. ప్రతిరోజూ కార్యాలయానికి వెళుతూ కారులో ఈయన మాటలే వింటూ ఉండేదాన్ని. తేరుకోవడానికి అయిదు నిమిషాలు పట్టింది.

కొద్దిగా ముందుకు కదిలి "నేను మెల్బోర్న్ నుంచి వచ్చాను సర్", అన్నాను. చేయి చాపి పలకరిస్తూనే రెండు కుర్చీలు ముందుకు లాగి, ఒకదాని మీద తాను కూర్చుంటూ, రెండో కుర్చీలో కూర్చోమన్నారు. దాదాపు అరగంట అలా కూర్చుండిపోయాము. నిశ్శబ్దంగా, ఒకరిని ఒకరు అలా చూస్తుండిపోయాము. చెప్పటానికి మాటలు లేవు. ఏమి చెప్పాలో అదంతా అశ్రురూపంలో ప్రవహిస్తూనే ఉంది. అది ఆయనకు అర్థం అయ్యింది. చుట్టూ ఉన్న వందలాది ధ్యానులు ఇదంతా నిశ్శబ్దంగా గమనిస్తూ

ఉన్నారు. ఆ మహామనీషి సాన్నిధ్యంలో నేను ఎంతో స్వాంతన పొందుతున్నాను.

విమానాశ్రయానికి చేరాల్సిన సమయం దగ్గర పడుతూ ఉంది కాబట్టి, "నేను ఇక బయలుదేరాలి సర్" అని చెప్పాను. ఆయన చుట్టూ ఉన్నవారితో "ఈ గొప్ప మాస్టర్ మెల్బోర్న్ నుంచి వచ్చారు" అని చెప్పారు. ఎప్పుడైతే ఆయన ప్రతి ఒక్కరినీ మాస్టర్ అని పిలుస్తున్నారని గుర్తించానో, పత్రీజీ గారి పట్ల ఉన్న గౌరవం ఎన్నో రెట్లు పెరిగిపోయింది. ఆయనకి మనమందరమూ మాస్టర్స్ అంటే గురువులుగా కనిపిస్తున్నామన్నమాట. ఈ భూమ్మీదకు అందరమూ ఈ అనుభవాలను పొందడానికి వచ్చిన గురువులుగా గుర్తించగలిగిన ఆయన ఎంతటి మహానుభావుడో!

నేను ఈ పథంలో ముందుకు వెళుతున్నప్పుడు ఎంతో మంది సాధువులనీ, సన్యాసులనీ, గురువులనీ చూసాను. వారందర్నీ భగవంతుడిగా కొలిచే శిష్యులని కూడా చూశాను.

కానీ నా ముందు కూర్చున్న ఈ గురువు ఎవ్వరూ తలలు వొంచి ఆయనకు నమస్కరించడానికి కూడా ఒప్పుకోవడం లేదు. ఆయనకు అందరిలో భగవంతుడు నిగూఢంగా ఉన్నాడనీ, కాబట్టి అందరూ భగవత్స్వరూపాలే ననీ గట్టి విశ్వాసం. నిజమైన గురువు, మార్గదర్శి అంటే ఈయనే కదా! తాను మనందరితో పాటు నడుస్తూ అందరిలో భగవంతుడ్ని చూస్తున్నారు. మన వాస్తవాలని మనమే సృష్టించు కుంటున్నామని చెబుతున్నారు.

పత్రీజీ గారు నన్ను ఇంకొక పిరమిడ్ మాస్టర్ శివప్రసాద్ గారికి పరిచయం చేసారు. శివప్రసాద్ గారు, నేను తీసుకెళ్ళడానికని ఒక సంచీ

నిండుగా ఆధ్యాత్మిక గ్రంథాలను ఇచ్చారు. పత్రీజీ గారికి వీడ్కోలు చెప్పి ధ్యాన మహాసభ నుండి బయలు దేరాను. పత్రీజీ గారు, శివప్రసాద్ గారికి, నన్ను మా అక్కయ్య గారింటిలో వదిలి రమ్మని పురమాయించారు. నా హృదయమంత గురువుగారిని కలుసుకున్నానన్న తృప్తితో, ఆనందంతో నిండిపోయింది. ఆయన చూపించిన ప్రేమకు, కరుణకు, కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో అర్థం కాలేదు నాకు. ఇప్పటికీ నేను అనుకున్నది నేరవేరిందన్న తృప్తి కలిగింది. ఈ రోజు జరిగిన సన్నివేశం బహుశ నేను జీవితంలో మరచిపోలేనేమో!

పత్రీజీ గారు 2005 లో ఆస్ట్రేలియాకు వస్తున్నారని తెలిసింది. అప్పుడే నాకు మెల్బోర్న్‌లో ఉన్న మరి కొంతమంది ధ్యానుల గురించి తెలిసింది. వీరందరూ పత్రీజీ గారి అడుగుజాడల్లో నడుస్తున్నవారే. వీరందరికి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ గురించి మరియు పత్రీజీ గారి గురించి కూడా తెలుసు.

వీరందరూ చాలా కాలంగా ధ్యానం చేస్తున్నారని తెలిసింది. పత్రీజీ గారి రాకతో వీరందరినీ కలుసుకునే అవకాశం కలిగింది. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాలో, మొట్ట మొదటి సెషన్ మెల్బోర్న్ లోని మా ఇంట్లోనే జరగడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను.

పత్రీజీ గారితో పాటు, శివప్రసాద్ గారు మరియు మరొక ధ్యాని స్వర్ణ గారు కూడా వచ్చారు. ఆస్ట్రేలియాలో మొట్టమొదటి సెషన్ మా ఇంట్లో చేద్దామని నిర్ణయం తీసుకున్నప్పుడు దాదాపు మధ్యాహ్నం పన్నెండు గంటల సమయమైంది.

నేనేమో మా కార్యాలయంలో ఉన్నాను. సాయంత్రం ఏడు గంటలకు సెషన్ ప్రారంభించాలి. చాలా తక్కువ సమయంలో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. అంతే కాకుండా మా స్నేహితులందరికీ ఈ ధ్యానం గురించి చెప్పి, వారిని ఆహ్వానించాలి. వారందరూ కూడా పత్రీజీ గారిని ప్రత్యక్షంగా చూడవచ్చు.

పత్రీజీ గారిని భారతదేశంలో కలుసుకోవడం అంత సులభం కాదు, ఎల్లప్పుడూ వారి చుట్టూ ఎంతోమంది ధ్యానులు గుమిగూడి ఉంటారు కాబట్టి. అనుకున్న సమయానికి, అంతా ఎంతో చక్కగా జరిగి పోయింది.

పత్రీజీ గారు మా ఇంటికి రాబోతున్నారన్న వార్త నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. దాదాపు ఏడు గంటల సమయానికి నేను, మావారు వెళ్ళి పత్రీజీ గారిని మా ఇంటికి సగౌరవంగా తీసుకు వచ్చాము. అప్పటికే మా ఇల్లు ధ్యానులతో క్రిక్కి రిసిపోయి ఉంది. అందరూ ఇంటి బయటినుంచి, లోపలి వరకూ బారుగా నిలబడ్డారు పత్రీజీ గారికి స్వాగతం పలకడానికి.

పత్రీజీ గారు పిల్లనగ్రోవి తీసి నెమ్మదిగా వాయించడం మొదలుపెట్టారు. అందరమూ ధ్యానంలో మునిగిపోయాము. దాదాపు గంటసేపు ధ్యానం కొనసాగింది. పత్రీజీ గారు, మరియు ఇతర ధ్యానుల రాకతో మా గృహం పునీతమైపోయింది. అప్పుడే నాకు శివనాథ్ రావు మరియు విజయ గార్లతో పరిచయం అయ్యింది. తరువాతి కాలంలో వారందరూ నాకు ఈ ప్రయాణంలో తోడు అయ్యారు.

తరువాతి కొన్ని రోజులు, పత్రీజీ గారు మెల్బోర్న్‌లో ఉన్నారు. అప్పుడు, ఆయన గురించి ఇంకాస్త తెలుసుకునే గొప్ప అవకాశం కలిగింది నాకు.

10. దివ్యప్రణాళిక

అది శనివారం ఉదయం సమయం, ఉన్నట్టుండి ఫోను మ్రోగ నారంభించింది. మా స్నేహితుడు రవీంద్ర, అతడు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, ఆస్ట్రేలియాలో ఒక ముఖ్య సభ్యుడు.

రవీంద్ర మాటల సారాంశం ఏమిటంటే సరిగ్గా ఇంకో రెండు వారాల సమయంలో 'మెల్బోర్న్ థియోసాఫికల్ సొసైటీస్' వారి ఆధ్వర్యంలో జరగనున్న సభలో, 'పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్మెంట్' గురించీ, మరియు 'ది సైన్స్ ఆఫ్ మెడిటేషన్ ఫర్ ఎన్లైటన్డ్ లివింగ్' (ఆత్మ సాక్షాత్కారంతో కూడి జీవించడం కొరకు ధ్యానం చెయ్యడం) గురించీ నన్ను ప్రసంగం ఇవ్వమని కోరాడు.

నేను వెంటనే "నేనే ఎందుకు?" అని అడిగాను. "అదీ ఇంత తక్కువ సమయంలో" అన్నాను. సమయం తక్కువగా ఉన్నందుకు క్షమాపణ కోరుతూనే, రవీంద్ర జరిగిందంతా చెప్పాడు. 2006 లోనే పత్రీజీ గారి దగ్గర మెల్బోర్న్ థియోసాఫికల్ సొసైటీ వారు ఈ సభలో ప్రసంగించడానికి అనుమతి తీసుకుని, అన్ని ఏర్పాట్లు చేసుకున్నారుట.

కానీ మొదట 'పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, ఆస్ట్రేలియా' వారి ప్రణాళిక ప్రకారం మార్చ్ 2007 లో పత్రీజీ గారికి ఆస్ట్రేలియా రావలసి ఉండటంతో ఈ మెల్బోర్న్ థియోసాఫికల్ సొసైటీ వారి సభలో 'మార్చ్ నాలుగు 2007' నాడు ప్రసంగించడానికి ఏర్పాట్లు అన్నీ జరిగిపోయాయిట. కానీ చివరి నిముషంలో కొన్ని అనివార్య పరిస్థితుల వలన పత్రీజీ గారి

ప్రయాణం వాయిదా పడడంతో, మెల్బోర్న్ థియోసాఫికల్ సొసైటీ వారిని ఈ సెషన్ రద్దు చెయ్యమని కోరారుట.

కానీ థియోసాఫికల్ సొసైటీ వారి అధ్యక్షుడు 'ఎర్నెస్ట్ వాగ్నేర్ ' గారు ఈ సెషన్ రద్దు చెయ్యడానికి ఒప్పుకోలేదుట. ఎందుకంటే ఆ నెలకు సరిపడా అన్ని సెషన్స్ యొక్క ఆహ్వాన పత్రాలు ముందస్తుగానే విడుదల చేసారు, కాబట్టి రద్దు చెయ్యడం కుదరదు అన్నారుట. ఈ విషయమై ఎంతో చర్చించుకున్న తరువాత " పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆస్ట్రేలియా" వారు పత్రీజీ గారికి బదులుగా నేను మాట్లాడితే బాగుండునని నిర్ణయించుకున్నారట. వారి తరుపున రవీంద్ర నన్ను అభ్యర్థిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. ఈ విషయమై పత్రీజీ గారిని అడిగితే నిరభ్యంతరంగా నన్ను ఆ సభలో మాటడవలసిందిగా సిఫారసు చేశారుట.

పత్రీజీ గారికి బదులుగా అంత పెద్ద సభలో మాట్లాడటం అంటే ఎంతో గొప్పు అదృష్టంగా తోచింది. కానీ నా కేలండర్ చూసి ఎంతో నిరాశ చెందాను. ఎందుకంటే సరిగా మార్చ్ నాలుగు 2007 నాడు, నేను మా కార్యాలయం తరపున అతి ముఖ్యమైన పని మీద మలేషియాలోని కౌలాలంపుర్‌కి వెళ్ళవలసి ఉంది. అక్కడ అయిదు, మార్చ్ 2007న, ఒక కాన్ఫరెన్స్ ఉంది.

అందులో నేను పాల్గొనవలసి ఉంది. నా ప్రయాణం, బస లాంటి, అన్ని ఏర్పాట్లు ముందుగానే జరిగిపోయాయి. మా కార్యాలయం, యాజమాన్యం వారు నా మీద ఎంతో నమ్మకంతో ఈ పని నాకు అప్పగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నేను నిరాకరించలేని స్థితి.

రవీంద్రకు ఫోను చేసి నా పరిస్థితి గురించి వివరించాను. రవీంద్ర కూడా చాలా నిరాశ చెందాడు. నా బదులుగా సభలో మాట్లాడటానికి

ఇంకెవరైనా ఉన్నారా అని అడిగాడు. “ఇలా మలేషియా వెళ్ళడం తప్పనిసరి కాకపోయి ఉంటే, నేనే మాట్లాడేదాన్ని” అని చెప్పాను. ఆ మాటలు నా మనసులో నుంచి వచ్చినవి.

మన ఆలోచనలు, మరియు మన సంకల్పానికి ఉన్న శక్తి ఏమిటి అని ఆ క్షణం నాకు తెలియదు. ఆశ్చర్యం ఏమిటంటే మరుసటి రోజు ఉదయం నేను మా కార్యాలయానికి వెళ్లిన వెంటనే, మా పైఅధికారులు నా దగ్గరకు వచ్చి, కొన్ని అనూహ్యకరమైన పరిస్థితులు వచ్చినందు వలన నా మలేషియా ప్రయాణం రద్దు చేసుకోవాలని చెప్పి, నాకు కలిగిన అసౌకర్యానికి ఎంతో చింతిస్తున్నామని చెప్పారు. ఈ జరుగుతున్నదంతా ఆ “దివ్య ప్రణాళిక లో భాగమని అప్పుడు నాకు అర్థమైంది.

వెంటనే రవీంద్రకు ఫోను చేసి జరిగింది చెప్పి, మార్చ్ నాలుగున సభలో మాట్లాడటానికి నా సంసిద్ధతను తెలియచేసాను. ఆ వారాంతంలో కూర్చుని సభలో మాట్లాడటానికి వ్యాసం తయారు చేసుకున్నాను. పత్రీజీ గారికి బదులుగా నేను మాట్లాడ బోతున్నానని ఎంతో ఉద్విగ్నతకు లోనయ్యాను.

ఆధ్యాత్మికంగా కానీ, జ్ఞానపరంగా కానీ, విజ్ఞతలోగానీ ఎవరైనా పత్రీజీ గారితో తులతూగ గలరా? ఆయన ఒక సముద్రం అయితే నేను ఒక నీటి బిందువంత. కానీ ఇది, ఎవరికైనా దొరికే అద్భుతమైన, అరుదైన అవకాశం.

ఇక్కడి “మెల్బోర్న్ థియోసాఫికల్ సొసైటీ’ వారిలో చాలా మంది గురించి నాకు తెలుసు. వారు సామాన్యులేమీ కారు. ఆధ్యాత్మికతను ఔపోసన పట్టిన ఘనులు. తరచుగా ఆధ్యాత్మిక చర్చల్లో పాల్గొంటూ, ఆధ్యాత్మిక గ్రంధాలు చదువుతూ, ఎంతో జ్ఞానాన్ని కలిగిన వారు. అంకితభావంతో ఇంకా ఎంతో నేర్చుకోవాలన్న జిజ్ఞాస కలిగినవారు.

కానీ 'పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్మెంట్' యొక్క ఉద్దేశ్యం గురించి బాగా తెలిసినందున మరియు గత మూడు సంవత్సరాలుగా వారితో నాకున్న అనుబంధం వలన నాకు ఈ విషయం అంతగ బాధించలేదు.

ఏమి మాట్లాడాలన్నది రాసుకోవడం పెద కష్టం అనిపించలేదు. నేను కలం తీసుకుని కాగితం మీద పెట్టగానే, తనంత తానుగా నా చెయ్యి కదలడం ప్రారంభమైంది. నేను ఏమి రాస్తున్నానని నాకే తెలియని స్థితిలో ఉన్నాను. నా కలం నాట్యం చేస్తుందా అన్నట్లు కదులుతోంది. ఆ దివ్యాత్మలు నేను ఏమి చెప్పాలన్నది అంతా వారే నిర్ణయించుకున్నట్టున్నారు.

రాయడం పూర్తయ్యింది. నేను రాసినది చదువుతుంటే నాకే ఆశ్చర్యం కలుగుతోంది. ఇదేమిటి? నేను మాట్లాడవలసిన మాటలా ఇవి. నమ్మబుద్ధి కావడంలేదు. అదే రోజు సాయంత్రం, నేను మాట్లాడబోయే ప్రసంగం గురించి కూలంకషంగా చర్చించాలని, రవీంద్ర, రావు మరియు విజయ, వీరు ముగ్గురూ మా ఇంటికి వచ్చారు. అందరమూ వసారా గదిలో కూర్చున్నాము. నేను రాసిన వ్యాసం గురించి మాట్లాడటం ప్రారంభించాను. సగం పూర్తయ్యేసరికి ఆ గది అంతా విపరీతమైన శక్తి ప్రకంపనలతో నిండిపోయింది. నేను పూర్తిగా ముగించేసరికి విజయ ధ్యానం లోకి వెళ్ళిపోయింది. మిగిలిన ఇద్దరూ మైమరచిపోయి అలా కూర్చుని వున్నారు. ఎవ్వరూ మాట్లాడే స్థితిలో లేరు.

రాబోయే ఆదివారమే నేను సభలో మాట్లాడాలి. వారు ఇచ్చిన పట్టిక ప్రకారం నేను ఒక అర్ధగంట మాట్లాడాలి, తరువాత స్పిరిచ్యువల్ డీవీడీ ఒకటవ భాగం ప్లే చేస్తారు, తరువాత ఒక పదిహేను నిమిషాలు సామూహిక ధ్యానం ఉంటుంది. తదనంతరం చర్చలూ, ప్రశ్నలు, జవాబులు ఉంటాయి.

మధ్యాహ్నం రెండున్నర గంటలకు సభ ప్రారంభం కానుంది. నేను,

శివ, రావు మరియు నిఖిల్ అందరమూ రెండు గంటలకల్లా మెల్బోర్న్ లోని థియోసాఫికల్ సొసైటీ వారి ఆడిటోరియంకి చేరుకున్నాము. అక్కడి అధ్యక్షుడు ఎర్నెస్ట్ గారు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి లోపలికి తీసుకువెళ్ళారు. రెండు గంటలా పదిహేను నిముషాల కల్లా ఒక్కొక్కరుగా సభాసదులు రాసాగారు. పత్రీజీ గారు ప్రసంగించబోతారని అందరికి ఆహ్వాన కరపత్రాలు పంపిణీ చేశారు, కాబట్టి అందరూ కుర్తా పైజామా వేసుకుని, నెరసిన గడ్డంతో ఉన్న భారతీయుడి కోసం ఎదురు చూస్తున్నట్టున్నారు.

కొంతమంది ఇక ఆగలేక పత్రీజీ గారు ఇంకా రాలేదేమిటి? అని సభాధ్యక్షుడిని అడుగుతున్నారు. ఎర్నెస్ట్ గారు జరిగిన విషయాల గురించి వారికి చెప్పి పత్రీజీ గారికి బదులుగా ప్రసంగించబోతున్న నన్ను సభకు పరిచయం చేసారు. "ఈ అమ్మాయా" ఎవరో అంటున్నారు. "చాలా చిన్నమ్మాయి", ఇంకెవరో అనడం వినిపించింది. వాళ్ళు నాకేసి విస్మయంతో చూస్తున్న చూపులకి నేను నవ్వు ఆపుకోలేకపోయాను. "నాకు ఆధ్యాత్మికత గురించి తెలిసి ఉండవచ్చు అని అనిపించడం లేదా మీకు" అని అనుకున్నాను. "ఇంతవరకూ వచ్చేసావు సరోజా, ముందంజ వేసి, వచ్చిన పని పూర్తి చెయ్యి", నాకు నేనే చెప్పుకున్నాను.

సరిగ్గా అప్పుడే ఎర్నెస్ట్ గారు, సభావేదిక మీదికి నన్ను ఆహ్వానించారు. వేదిక మీద కాలు పెట్టిన వెంటనే నేను, అక్కడ నాకోసం పెట్టబడి ఉన్న చెక్క స్టాండ్ (పోడియం), ఫ్లవర్ వాజ్‌లను తీసెయ్యమని చెప్పాను. అక్కడున్న సభాసదుల పూర్తి ఏకాగ్రత నేను చెప్పబోయే మాటల మీదే ఉండాలనుకున్నాను. ఎందుకంటే పత్రీజీ గారికి బదులుగా, "ఆనాపానసతి" ధ్యాన శాస్త్రం గురించి ప్రసంగించే ఒక దివ్యమైన అవకాశం నాకు దొరికింది కాబట్టి.

నా ప్రసంగంతో సభ ప్రారంభం అయ్యింది. దాదాపు నలభై అయిదు నిమిషాలు సాగింది నా ప్రసంగం. అందరూ మంత్ర ముగ్ధులై వింటున్నారు. ఒకసారి వేదిక ఎక్కిన తరువాత నేనెవరన్నది మరచిపోయాను. పత్రీజీ గారు మాట్లాడుతున్నట్లుగా ఊహించుకుని ప్రారంభించాను. "విశ్వశక్తి" గురించీ, మరియు "శక్తి వలయం" గురించి, మరియు "ఆనాపానసతి ధ్యానం" గురించి, నేను తయారు చేసి తీసుకు వెళ్ళిన స్లయిడ్లు నా ప్రసంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉండినవి.

నా ప్రసంగం పూర్తి అయ్యింది. సభలో చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దంగా ఉంది. ఇంకా నేను ఏదైనా మాట్లాడతానేమోనని అందరూ ఎదురు చూస్తున్నట్టున్నారు.

తరువాత ఇరవై నిముషాల సేపు స్పిరిచ్యువల్ డీవీడీ ప్లే చేసాము. ఆ తరువాత సమయాభావం వలన, పది నిముషాల సేపు సామూహిక ధ్యానం చేయించాము. అన్నింటికంటే గొప్పగా ఈ సామూహిక ధ్యానం జరిగింది.

ఒకావిడకి ఎంతకాలంగానో ఉన్న వెన్నునొప్పి, ఈ సామూహిక ధ్యానం చెయ్యగానే తగ్గిపోయిందని చెప్పారు. ఇంకొకరు కూడా ఇలాంటిదే చెప్పారు. నా వరకూ అయితే ఒక్కరికి అయినా ఈ సెషన్ ఉపయోగపడితే నేను తీసుకున్న శ్రమ వృధా కాలేదనుకుంటాను. అందరూ ఇలా సామూహిక ధ్యానం అప్పుడప్పుడూ చేసుకుంటే బాగుంటుందన్న అభిలాష వ్యక్త పరిచారు.

వెంటనే రంగం లోకి దిగిన శివ, వాళ్ళందరికీ 'పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆస్ట్రేలియా' వారి వెబ్ సైటు వివరాలు అన్నీ చెప్పి అందులో జరిగే సామూహిక ధ్యాన కార్యక్రమాల్లో పాల్గొనమని అందరికి మనవి చేసుకున్నాడు. చర్చా కార్యక్రమంలో శివ, రావు ఇద్దరూ కూడా వచ్చి నాకు తోడుగా నిలిచారు.

అక్కడ ఉన్న వాళ్ళల్లో చాలా మంది నా ప్రసంగాన్ని ఎంతో నిశితంగా విన్నారు. అందరూ ఆధ్యాత్మికతని ఎంతో అధ్యయనం చేసిన నిష్ణాతులు. అందులో చాలామంది ఆధ్యాత్మికంగా ఎంతో పరిణతి చెందినవారు.

ప్రశ్నలూ, జవాబులూ కూడా ఎంతో బాగుండినవి. వారు అడిగిన ప్రశ్నలు విన్న నాకు, వారందరూ ఎంత శ్రద్ధగా విన్నారన్నది అర్థమైంది. వారికి మేమిచ్చిన సమాధానాలతో అందరూ సంతోషపడ్డారు.

అందరూ నన్ను ఎంతో జ్ఞానం అందించానని మెచ్చుకున్నారు. ప్రసంగం విన్న ప్రతి ఒక్కరూ నా చెంతకు వచ్చి అభినందనలు తెలిపారు. వారందరి స్పందన చూసి నేనెంతో పొంగి పోయాను.

'మెల్బోర్న్ థియోసాఫికల్ సొసైటీ' వారి అధ్యక్షుడు ఎర్నెస్ట్ గారు నా ప్రసంగం ద్వారా ఎంతో జ్ఞానాన్ని అందించినందుకు కృతజ్ఞతలు చెప్పారు. ఇలాంటి ప్రసంగాలు నానుంచి ఇంకా ఎన్నో ఎదురు చూస్తున్నట్లు మరీ మరీ చెప్పారు.

మొత్తం మీద 'పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆస్ట్రేలియా' వారి పేరు మెల్బోర్న్ లో కూడా ప్రసిద్ధి చెందింది. ఇప్పుడు మేము అందించే జ్ఞానాన్ని చక్కగా అందుకునే ధ్యానులు చాలామంది ఇక్కడ కూడా ఉన్నారు. ఇదంతా నా దివ్య ప్రణాళిక లోని ఒక భాగము అని తెలుసుకున్నాను.

11. నా నమ్మకానికి అతీతంగా

నేను ఎల్లప్పుడూ ఆల్‌రౌండర్‌గా ఉంటూ అన్నింటా గొప్ప విజయాలను పొందుతూ ఉండేదాన్ని. కానీ ఏదీ నా జీవితంలో అంత సులభంగా దొరకలేదు. అడుగడుగునా, పట్టుదలతో కష్టపడితేనే ఫలితాలను పొంద గలిగాను. కాబట్టి నా నమ్మకం ఏమిటంటే, కష్టపడితేనే ఫలితం దొరుకుతుందని అనుకునేదాన్ని, చదువుకునే రోజుల్లో కానీ, ఆ తరువాత కానీ, ఇతరత్ర ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొనడం వలన, ఎప్పటికప్పుడు నా సమయాన్ని, నిముషం కూడా వృధా చెయ్యకుండా సమర్థవంతంగా ఉపయోగిస్తేనే విజయాలను పొందగలిగాను. కానీ 2002 లో ఎప్పుడైతే 'సంపూర్ణంగా జీవించడం ఎలా' గన్నది తెలుసుకున్నానో, అప్పుడు నాకున్న పాత నమ్మకాలు అన్నీ తొలగిపోయాయి.

ఎంతగా విశ్వాన్నీ, ఆ చైతన్య శక్తినీ నమ్మడం ప్రారంభించానో, అంతగా వాటితో చక్కగా అనుసంధానమై ఉండేదాన్ని. నెమ్మదిగా, నేను సంతృప్తి మరియు సమృద్ధిలను పొందగలుగుతున్నాను. ఒకలాంటి తృప్తితో జీవిస్తున్నాను. ఇంకేదో సాధించాలని కానీ, నన్ను నేను నిరూపించుకోవాలన్న కోరికలు లేవిప్పుడు. నేను సంపూర్ణంగ ఉన్నాను. నిదానంగా నా చుట్టూ ఉన్న ప్రపంచం మారడం గమనిస్తున్నాను. ప్రాపంచికంగా నేను సాధించాల్సిందంతా నన్ను అనుసరించి రాసాగాయి. నేను పెద్దగా కష్టపడకుండానే ప్రాపంచిక సుఖాలన్నీ నా జీవితంలోకి వచ్చి చేరుతున్నాయి. గమ్మత్తు ఏమిటంటే నేను వాటి వెనుక పరిగెత్తినంత కాలం అవి అంత సులభంగా లభ్యమయ్యేవి కావు, ఎంతో కష్టపడితే కానీ దొరికేవి కావు.

దీని గురించి నా జీవితంలో జరిగిన చిన్న ఉదాహరణతో వివరిస్తున్నాను.

అది డిసెంబర్ 2011, గవర్నర్ ఆఫ్ విక్టోరియా వారి కార్యాలయం నుండి ఒక ఫోను వచ్చింది. సారాంశం ఏమిటంటే నేను చేస్తున్న సంఘ సేవను గుర్తించి వారు నాకు 'విక్టోరియన్ మల్టీ కల్చరల్ అవార్డు ఫర్ ఎక్సలెన్సి' ఇవ్వదలచారని చెప్పారు. అర్థం కావడానికి కాస్సేపు పట్టింది. మాట పెగల్తేదు, ఏమి చెప్పాలన్నది తెలియటం లేదు, అప్పటికి ఏదో చెప్పి ఫోను పెట్టేసినట్లు గుర్తు. కాసేపటికి తేరుకున్న నేను, తిరిగి వారికి ఫోను చేశాను.

నేను చేసిన సంఘ సేవలకు గుర్తింపుగా వారు నాకు ఈ అవార్డు ఇవ్వదలిచారట. అది స్వీకరించడానికి నన్ను వారి కార్యాలయానికి రమ్మని ఆహ్వానం పంపారు.

ఈ పురస్కారం నేను ఎదురుచూడలేదు. నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది.ఇక్కడ వివిధ దేశాలనుంచి వచ్చి, వివిధ సంస్కృతులు కలిగిన సంఘంలో, సామరస్యాన్ని సృష్టించడం అన్నది ఇంత మంచి గుర్తింపు తెస్తుందని అనుకోలేదు.

1991లో ఈ దేశంలో అడుగు పెట్టినప్పటినుండీ, ఎవరికైనా ఏదైనా అవసరం ఉందని తెలిసినప్పుడు వారికి సహాయం చేస్తూ ఉండేదాన్ని. ఇది ముందుగా మన భారతీయులతోనే మొదలైంది.

మెల్బోర్న్‌కి వచ్చిన కొత్తలోనే భారతదేశం నుంచి ఇక్కడికి వలస వచ్చిన భారతీయుల్ని కలుసుకున్నాను. ఒకరికి ఒకరు సహాయం చేసుకోవడానికి ఇక్కడ వీరికోసం ఎలాంటి సంఘాలు ఏర్పాటు చేసుకోలేదని

తెలుసుకున్నాను.

కొత్తగా ఇక్కడికి వచ్చిన భారతీయులకు సహాయం చెయ్యడానికి ఇలాంటి సంఘాలు ఉంటే వారికి మానసికంగానూ, భౌతికంగానూ కూడా మద్దతు దొరుకుతుంది. కొత్తగా వచ్చిన వారికి కలిగే ఒంటరితనం, నిరాశ, నిస్పృహలు కలగకుండా సహాయకారిగా ఉంటుంది. వారు కాస్త నిలదొక్కుకునే వరకూ కాస్త ఊరట దొరుకుతుంది.

కాబట్టి ఇక్కడ ఒక సంఘం ప్రారంభించి, కొన్ని కార్యక్రమాలు చెయ్యడం ప్రారంభించాను. తరువాతి కాలంలో అవి అన్నీ అక్కడ సంవత్సరానికి ఒకసారి వచ్చే క్యాలెండర్ లోనో వచ్చేసేది. ఆ కార్యక్రమాల్లో ఎన్నో పాత్రలు పోషించాను, స్వచ్ఛంద ప్రదర్శనలు (ఛారిటీ షో) నిర్వహించడం మొదలుకుని, ఎన్నో సంగీత, నృత్య కార్యక్రమాల్లో పాల్గొనడం, నాటికలు రాయడం, కూర్చడం, దర్శకత్వం వహించడం, ఆర్కెస్ట్రాలో కూడా ఉండేదాన్ని.

భారతీయ సంగీత, నృత్యాలని ఎంతో ఉత్సాహంగా ప్రోత్సహించేదాన్ని. ఇక్కడికి వచ్చిన ప్రవాస భారతీయులు ఇక్కడి సంస్కృతికి చక్కగా అలవాటుపడినా, మన భారతీయ సంస్కృతీ సంప్రదాయాల యొక్క మూలాలను వారు సంరక్షించుకోవాలి అని అనుకునేదాన్ని.

ఇలా అందరమూ కలసి సాహిత్య, సంగీత, నృత్య కార్యక్రమాలలో తరచుగా పాల్గొనడం వలన అందరిలో ఒక సంఘీభావం కలిగేది. ఒకరికివొకరం సుఖ దుఃఖాలలో పాలు పంచుకునే వాళ్ళము.

నా కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నెరవేరుస్తూనే, నేను ఈ ప్రవాస భారతీయులకు మరియు కొత్తగా ఈ దేశానికి వచ్చిన

భారతీయులకు కూడా వారు కొద్దిగా ఇక్కడ నిలదొక్కుకునే వరకూ అన్ని విధాలుగా నా సహాయ సహకారాలు అందించేదాన్ని.

తరువాతి సంవత్సరాలలో కొత్తగా వలస వచ్చి, ఇక్కడ ఎవరూ లేక, ఎక్కడకు వెళ్ళాలో తెలియక, ఇబ్బంది పడే భారతీయులకు, మా ఇంట్లో ఆతిథ్యం ఇచ్చి, వారు కొద్దిగా స్థిర పడేవరకూ వారికి సహాయం చేసేదాన్ని. కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న వీరికి ఉద్యోగపరమైన సలహాలు ఇవ్వడమే కాకుండా వారికి సీవీలు తయారుచేసుకోడానికి మార్గదర్శకత్వం వహిస్తూ వారు అన్ని విధాలుగా స్థిరపడేవరకూ, సమయానికి, సరియైన సలహాలు ఇచ్చేదాన్ని.

ఇంతే కాకుండా వారాంతాల్లో మా ఇంట్లో ఉచిత ధ్యాన తరగతులను నిర్వహించేదాన్ని. అందులో ఎంతో మంది పాల్గొనేవారు.

నేను చేసే ధ్యానం, నాకెంతో సహాయకారిగా ఉండేది. ఇక్కడి సంఘంలో కూడా ఈ విషయం చెప్పి, ఎవరైతే నిరాశ, నిస్పృహలకు లోనవుతున్న వారికి ముఖ్యంగా, ధ్యానం ఎంతో సహాయకారిగా ఉంటుందని చెప్పేదాన్ని.

ఇదంతా కూడా నేను గుర్తింపు కోసమని కానీ, పురస్కారాల కోసమని కానీ చెయ్యలేదు. నా హృదయం అలా చెప్పింది, కాబట్టి చేసేదాన్ని. నేను మానవాళికి ఎంతగా ఉపయోగపడగలిగితె అంత సంతృప్తి, ఆనందం కలిగేది మరియు విశ్వంతో మరింతగా అనుసంధానమై ఉండినట్లుండేది. ఈ పురస్కారం కూడా విశ్వం నాకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తోచింది. వారి కార్యాలయంలోనే సభ నిర్వహించి, విక్టోరియా అధ్యక్షుడు అయిన 'అలెక్స్ చెర్నోవ్' గారు నాకు ఈ పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు.

దీనికంతటికి నా కుటుంబానికి ప్రత్యేక ధన్యవాదాలు

తెలుపుకుంటున్నాను. ముఖ్యంగా నా భర్త హరీష్ గారు మరియు పిల్లల సహాయ సహకారాలు లేకుంటే నేను ఏమీ సాధించలేకపోయేదాన్ని. వారు ఎంతగానో సర్దుకు పోవలసి వచ్చేది.

కొత్తగా వచ్చిన భారతీయులకు మా ఇల్లు ఒక "విడిది గృహం" ధ్యానం నేర్చుకునే వాళ్ళకు "ధ్యాన కేంద్రం", సాంస్కృతిక కార్యక్రమాల సమయంలో "రిహార్సల్ స్టూడియో" అయ్యేది.

12. మా చిన్నారి గురువులు

1992 మరియు 1996, ఈ రెండు సంవత్సరాలు, నా జీవితంలో మరచి పోలేనివి. ఎందుకంటే ఇవి, ఇద్దరు గొప్ప గురువులు మా జీవితాల్లోకి ప్రవేశించిన సంవత్సరాలు. ముందు మా కుమారుడు 'నిఖిల్ తరువాత మా కుమార్తె 'నవ్య మంజరి' ఒకరి తరువాత ఒకరుగా ఈ భూమ్మీదకు విచ్చేసారు.

వీరి రాకతో మా జన్మ ధన్యమైందనుకుంటున్నాము. మమ్మల్ని తమ తల్లితండ్రులుగా ఎంచుకున్నందుకు, మేము వారికి కృతజ్ఞతలు అర్పించుకుంటున్నాము.

మాతృత్వం అన్నది నాకు ఈ జీవితంలో దొరికిన గొప్ప వరం. షరతులు లేని ప్రేమంటే నాకు, మా పిల్లలు పుట్టాకే తెలిసింది. అంతకు ముందు ఈ పదానికి సరైన నిర్వచనం తెలియదు నాకు. ఒక్కసారి ఈ పదానికి అర్థం తెలిసిన తరువాత జీవితమే మారి పోయింది.

మా తొలి సంతానంగా 'నిఖిల్ ' జన్మ తీసుకున్న క్షణం నుంచి, మా కంటిపాప అయ్యాడు. నిఖిల్ కు అయిదు నెలలు వచ్చేసరికి నా ఉద్యోగ నిర్వహణకు నేను వెళ్ళవలసి వచ్చింది. అటు ఉద్యోగ భాద్యతలు, ఇటు పసికందు ఆలనాపాలనలతో జీవితం మరింత బిజీగా అయిపోయింది. కానీ మా నిఖిల్ రాకతో మా జీవన శైలిలో పెద్దగా మార్పు ఏమీ లేదు. ఎందుకంటే నిఖిల్ చాలా మంచిగా ఉండేవాడు. అల్లరి ఏమీ చేసేవాడు కాదు. కాబట్టి మేము పెద్దగా దేనికి ఇబ్బంది పడలేదు.

అప్పుడప్పుడు కార్యాలయం నుంచి ఇంటికి వచ్చి, ఇంటిపని అంతా ముగించుకుని, నిఖిల్‌ను తీసుకుని సంగీతం రిహార్సల్‌కు వెళ్లేదాన్ని. దాదాపు రాత్రి రెండు గంటల వరకూ కూడా రిహార్సల్ జరుగుతూ ఉండేది.

అప్పటివరకు నిఖిల్ మేలుకుని జరుగుతున్నదంతా ఆనందంగా చూస్తు ఉండేవాడు. మేము చేస్తున్న సాంఘిక కార్యకలాపాలలో, నిఖిల్ రాకతో ఎటువంటి మార్పులు చెయ్యవలసిన అవసరం లేకపోయింది.

నేనెప్పుడు మా 'తల్లి కొడుకుల' మధ్య చాలా మంచి అనుబంధం ఉంది అనుకుంటాను.

మార్చ్ 1996 లో నవ్య మా జీవితాల్లోకి ప్రవేశించింది. మా కుమారుడు నిఖిల్ తరువాత, మా కుమార్తె నవ్య రాక మాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.

నల్లటి పెద్దపెద్ద కళ్ళు, ఒత్తైన ఉంగరాల జుత్తుతో మా అందాల రాకుమారి 'నవ్య' మా అందరిని ఆకట్టుకుంది.

హరీష్ గారి తల్లిదండ్రుల ఆనందానికి హద్దే లేదు. తమ తొలి మనవరాలైన 'నవ్య' రాకకు వారు ఎంతో హర్షం వ్యక్తపరిచారు. ఎంతగానో ప్రేమించే తల్లిదండ్రులు, ఎల్లప్పుడూ తనని కనిపెట్టుకుని చూసుకునే అన్నయ్య కలిగిన నవ్య చాలా అదృష్టవంతురాలు. హరీష్ గారైతే కుమార్తె తోనే ప్రపంచంగ ఉండేవారు. పసిపాపగా ఉన్న నవ్యను ఎప్పుడు ఎత్తుకుని ఆడిస్తూ కనిపించేవారు. తను కూడా నాన్నగారితో ఎంతో హాయిగా, ఆనందంగా ఉండేది.

నవ్యకు మూడు నెలలు వచ్చిన తరువాత, దాదాపు ఏడాది పాటు మేము ప్రపంచం లోని పలుదేశాల పర్యటన చేసి వచ్చాము. మా చిన్నారి

నవ్య మమ్మల్ని ఈ టూర్ తీసుకు వెళ్లిందని అంటూ ఉంటాను. చక్కనైన కుమారుడు మరియు అందమైన కుమార్తెను చూసి తల్లిదండ్రులుగా, మేమిద్దరమూ ఎంతో మురిసి పోయేవాళ్ళము.

మూడు సంవత్సరాల చిరుప్రాయం నుంచే నవ్య భారతీయ శాస్త్రీయ నృత్యం అభ్యసించడం ప్రారంభించింది. మూడు సంవత్సరాలకే తను స్టేజీ మీద చేస్తున్న నృత్యాన్ని చూసి ముగ్తురాలినై పోయేదాన్ని. నాకు నృత్యం పట్ల ఉండిన ఆసక్తి అభిరుచి తన ద్వారా పూర్తి అవుతుంది అనుకునేదాన్ని.

సమయం ఎంత విలువైనదో నాకు ఇప్పుడు అర్థమైంది. ఇద్దరు పసిపిల్లలు మరియు ఉద్యోగ భాధ్యతలతో నాకు ఖాళీ సమయం చిక్కేది కాదు. నాది ఫుల్ టైం ఉద్యోగం కావడంతో ఎంతో ముందునుంచే ప్రణాళిక ప్రకారం అన్ని పనులు చేసుకోవలసి వచ్చేది. నా ఉద్యోగం కారణంగా పిల్లలు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా చూసుకునేదాన్ని.

వారాంతాలు మరింత వేగంగా గడచి పోయేవి. మా పిల్లలకు పాఠ్యాంశాలే కాకుండా ఇతర విషయాలు కూడా నేర్పుతూ ఉండడంతో, ఆ తరగతులతో మాకు చాలా బిజీగా ఉండేది. ముందుగానే ఆ వారానికి కావలసినదంతా సమకూర్చుకోవడం, మరియు సాంఘికీకరణలతో మాకు మరింతగా బిజీగా ఉండేది.

అంతే కాకుండా వారాంతాల్లోనే మా స్నేహితులతో గడపడానికి అవకాశం దొరికేది కాబట్టి అన్నింటికి సమయం కేటాయించడం సవాలుగా ఉండేది. ఎంతో అలసటకు గురి అయ్యేదాన్ని. సంఘసేవా కార్యక్రమాల్లో కూడ ముందడుగు వేసేదాన్ని, కాబట్టి మరింతగా పని ఉండేది.

ఉద్యోగంలో అనుభవంతో పెరుగుతున్న భాద్యతలతో పాటు, మా ఇద్దరికి కూడా ఉద్యోగంలో బాగా రాణించాలనే కోరిక ఉండడంతో,

మేము కొద్దిగ ఒత్తిడికి గురైన మాట వాస్తవం.

ఏదేమైనా అన్నింటికంటే ప్రప్రథమంగా మా పిల్లలకే, నేను పూర్తి ప్రాముఖ్యాన్ని ఇచ్చేదాన్ని. నా పని సమయం నుంచి కొద్దిగా విరామం తీసుకుని మా పిల్లల పాఠశాలలో రీడింగ్ సెషన్‌కి వెళ్ళేదాన్ని. వారి క్రీడా దినోత్సవం మరియు క్రిస్మస్ పిక్నిక్‌లకు వారితో గడపడం లాంటివి ఎన్నో చేసేదాన్ని.

ఈ ప్రపంచంలో అన్నిటికంటే ముందు నాకు, మా పిల్లలే ముఖ్యం అనుకునేదాన్ని. ఏదైనా వారికి సమయానికి చెయ్యలేకపోతే గిలగిల్లాడిపోయేదాన్ని. నన్ను నేను నిందించుకునేదాన్ని. అన్నీ సక్రమంగా, అమలు జరగడానికి నేను ఎంతో ఉరుకులు పరుగులు పెట్టవలసి వచ్చేది. నేను చుక్కానిలా ఉండి నా కుటుంబాన్ని ముందుకు తీసుకు వెళుతుండేదాన్ని.

2002 వరకూ ఇలాగే ఉరుకులు, పరుగుల జీవితం గడిపాము. 2002 సంవత్సరంలో ఎప్పుడైతే నన్ను, నేను తెలుసుకోవడం ప్రారంభించానో, అప్పుడు జీవితాన్ని ఆస్వాదిస్తూ గడపాలంటే, నేను కొద్దిగా నిదానించాలేమోనని తోచింది. జీవితమంటే ఒక్కొక్కరోజూ గడచిపోయిందని రోజులు లేక్క పెట్టుకోవడం కాదు, ప్రతి నిముషాన్నీ ఆస్వాదిస్తూ, ఆనందంగా గడపాలి.

డిసెంబర్, 2002లో నేను ఒక్కసారిగా స్తబ్ధతకు గురికావడం నా కుటుంబ సభ్యులు తట్టుకోలేక పోయారు. మా పిల్లలు అయితే ఇలా నిదానంగా, నిశ్శబ్దంగా ఉన్న అమ్మని ఇంతకు ముందు ఎన్నడూ చూడలేదు. నెమ్మదిగా నాలో కలుగుతున్న మార్పులను గమనించసాగారు. “ఎల్లప్పుడూ పరుగుల మీద ఉండే నన్ను” చూసిన మా పిల్లలు, “ఇలా నిశ్శబ్దంగా ఇంట్లో కూర్చుని ఉన్న నన్ను” చూసి తట్టుకోలేక పోతున్నారు, తరువాత

కొన్ని వారాల సమయం లోనే "నేను ప్రాముఖ్యం ఇచ్చే విషయాల జాబితా మారిపోయి, ఆనందంగా ఉండే నన్ను" గమనించసాగారు.

మా తల్లిదండ్రులు హైందవ సనాతన ధర్మానికి కట్టుబడి ఉన్న కుటుంబీకులు అయినప్పటికి ఈ ఆధ్యాత్మికత గురించి, వేదాంత తత్వ శాస్త్రం గురించి పిల్లలతో పెద్దగా మాట్లాడేవారు కాదు. ఆధ్యాత్మికత అంటే చాలామంది దృష్టిలో, బాధ్యతలు అన్నీ పూర్తి చేశాక, చెయ్యడానికి ఏమీ లేని సమయంలో, ఏదో కొద్దిపాటి సాధన చేసుకుంటే చాలు అనుకునేవారు. ఎందుకంటే అప్పుడైతే ప్రాపంచిక బంధాలు ఏవీ అడ్డు రాకుండా ఏ కొద్దిపాటి అయినా సాధన చేసుకోగలుగుతారు. కానీ మా పిల్లలకు ఇలా చెప్పడం నాకు ఇష్టం లేదు. నేను నేర్చుకున్న ప్రతీది వారికి చెప్పేదాన్ని. వారికి జీవించడానికి సరియైన పనిముట్లు చాలా అవసరం అనుకున్నాను.

అందులో మొదటిది ధ్యానం, రెండవది జీవించడం పట్ల చక్కటి అవగాహన కల్పించడం. అప్పుడే వారు ఈ ప్రాపంచిక విషయాల ఒరవడిలో పడి కొట్టుకు పోకుండా సంపూర్ణంగా జీవించగలరు.

కాబట్టి నేను ధ్యానం చెయ్యడం ఎలాగన్నది నేర్చుకున్న వెంటనే మా పిల్లలకు నేర్పించాను. వాళ్ళిద్దరూ ప్రతి రాత్రీ, నాతో పాటే కూర్చుని చక్కగా ధ్యానం చేసేవారు. ప్రతి రాత్రీ పడుకోవడానికి ముందు, ఆ రోజు నేను చదివిన ఆధ్యాత్మిక గ్రంధాల్లోని ఆసక్తికరమైన విషయాలను వారికి వివరించేదాన్ని. నెమ్మది నెమ్మదిగా దృశ్యం మారిపోయింది. ఇప్పుడు భోజనాల బల్ల దగ్గరే ఈ ఆధ్యాత్మిక మరియు ప్రాపంచిక అంశాలు అన్నీ చర్చించుకోవడం ప్రారంభించాము.

పరీక్షలకు సిద్ధం అవటానికి ముందు మా పిల్లలు ఇద్దరు, ఏకాగ్రత కుదరటానికని చక్కగా ధ్యాన సాధన చేయటాన్ని చూసి ఎంతో ముచ్చట

పడి పోయేదాన్ని. వారు తొందరగానే ధ్యాన సాధన వలన చదువులో మరింత ఏకాగ్రత పెరగడం గుర్తించారు. అంతేకాదు క్రీడారంగంలో కూడా దృష్టి పెట్టగలుగుతున్నారు. జీవితంలోని ఇతర ఎన్నో అంశాలను మెరుగు పరచుకోగలుగుతున్నారు. ఇలా ధ్యానం వలన కలిగే ఎన్నో లాభాలను తెలుసుకున్నారు. వారి పాఠశాలలో తమతమ స్నేహితులతో ఈ నేర్చుకున్నది అంతా పంచుకునేవారు. మా చిన్నారి నవ్య అయితే ఇంకొక అడుగు ముందుకు వేసి, తన స్నేహితులకు ధ్యానం నేర్పసాగింది. వారిమీద వారికి ఆత్మ విశ్వాసం పెరగడమే కాకుండా, వారి చుట్టూ ఉన్న ప్రపంచం మీద కూడా నమ్మకం పెరగ సాగింది.

నేను వారికి నేర్పినది ఏమిటంటే, అన్నింటికి జవాబు ధ్యానం. ఇది నేను, స్వీయ అనుభవం ద్వారా నేర్చుకున్నది.

ఒకసారి నేను మా 'పోస్ట్ బాక్స్' చుట్టూరా టైల్స్ వేద్దామనుకున్నాను. ఇంతకు ముందు నేను ఎప్పుడూ ఈ పని చెయ్యలేదు. దాదాపు అయిదు అడుగుల విస్తీర్ణంతో పోస్ట్ బాక్స్ చుట్టూరా తవ్వి, చిన్న గులకరాళ్ళతో అక్క డంతా నింపి, మట్టితో కప్పి, దానిపైన ఇటుకరాళ్ళు పేర్చి, కాంక్రీట్ వెయ్యాలి. మొత్తం చెయ్యడానికి కొన్ని గంటల సమయం పట్టింది, చివరికి చాలా అలసిపోయాను. చేతులు ఎంతగా నొప్పి పెట్టాయంటే, నేను పైకి ఎత్తలేక పోయాను. ఇంకో అరగంటలో పిల్లల్ని పాఠశాల నుంచి తీసుకు రావాలి.

ఈ అరగంటలో నేను ఈ అలసట నుంచి బయట పడాలి. విశ్రాంతి తీసుకోవడమా? ధ్యానం చెయ్యడమా? చివరికి ధ్యానం చెయ్యాలని నిర్ణయించుకుని, అరగంట అలారం పెట్టుకుని కూర్చున్నాను. చాలా అలసిపోయి ఉండడంతో మనస్సు ఖాళీగా ఉంది. చాలా తొందరగా గాఢమైన

ధ్యానంలోకి వెళ్ళిపోయాను. అరగంట తరువాత అలారం మ్రోగింది. ధ్యానం నుంచి బయటికి వచ్చి నన్ను నేను గమనించుకుంటే ఎంతో తాజాగా, ఉత్సాహంగా ఉన్నాను. ఆశ్చర్యకరంగా, ఇంతకు ముందు ఉండిన చేతుల నొప్పులు, ఒళ్ళు నొప్పులు ఏమీ లేవిప్పుడు. ఎంతమాత్రమూ, అలసట కూడా లేదు. ఆ రోజు రాత్రి భోజనాల బల్ల దగ్గర నా కుటుంబ సభ్యులతో ఇదే విషయం పంచుకున్నాను.

అందరికీ ఇదే ఇప్పుడు మార్గదర్శి అయిపోయింది. ఎవరికైనా ఆరోగ్యం బాగా లేదంటే మరేమీ ఆలోచించకుండా ధ్యానం చేసుకుంటున్నారు. ఏ ఇతర సందిగ్ధతల నుంచి త్వరగా బయట పడాలంటే ధ్యానం చెయ్యడమే మార్గం అని ఇప్పుడు మాకుటుంబ సభ్యులందరికీ తెలుసు.

మా కుమారుడు నిఖిల్ ఉన్నత పాఠశాలలో, ఆఖరి ఏడాది చదువుతున్నప్పుడు, నేను ఒక ఆసక్తికరమైన విషయం గమనించాను. ఆఖరి ఏడాది, ఏ విద్యార్థికైనా ఎంతో కొంత ఒత్తిడి కలిగిస్తుంది. ఎందుకంటే ఈ పరీక్షా ఫలితాల ఆధారంగానే ఆపై ఉన్నత చదువులలో ప్రవేశం దొరకడం, మరియు తదుపరి ఉద్యోగ అవకాశాలు రావడం లాంటి అంశాలన్నీ ఆధారపడి ఉన్నాయి. మా నిఖిల్ ఎప్పుడూ తరగతిలో ప్రథమ శ్రేణీ మార్కులు తెచ్చుకుని స్కాలర్షిప్ తెచ్చుకున్న విద్యార్థి. కాబట్టి తను ఎంతో కష్టపడి చదివి వుంటాడని అందరూ అనుకునే వారు. కానీ నిజానికి అస్సలు శ్రమపడేవాడు కాదు. అన్నిటిని సునాయాసంగా, సులభంగా చెయ్యగలిగేవాడు.

రోజూ క్రమం తప్పకుండా, ధ్యాన సాధన మాత్రం చేసేవాడు. దీనివలన అన్నింటా తనకి ఏకాగ్రత పెరిగింది. పరీక్షా ఫలితాల గురించి పెద్దగా ఆలోచించేవాడు కాదు. బాగానే వస్తుందన్నట్లు ధీమాగా ఉండేవాడు. అంత

నమ్మకం తన మీద తనకి. నిఖిల్ యొక్క పరిణతి చెందిన ప్రవర్తనని చూసి, ఒక్కొక్కప్పుడు నేనే విస్తుపోయేదాన్ని, నాకు ఇప్పుడున్న జ్ఞానం, తెలివి అంతా ఇప్పుడే ఈ యువకుడికి ఉందన్న విషయం గుర్తుకు తెచ్చుకునే దాన్ని. ఎలా జరగాలని కోరుకున్నానో, అలాగే జరుగుతూ ఉంది. "ఇంతకంటే గొప్ప పెన్నిధి ఏ తల్లి అయినా తన పిల్లలకు ఇవ్వగలుగుతుందా" అనుకుని హృదయపూర్వకంగా ఆనందించేదాన్ని.

యునైటెడ్ నేషన్స్ వారి మాక్ కాంపిటీషన్ లో ప్రథమంగా నిలచి "విక్టోరియా స్టేట్ ట్రోఫీ"ని అందుకుంటున్న నిఖిల్‌ని చూసి నేనెంతో పొంగిపోయాను.

తన ప్రయాణంలో మరేదీ అడ్డంకి కానేరదు. ఆ పోటీ జరిగినప్పుడు నేను అక్కడే ఉన్నాను. చివరి రౌండ్ దాదాపు ఆరు గంటలసేపు జరిగింది. ఎంతో ఆత్మవిశ్వాసం, పరిపక్వతతో, నిఖిల్ సమాధానాలు చెప్పిన తీరు, నాకు ఎంతో అధ్భుతంగా తోచింది.

VCE ఫలితాల్లో తనకి ATAR స్కోరు 99.8 వచ్చింది. దీనిని నిఖిల్ అతి సాధారణంగా తీసుకున్నాడు. యూనివర్సిటీ వారు తనకి వెంటనే స్కాలర్షిప్ మంజూరు చేసారు. నిఖిల్ అందుకుంటున్న స్కాలర్షిప్ వేడుకకు, తలిదండ్రులుగా మేము, సగర్వంగా హాజరైనాము.

ఉన్నత పాఠశాలలో పన్నెండవ తరగతి పరీక్షలు అయిన వెంటనే, పన్నెండవ తరగతిలోకి కొత్తగా చేరిన విద్యార్థులకు ట్యూషన్ చెప్పడం ప్రారంభించాడు నిఖిల్. పన్నెండవ తరగతిలో బాగా చదివే విద్యార్థిగా పేరుగాంచిన నిఖిల్ దగ్గర ట్యూషన్‌లో చేరడానికి చాలా మంది విద్యార్థులు ఉత్సుకత చూపించారు. ముందు పది నిముషాలు వారందరితో ధ్యానం

చేయించి, ఆ తరువాత పాఠ్యబోధన చేసేవాడు నిఖిల్. అందరూ ఎంతో క్రమశిక్షణ పాటిస్తూ ధ్యానం చేయడాన్ని నేను సంభ్రమాశ్చర్యాలతో గమనిస్తూ ఉండేదాన్ని. విద్యార్థులకు ఏకాగ్రత పెరగాలంటే ధ్యానం తప్పనిసరిగా చెయ్యాలని చెపుతూ, ధ్యానం వలన కలిగే అనేక ఉపయోగాల గురించి వారికి వివరంగా చెప్పి, వారందర్ని ధ్యానం చెయ్యమని ప్రోత్సహించేవాడు.

నిఖిల్ దృష్టిలో అసాధ్యమన్నది ఏదీ లేదు. ఆధ్యాత్మికంగా నేర్చుకున్నదంతా, సందర్భానుసారంగా జీవితంలో వాడుకుని ఫలితాలను పొంద గలుగుతున్నాడు. జీవితం అన్న క్రీడారంగంలో ఎలాంటి భయాలు లేకుండా ఎంతో ఆనందంగా ఆడుకుంటున్నాడు. తన చెల్లాయికే కాకుండా, మరెందరో విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచాడు నిఖిల్.

2004లో మా అక్కయ్య గారి అమ్మాయి పై చదువులకని ఆస్ట్రేలియా వచ్చింది. మా ఇంటి వాతావరణం చూసి తను ఆశ్చర్యపోయింది. భోజనాల బల్ల వద్ద ఆధ్యాత్మిక చర్చలో పాల్గొంటున్న పన్నెండు మరియు తొమ్మిది ఏళ్ల ప్రాయం కలిగిన నిఖిల్, నవ్యలను చూసి విస్మయపడి పోయింది. నిద్రకు ఉపక్రమించే ముందు కాస్సేపు మా కుటుంబం అంతా కూర్చుని ధ్యానం చేయడం ఆ అమ్మాయి ఊహించలేదు.

దాదాపు పది సంవత్సరాలకు పైగా భారతదేశానికి దూరంగా ఉన్నాము కాబట్టి పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి ఉంటామని అనుకున్నట్టుంది. పిల్లలు ఆధ్యాత్మికత గురించి ఇంత చక్కగా మాట్లాడటాన్ని తను అసలు ఊహించి ఉండదు. ఖాళీ సమయాల్లో ధ్యానం ఇతరులకు నేర్పించడం, మరియు ఆదివారాల్లో ధ్యాన తరగతులు మా ఇంట్లోనే నిర్వహించడం లాంటివన్ని తను గమనిస్తూ ఉంది. నెమ్మదిగా తను కూడా ఆధ్యాత్మికత వైపు ఆకర్షితురాలైంది. తను కూడా ధ్యానం చెయ్యడం మొదలు

పెట్టింది.

తను కూడా మా జీవితాల్లో ఒక భాగమైపోయింది. తను అకౌంటింగ్ డిగ్రీ చెయ్యడానికి మెల్బోర్న్ వచ్చిన, అసలు పరమార్థం ఇదేనేమో, అనుకునేదాన్ని. అమరావతి మరియు విశాఖపట్నంలలో జరిగిన 'ధ్యాన మహా చక్రం' సభలకు హాజరవడం మా ఇరు కుటుంబ సభ్యులందరిని ఎంతో ఆశ్చర్యానికి గురి చేసింది. వారి అభిప్రాయం ఏమిటంటే, నేను, హరీష్ గారు పిల్లలిద్దరిని ఈ ధ్యాన సభలకు, సమావేశాలకు బలవంతంగా తీసుకెళుతున్నాము అనుకుంటున్నారు. నిజానికి, నవ్య ఉదయం మూడు గంటలకల్లా లేచి తయారయ్యి నాలుగు గంటల కల్లా ధ్యానానికి హాజరు కావడం అన్నది వారి ఊహకు అందని విషయం. అమరావతిలో అయితే ఉదయం నాలుగు గంటల ధ్యానానికి, మా నవ్య అందరికంటే ముందే తయారయ్యి మమ్మల్ని తొందరపెట్టి మరీ లాక్కుని వెళ్ళేది.

మా కుటుంబానికి, ధ్యానం అంటే, అది ఒక జీవన విధానం, జీవితంలో ఒక భాగం, లేదా జీవితమే ధ్యానం. మా పిల్లలు ఆరోగ్యం బాగా లేదంటే ధ్యానం చేసేవారు, ఆనందంగా లేదన్నప్పుడు ధ్యానం చేసేవారు, ఏమి చెయ్యాలో తెలియని సందిగ్ధతలో కూడా ధ్యానం చేసేవారు. పరీక్షలకు ముందు ఒత్తిడి పోగొట్టుకోవడానికి ధ్యానం చేసేవారు. పరీక్షల తరువాత ప్రశాంతంగా ఉండడానికి ధ్యానం చేసేవారు. ఖాళి సమయాల్లో కూడా ధ్యానం చేసేవారు.

హరీష్ గారు ప్రతి రోజూ సాయంత్రం వారి కార్యాలయం నుండి ఇంటికి వచ్చేటప్పుడు రైలుబండిలో కూర్చుని ధ్యానం చేసేవారు.

13. జీవితంలో నూతనత్వం

నా చుట్టూ ఉన్న పరిస్థితులు, ఏమీ మారలేదు. 2002కు ముందు ఎలా ఉందో, ఇప్పుడూ అలానే ఉంది. కానీ నాలో వచ్చిన మార్పు వలన, పరిస్థితులు అంతా మారిపోయినట్లు కనిపిస్తూ ఉంది.

నేనిప్పుడు అనంతమైన, అత్యంత శక్తిశాలిని. గత ఎన్నో జన్మలలో రకరకాల అనుభవాల కోసం ఈ భూమ్మీదకు వచ్చినట్లుగానే, ఈ జన్మలో కూడా వచ్చాను. ఈ విషయం గుర్తించిన తరువాత నా చుట్టూ ఉన్న ప్రపంచం పూర్తిగా మారిపోయింది.

మా తల్లిదండ్రులు గొప్ప ఆధ్యాత్మికవేత్తలు. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను చదివే వారు. నేను చిన్నప్పుడు వారు చదివే గ్రంథాలలో ఉన్న కొన్ని శక్తివంతమైన "అహం బ్రహ్మాస్మి" లాంటి ప్రతిపాదనలను విని ఉన్నాను.

అంటే "నేను సృష్టి కర్తను". మనం దీని గురించి ఎప్పుడూ ఆలోచించము. సృష్టి కర్త లాగా ప్రవర్తిస్తామా? ప్రవర్తించము.

జ్ఞానం సముపార్జించటం వేరు, ఆచరణలో పెట్టడం వేరు. ఆచరణలో పెట్టనంతవరకూ నేర్చుకున్నదంతా 'ఉత్త సిద్ధాంతాలు' మాత్రమే. ఎవరికి దీనివలన పెద్దగా ఉపయోగం లేదు. గతంలో ఎవరైతే ఈ జ్ఞానాన్ని, ఆచరణలో పెట్టారో, వారు గొప్ప ఫలితాలను పొందగలిగారు. చాలామంది ఇళ్ళలో పిల్లల్ని, తమని తాము భగవత్ స్వరూపాలుగా గుర్తించుకోవడాన్ని ప్రోత్సహించరు. చాలా చిన్నవయసు నుండి వారికి విగ్రహారాధన చెయ్యడం, మరి ఇతరత్రా పూజలూ గట్రా, యాంత్రికంగా చెయ్యడం లాంటివి అలవాటు

చేస్తాము. చిన్నప్పటినుండి వారికి మనం నివసిస్తున్న సంఘంలో మన్నన పొందటానికి అనువుగా, ఏది మంచి? ఏది చెడు? అన్నది నేర్పుతు పెంచుతాము. తత్ఫలితంగా ఆత్మకు, శరీరానికి మధ్యన అంతులేని సంఘర్షణ సృష్టిస్తున్నాము. భగవంతుడు వేరు, మనం వేరు, అని అక్కడ ద్వంద్వత్వం మనమే సృష్టిస్తున్నాము. భగవంతుడు అంటేనే సర్వోన్నతమైన వాడు, మనం ఆయన అనుచరులం. అంటే మనం తక్కువ, ఆయన నాయకుడు, ఆయన భగవంతుడు, మనం ఆయన భక్తులము. జీవితంలో ఏవైనా పరిస్థితులు మనకు అనుకూలంగా లేకపోతే, అలాంటి పరిస్థితులు ఎందుకు సృష్టించ బడ్డాయి?, అని ఆలోచించకుండా, వెంటనే వెళ్ళి భగవంతుడి దగ్గర మొర పెట్టేసుకోవడమే. మన బరువు, బాధ్యతల్ని భగవంతుడికి అప్పజెప్పేస్తాము. అప్పుడు మనం చేయాల్సింది ఏమీ ఉండదు. అప్పుడు కూడా పరిస్థితులు మనకు అనుకూలంగా మారలేదనుకోండి, ఇంకేముంది, నింద వెయ్యడానికి భగవంతుడు ఉన్నాడు కదా! ఆ భగవంతుడి మీద నింద వేసెయ్యటమే, ఆయన చెయ్యలేదు కాబట్టి నా పరిస్టితులు ఇలా ఉన్నాయి, అంతే.

2002 లో, నాకు 'అహం బ్రహ్మాస్మి' అన్న పదం యొక్క నిజమైన అర్థం తెలిసింది, నేను దాని సారాంశం గురించి ఇంకా క్లుప్తంగా తెలుసుకోవాలనుకున్నాను. పరిశోధన ప్రారంభించాను. వెయ్యి ఓల్టుల కరెంట్ తగిలినట్లు నాకు ఆ అర్థం స్ఫురణకు వచ్చింది. హనుమంతుల వారు, లంకకు వెళ్ళడానికి ముందు వారి చిన్న శరీరాన్ని ఎలాగైతే కొన్ని వందల యోజనాల విస్తీర్ణం మేరకు పెంచారో, అలా నాకు ఈ మాటకు అర్థం స్ఫురించింది. 'యు ఫర్ ఎవర్ ' మరియు ' ది వైట్ బుక్' ఈ రెండు పుస్తకాలూ నాకు, ఈ సృష్టి మరియు ఆత్మ పురోగమనం గురించి మరింత విశదంగా తెలుసుకోవడానికి ఉపయోగపడ్డాయి.

నిజానికి 'వాస్తవం' నా కళ్ళ ముందే ఉంది. నేనే దానిని పట్టించుకోకుండా కళ్ళు, చెవులూ మూసుకుని ఉన్నాను. అది నిరంతరమూ ఇక్కడే ఉంది.

నిజం ఏమిటి? మనం భూమ్మీదకు ఈ వైవిధ్యభరితమైన అనుభవాల కోసమే మళ్ళీమళ్ళీ వస్తున్నాము, మనమే ఈ పరిస్థితులని సృష్టించు కుంటున్నాము. తల్లిదండ్రులని మనమే ఎంచుకుంటున్నాము.

సమస్యలని కూడా మనమే సృష్టించుకుంటున్నాము, తద్వారా అనుభవాలు పొందుతున్నాము.

మనం అనంతమైన 'ఆత్మ'లం. ఈ భౌతిక తలం మీద అనంతమైన అనుభవాలని పొందడానికి వచ్చాము. మనం ఎంపిక చేసుకుని, జన్మ తీసుకుని, ఈ అనుభవాలని పొందడానికి భూమ్మీదకు వచ్చాము. గతంలో వేరే తలాలకు వెళ్ళినట్లుగానే, ఈ జన్మలో భూమ్మీదకు వచ్చాము. ఈ జన్మ తరువాత వేరే తలాలకు వెళ్ళిపోతాము. అవి భౌతికంగా అయి ఉండవచ్చు, భౌతికంగా కాకపోయి ఉండవచ్చు, మనం కోరుకున్న పరిస్థితులను సృష్టించుకోవడానికి, సృష్టికర్తగా మనకు సంపూర్ణ 'స్వచ్ఛంద శక్తి' (ఫ్రీ విల్) ఉంటుంది.

ఎంత అందమైన విషయం. ఈ భౌతిక తలం మీదకి రాక పూర్వమే మనం అన్నీ సృష్టించుకుని వచ్చాము. మరి ఎందుకు బాధ, వాటిని ఎదుర్కోవడానికి? ఈ ఆటలో జయాపజయాలు లేవు. ఈ ఆటలో ఆత్మలు అనుభవాలు పొందడం కోసం ఈ భాతిక తలం మీదకి రావడం జరుగుతోంది.

ఎప్పుడైతే ఈ చిత్రం అంతా మనకు అర్థం అవుతుందో, ఇక జీవితం మనకు బాధాకరంగా గోచరించదు. మనకున్న అనంతమైన శక్తిని ఎప్పుడైతే

విశ్వసిస్తామో, లేదా గుర్తిస్తామో, నిదానంగా మన జీవితాల్లో అద్భుతాలు జరగడం ప్రారంభమవుతాయి. తరువాత మనకు అర్థమౌతుంది, ఈ జరుగుతున్నదంతా అద్భుతాలు కాదు, అదే మన అనంతమైన నిజ స్వభావం అని.

నా జీవితంలో కూడా ఇలాంటి అద్భుతాలు జరగడం ప్రారంభమైంది. నేను చదవాలకున్న పుస్తకం కోసం గ్రంథాలయానికి వెళ్లి, వెతకడానికి ఏదో ఒక అరలో, ఏ పుస్తకం మీద చెయ్యి పెడతానో, అదే నాకు కావలసిన పుస్తకం అయి ఉండేది. ఎప్పుడైతే మనం విశ్వంతో సమర్పణ భావంతో ఉంటామో, ఏది జరిగినా అంగీకరించే స్థితికి చేరుకున్నప్పుడు, మనం కోరుకున్నదంతా విశ్వం నుండి పొందగలుగుతాము, అన్న విషయం నాకు అర్థమైంది.

ఈ విశ్వములో అన్నీ ఉన్నాయి. మనం గట్టి సంకల్పంతో, విశ్వముతో అనుసంధానమై ఉండాలి.

ఏదైనా సందిగ్ధం కానీ, సంఘర్షణ కానీ నా మనస్సులో ఉన్నప్పుడు, నేను మా ఇంట్లో ఉన్న ఆధ్యాత్మిక గ్రంథాలయంలో మొట్టమొదట నా చేయి ఏ గ్రంథం మీద పడితే ఆ గ్రంథం తీసి, ఏదో ఒక పుట తీసి చదివేదానిని. అది సరిగ్గా నా సందేహానికి సమాధానం అయి ఉండేది. ఎప్పుడైతే నామీద నాకు నమ్మకం బలపడసాగిందో, అప్పుడు ఈ అద్భుతాలు జరగడం ఇంకా ఎక్కువైంది. ఇప్పటికీ అలా జరుగుతూనే ఉన్నాయి.

తరువాత ఫోనులతో కూడా ఈ అద్భుతాలు జరగడం గమనించాను. నేను ఎవరి గురించైనా తలుచుకున్న వెంటనే ఫోను మ్రోగేది, చూస్తే వారే అయి ఉండేవారు. ఒక్కొక్కసారి నేను ఎవరికైనా ఫోను చేసినప్పుడు, వారు

కూడా ఇదే మాట చెప్పేవారు. వారు నాకు ఫోను చెయ్యబోయారుట, ఇంతలో నా దగ్గర్నుంచి వారికి ఫోను వచ్చిందని. ఇప్పుడైతే ఫోను మ్రోగిన వెంటనే, నా కుటుంబ సభ్యులకి, అది ఎవరు చేసారన్నది చెప్పేస్తాను. ఫోను మ్రోగిన వెంటనే నాకు అలా తెలిసిపోయేది. దీనిని టెలిపతి అన్నా, అద్భుతం అన్నా, ఇలాగే జరుగుతూ ఉండేది. ఇదంతా మనకు జీవించడం యొక్క నిజమైన అర్థం తెలిసినప్పుడు, మరియు మన యొక్క నిజప్రకృతి తెలిసినప్పుడు మాత్రమే జరుగుతుంది.

ఒక రోజు 'జాన్ పేయినే ' గారు రాసిన "ఓమ్ని రివీల్స్ ది ఫోర్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ క్రియేషన్" అన్న గ్రంథం నా చేతికి దొరికింది. ఈ గ్రంథం నా జీవితాన్నే కాక, నా చుట్టూ ఉన్న మరెందరి జీవితాలనో మార్చేసింది. ఆ గ్రంథం లోనే సృష్టియొక్క నాలుగు సిద్ధాంతాల గురించి వివరంగా తెలుసుకున్నాను. అవి నాలుగూ కలిసి మన యొక్క నిజ స్వరూపమని తెలుసుకున్నాను. అవే మన దివ్యత్వపు లక్షణాలు. "స్వీయ ప్రేమ", "సంపూర్ణ ఆరోగ్యం", "సమృద్ధి", "సృజనాత్మకత".

"ప్రేమంటే ఉన్నది ఉన్నట్టుగా మొత్తంగా ప్రతీదీ అంగీకరించడమే. ప్రేమ అనుమతిస్తుంది. ప్రేమంటే నిన్ను, నువ్వెలా ఉంటే అలా అంగీకరించడమే కాకుండా, ఎదుటివారిని కూడా వారు ఏలా ఉంటే అలా అంగీకరించడమే". ఇదే నా జీవితంలో, క్షమాతత్వానికి దారి తీసింది. జీవితంలో ఇంతకు ముందు, ప్రతీదానికీ తీవ్రంగా స్పందిస్తూ, నన్ను నేను క్షమించుకోలేక, ఇతరులను కూడా క్షమించలేని స్థితిలో ఉండేదాన్ని. ప్రతి విషయాన్ని పరీక్షలాగా తీసుకుని తీవ్రంగా స్పందించే దాన్ని. అన్నిటికి 'మంచి–చెడు' అని బేరీజు వేయడం ఆపేసి, అన్నిటినీ ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించడం ప్రారంభించాను. అన్నిటికి తీర్పులివ్వడం లేదిప్పుడు. ముందు

నేను చెయ్యవలసిన పనుల జాబితా ఫ్రిడ్జికి అతికించి పెట్టుకుని ఆ ప్రకారం పనులు చేసుకుంటూ ఉండేదాన్ని. ఆ జాబితా తీసి బయట పడవేసాను. ఆ జాబితా లేకపోతే జీవితం గడవడం కష్టం అన్న రోజులు పోయాయి.

జీవితంలో అన్నిటికి క్రమంగా సర్దుబాటు జరిగింది. ఇప్పుడు నాకు మరింత సమయం, అన్నింటా వెసులుపాటు దొరికింది. జీవితం నాకిప్పుడు ఎంతో అందంగా కనిపిస్తూ ఉంది. ఎక్కువ శ్రమ పడకుండానే అటు ఉద్యోగ బాధ్యతలు, మరియు ఇంటి బాధ్యతలు, సునాయాసంగా చెయ్యగలుగుతూ ఉన్నాను ఇప్పుడు. ప్రతిచోటా విజయం నన్ను వరిస్తూ ఉంది. నేను దాని వెనుక పరుగెత్తవలసిన అవసరం లేదిప్పుడు. నేను సంతృప్తినీ, సమృద్ధినీ పొందుతున్నాను. నా భౌతిక ప్రపంచంలో అన్నీ ముందులాగే ఉన్నాయి, కానీ నేను మానసికంగా, ఎంతో ధనవంతురాలిగా, సంతృప్తితో జీవిస్తున్నాను.

మునుపెన్నడో నాకు కావాలి అని రాసి పెట్టుకున్న వస్తువుల జాబితా ఇప్పుడు క్రమంగా చిన్నదై పోయింది. ఆ తరువాత ఆ జాబితా అన్నదే లేకుండా పోయింది. ఇక అప్పుడు నా భౌతిక ప్రపంచంలో కూడా అద్భుతాలు జరగడం ప్రారంభమయ్యింది. నేను ఎదురుచూడని విధంగా నాకు ఉద్యోగంలో ప్రమోషన్ ఇచ్చారు. పెద్ద ఇంటికి మారిపోయామిప్పుడు. సృష్టి యొక్క 'ఆకర్షణ సిద్ధాంతం' తన పని తాను చేస్తూ ఉంది.

ఆకర్షణ సిద్ధాంతం ప్రకారం తనలోకి తనలా ఉన్న ప్రతిదాన్నీ ఇముడ్చుకుంటుందిట. కాబట్టి "మనం ఎప్పుడైతే సమృద్ధిగా ఉన్నట్లు భావించుకుంటామో అప్పుడు, ఇంకా ఎక్కువ సమృద్ధిని విశ్వం నుంచి పొందుతాము".

మనకు ఇది అత్యంత ముఖ్యమైన పాఠం, "మనం లేమి మీద ధ్యాస పెడితే మనకు విశ్వం లేమిని ఇంకా ఎక్కువ మోతాదులో ఇచ్చేస్తుంది". అనారోగ్యం వస్తుందేమోనని భయపడ్డామనుకోండి. అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లే.

ఒంటరితనం గురించి భయపడ్డా మంటే మనమే ఒంటరితనాన్ని ఆకర్తిస్తున్నామన్నమాట. ఎందుకంటే మన ధ్యాసంతా, మరీ ఒంటరితనం మీదే ఉంది కాబట్టి.

ఇప్పుడు నాకు ఒక విషయం అర్థమైంది. "విశ్వం ఎప్పుడూ, మనం ధ్యాస పెడుతున్న విషయాలకు మంచి-చెడు అని తీర్పులివ్వకుండా, మనం దేని మీద ధ్యాస పెడితే అదే ఇస్తూ ఉంటుంది. మన ప్రతి కోరికకూ, ప్రతి ఆలోచనకి విశ్వం స్పందిస్తుంది. **ఈ విశ్వం యుక్క చైతన్య శక్తికి మనకి ఏది కావాలి? ఏది వద్దు? అని అర్థం చేసుకోవడం తెలియదు. మన ఆలోచనల్ని గుర్తించి స్పందించడం మాత్రమే తెలుసు. ఆలోచనల్ని ఈ శక్తి అనుసరిస్తుంది. ఈ శక్తిని ఆలోచనలు అనుసరించడం లేదు.** మన ఆలోచనలు దేనిమీద అయితే కేంద్రీకృతమై ఉంటాయో, ఏది జరిగిపోతుందేమోనని భయపడుతూ ఉంటామో, లేక ఏది వద్దు అని అనుకుంటున్నామో, లేక ఏదయితే మనకు నచ్చడం లేదని అనుకుంటున్నామో, ఆ అనుభవాన్నే మనకు అందుబాటులోకి వచ్చేలా చేసేస్తుంది. ఈ విశ్వంలోని ఈ చైతన్య శక్తి ఏదయితే ప్రపంచాన్ని సృష్టించగలదో, ఆ శక్తి మన ఆలోచనల్ని ఎంతో చక్కగా అనుసరించి, మనకు ఆ అనుభవాలని పొందేలా చేస్తుంది".

విశ్వం, నాకిప్పుడు "జీవించడం" యొక్క తాళం చెవి నా చేతికి అందచేసినట్లయింది. దీనిని ఎలా వాడుకోవాలో నాకు బాగా తెలిసిపోయింది

ఇప్పుడు.

నెమ్మదిగా నేను నేర్చుకున్నది అంతా ప్రయోగం చెయ్యసాగాను. మా కుటుంబానికి అతి సన్నిహితుడైన ఒక వ్యక్తి ఎల్లప్పుడూ తన ఉద్యోగం పట్ల అసంతృప్తి వ్యక్తపరుస్తూ ఉండేవారు. గత పదిహేను సంవత్సరాలుగా తాను ఉద్యోగం చేస్తున్నప్పటికిని, తనకు తగిన పదవి దొరక లేదనీ, తగినంత పని ఇవ్వడం లేదని చెప్పి, ఎప్పుడూ బాద పడుతూ ఉండేవారు. దీనివలన ఆయన ఆత్మవిశ్వాసం తగ్గి, తనలో తాను ఎంతో మదన పడుతూ ఉండేవారు.

తత్ఫలితంగా ఎంతో ఆత్మన్యూనతకు గురై బాధ పడుతూ ఉండేవారు. సరిగ్గా ఇదే సమయానికి నేను విశ్వం గురించి, జీవితం గురించి మెరుగ్గా తెలుసుకుంటూ ఎంతో ఆత్మవిశ్వాసంతో, సంతృప్తితో ఉంటున్నాను.

నెమ్మదిగా మా స్నేహితుడికి ఈ విశ్వం గురించి, ఆకర్షణ సిద్ధాంతం గురించి వివరించాను. "పని లేదు' అని మా స్నేహితుడు ఎప్పుడూ అదే ఆలోచనతో ఉండడం మూలాన విశ్వం, ఆయనకు అలాంటి అనుభవాన్ని ఇస్తున్నదని నా గట్టి నమ్మకం. ఆయన 'ఏది లేదు' అన్నదాని గురించే ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండడం మూలాన ఆ "'లేదు' అన్నదే దొరుకుతూ ఉంది.

ఇప్పుడు ఆయన చెయ్యాల్సినదంతా 'ఏది ఉందో' దానిని గుర్తించాలి. ధ్యాస అంతా 'ఏది ఉందో' దాని మీదకి మరల్చమని నెమ్మది, నెమ్మదిగా చెపుతు వచ్చాను. మా స్నేహితుడిని మార్చడం అంత సులభం కాలేదు. ఆయన సమృద్ధితో ఉన్నట్లు భావించగలగాలి. ఇప్పుడు ఉన్నట్టుండి తన చేతిలో పని చాలా ఉన్నట్లు మరియు ఉద్యోగంలో ఎంతో సంతృప్తి

లభిస్తున్నట్లు భావించుకోవడం అంటే ఎంతో శ్రమ అయ్యింది ఆయనకు. కానీ ఎంతో పట్టుదలతో, నెమ్మదిగా తన ఆలోచనల్ని ఏకాగ్రతతో మార్చుకోగలిగారు.

ఆయన ఒక గొప్ప ఆత్మ, చివరికి ఒక సంస్థ నుంచి ఎలాంటి ఇంటర్వ్యూ లేకుండానే ఆయనకు పెద్ద ఉద్యోగం లభించింది. ముందున్న జీతంకంటే రెట్టింపు జీతం వస్తుంది ఇప్పుడు. ఒక డిపార్ట్మెంట్‌కి హెడ్‌గా ఆహ్వానించారు.

ఇప్పుడు ఆయన కోరుకున్న విధంగా చేతి నిండుగా పని, మరియు దానితోబాటు బాధ్యత ఉంది. జీవితమే మారిపోయింది. ప్రస్తుతానికి ఎంతో ఆనందంగా, సంతృప్తితో జీవిస్తున్నారు. ఆయన ఇప్పుడు తనకు కలిగిన అనుభవాలని వివరిస్తూ, సృష్టి యొక్క ఆకర్షణా సిద్ధాంతం గురించి, తన అనుభవం గురించి అందరికి నిర్మోహమాటంగా చెప్తూ ఉంటే నాకు కలిగిన ఆనందం వర్ణనాతీతం!

మన సమృద్ధికి మనమే మూల కారణం అని గుర్తించాలి. లేమి, కొరత, లాంటి వాటి గురించి మనకున్న నమ్మకాలను సమూలంగా తీసి పడ వెయ్యాలి, అప్పుడే మనం అన్నింటా సమృద్ధిని పొందగలము. ఆర్థికపరంగా సమృద్ధిని పొందటానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.

సంకల్పానికి ఉన్న శక్తిని తక్కువగా అంచనా వేయకూడదు. ఒక గొప్ప రచయిత ఏమి చెప్పారంటే **"సంకల్పం అన్నదే విశ్వం యొక్క శక్తి, ప్రతీదీ ప్రతీ ఒక్కరు కూడా ఈ అదృశ్య శక్తికి కట్టుబడి ఉన్నారు"**. ఇది అక్షరాలా సత్యం. విశ్వం నుంచి వెలువడుతున్న ప్రతీదీ, ఈ సంకల్ప శక్తి క్షేత్రాన్ని సృష్టిస్తున్నాయి.

కెర్లోస్ కేస్టేనెందా గారు ఇలా రాశారు "ఈ విశ్వం మొత్తం, లెక్కకట్టలేనంత, వర్ణించనలవి కానంత శక్తితో నిండి వుంది, దీనినే **'శమనులు'** సంకల్పం అన్నారు. నిజానికి విశ్వం యొక్క సంపూర్ణ వ్యవస్థ **(కాస్మోస్)** ఈ సంకల్పానికి కట్టుబడి ఉంది. ఈ అనంతమైన, అదృశ్యమైన **'సంకల్ప శక్తి'** భౌతిక ప్రపంచంలోనూ, భౌతిక ప్రపంచం కాని దానిలోనూ అంతటా నిండి ఉంది.

ఈ సంకల్ప శక్తి నాలోనూ, మీలోనూ మాత్రమే కాదు, అన్నింటా ప్రతిదానిలోనూ ఉంది, అంటే ఈ విశ్వంలో ఉన్న ప్రతి వ్యక్తి, ప్రతీదీ కూడా ఈ సంకల్ప శక్తి ద్వారానే అంతటా వ్యాపించి ఉన్న ఆ మూల పదార్థంతో బంధం(కనెక్ట్) కలిగి ఉన్నాము. ఎవరైతే స్వచ్ఛమైన, గట్టి సంకల్పం కలిగివుంటారో వారికి కావలసినది సృష్టించుకోవడానికి ఎలాంటి అడ్డుగోడలు లేవని నేను గట్టిగా నమ్ముతున్నాను.

నేను నా కుటుంబంతో ఈ విషయమై పలు మార్లు చర్చించాను. విశ్వంలో సమృద్ధిగా ఉన్న ఈ సంకల్ప శక్తిని చక్కగా వాడుకుని మనం కోరుకున్న అనుభవాలను చాలా సులభంగా పొందవచ్చునని వారికి వివరించేదానిని.

రాత్రి భోజనాల బల్ల దగ్గర కూర్చుని, నేను ఆ రోజు చదివిన ఆధ్యాత్మిక పత్రికలలోని ముఖ్యమైన వ్యాసాల గురించి వారికి వివరంగా చెప్పేదాన్ని. అందరము వీటి గురించి మరింతగా చర్చించుకునేవాళ్ళము.

అలాగే ఒకసారి మా స్నేహితులతో నేను ఏదో పత్రికలో చదివిన ఒకావిడ యొక్క అద్భుతమైన ధ్యాన అనుభవం గురించి వివరించాను. ఆవిడ చాలా కాలంగా మూత్రపిండాల పనితీరు సరిగ్గా లేక చాలా బాధపడుతున్నారుట.

డైలేషన్ లాంటివి చేయించుకుంటూ కొద్దిగా ఉపశమనం పొందుతున్నారుట. కానీ ఇది చాలా ఖర్చుతో కూడుకున్నది. అంతే కాకుండా విపరీతమైన నొప్పిని భరించాల్సి వచ్చేదిట. అప్పుడే ఎవరి ద్వారానో ధ్యానం గురించి, మరియు ధ్యానం పట్ల కలిగే లాభాల గురించి తెలుసుకుని ఒకసారి ప్రయత్నించి చూడాలనుకున్నారుట. కొన్ని వారాలు వదలకుండా ధ్యానం చెయ్యడంతో ఆవిడ ఆరోగ్యం నెమ్మది, నెమ్మదిగా మెరుగుపడిందిట.

ఇక కిడ్నీ డైలేషన్ చేయించాల్సిన అవసరం లేకపోయింది. ఆవిడకు ఇప్పుడు కిడ్నీలు చాలా బాగా పని చేస్తున్నాయిట. ఆవిడ ఇప్పటికి ధ్యానం క్రమం తప్పకుండా చేస్తూనే ఉన్నారుట.

మరొక స్నేహితుడికి 'కొలెస్ట్రాల్' ఉండవలసిన దానికంటే ఎక్కువగా ఉండేది. ఆయన మాత్రలు వాడుతూ ఉండేవారు. నేను చదివిన వ్యాసం గురించి మా స్నేహితుడితో చెప్పి, ధ్యానం చెయ్యమని చెప్పాను. ఆయన నెమ్మదిగా ధ్యానం చెయ్యడం ప్రారంభించారు. కొన్నాళ్ళ తరువాత డాక్టర్ దగ్గరికి వెళ్ళి పరీక్ష చేయించుకుంటే కొలెస్ట్రాల్ శాతం ఎంతో తగ్గిందని చెప్పారు. ఇంకా కొన్ని రోజుల వరకూ మందులు వాడుతూనే ఉండమన్నారుట. ఈ విషయమే మా స్నేహితుడు "ఇంకొన్ని నెలలు గడచిపోయి ఉంటే నాకు ధ్యానం ద్వారానే పూర్తి కొలెస్ట్రాల్ తగ్గిపోయి ఉండేది. అప్పుడు డాక్టర్ నన్ను మందులు వాడమని చెప్పేవారు కాదు" అని చెప్పుకొచ్చారు.

ధ్యానం ద్వారా తన ఆరోగ్యాన్ని పూర్తిగా సరిచేసుకోవచ్చు అని గట్టి సంకల్పం పెట్టుకుని నిజాయితీగా, దృఢ నిశ్చయంతో ముందుకు వెళుతున్న స్నేహితుడిని చూసి ఎంతో సంతోషపడ్డాను.

ఈసారి చెకప్ చేయించుకోవడానికి డాక్టర్ దగ్గరికి వెళితే, ఆశ్చర్యకరంగా ఇక మందులు ఏవీ వాడవలసిన అవసరం లేదని చెప్పారట. మందులు లేకుండా కొన్నాళ్ళు గడచిన తరువాత, మళ్ళీ చెకప్ చేసి, మందులు వాడాలా? వద్దా? అని చెబుతానన్నారట, మా స్నేహితుడు ఈ విషయం నాతో చెప్పినప్పుడు, నేను సంకల్పానికి ఉన్న శక్తి గురించి గుర్తుచేసాను. మందులు ఇక వాడకూడదు అని ఆయన చేసుకున్న గట్టి సంకల్పం వల్ల ఇలా జరిగింది.

ఈ సంకల్ప శక్తిని వాడుకోమని సమయం మనకు అప్పుడప్పుడూ గుర్తు చేస్తూనే ఉంటుంది, కానీ మనం ఈ భాతికత్వం లోని రంగు రాళ్ళ వెనుక పరుగెత్తుతూ అసలు రత్నాన్ని మరచి పోతూ ఉంటాము.

అన్ని భయాల్ని అధిగమించి, ఎంతో సమృద్ధితో జీవిస్తున్న నాకు, ముందున్న జీవితం ఎంతో అందమైనదిగ, అద్భుతమైనదిగ కనిపిస్తూ ఉంది ఇప్పుడు. ఎన్నో అనుభవాలని చవి చూస్తూ ముందుకు వెళుతున్నాను. ప్రతి అనుభవానికి ఎలాంటి తీర్పు ఇవ్వకుండా, ఎలా ఉంటే అలాగే తీసుకుంటున్నాను. మన జీవితం లోని ప్రతి వ్యక్తి, ప్రతి వస్తువు, ప్రతి అనుభవం, మనం ఎంపిక చేసుకున్నందు వలననే మనకు రకరకాలైన అనుభవాలు ఇవ్వడానికే ఉన్నారు. ఈ విషయం మనం ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి.

ఈ మధ్యకాలంలో నాకు ఎదుటివారు అనుభవిస్తున్న భౌతికపరమైన, మరియు మానసిక బాధలు అన్నీ వారు చెప్పకుండానే తెలిసిపోతున్నాయి.

ఈ క్షమాతత్వం నేను ఎంతగా సాధన చేస్తూ ఉంటే జీవితం మరింత అందంగా, ఆసక్తికరంగా మారిపోయింది. ప్రతి ఉదయం లేస్తునే నాకు

మరియు నా పూర్ణాత్మకు కృతజ్ఞతలు చెప్పుకుంటాను. నేను పొందుతున్న మంచి–చెడు అనుభవాలకు కృతజ్ఞతలు చెప్పుకుంటాను. నన్ను నేను ఎలా ఉంటే అలా అంగీకరిస్తున్నాను. నా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కూడా ఎలా ఉంటే అలాగే స్వీకరిస్తున్నాను. ప్రతిరోజూ నాకు కావలసినదంతా ఇస్తున్నందుకు మరియు నన్ను సమృద్ధితో చుట్టు ముట్టి ఉంచుతున్న ఈ విశ్వానికి సదా కృతజ్ఞతలు.

14. మధుర స్మృతులు

2010, డిసెంబర్ లో, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారు, దాదాపు పది రోజుల పాటు, సంవత్సరాంతంలో **"ధ్యాన మహా చక్రం"** గా పిలువబడే ధ్యాన సభలు నిర్వహించారు. ఇది గుంటూరుకు దగ్గరగా ఉన్న "అమరావతి" నగరంలో పెట్టారు. కృష్ణా నది ఒడ్డున ఉన్న ఈ నగరంలో ఎంతో ప్రసిద్ధి చెందిన "అమరేశ్వరు"ల వారి ఆలయం ఉంది.

ఈ "ధ్యాన మహా చక్రం" లో పాల్గోనడానికి , మేము అక్టోబర్ నుండే సన్నహాలు ప్రారంభించాము. అమరావతి చాల చిన్న నగరం. కాబట్టి ధ్యాన మహా చక్రంలో పాల్గొనడానికి రాబోతున్న ధ్యానులందరికి సరిపడా హోటళ్ళు, వసతి అంతగా లేనందున, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారు కొన్ని తాత్కాలిక వసతి గృహాలు ఎర్పాటు చేయనున్నారని తెలిసి, ముందుగానే మా కొరకు ఒక వసతి గృహాన్ని వారి వద్ద బుక్ చేసుకున్నాము.

ఆస్ట్రేలియా నుండి విశాఖపట్నం చేరుకున్నాము. విపరీతమైన వర్షాల కారణంగా బీభత్సంగా మారిన అమరావతి నగర పరిస్థితుల గురించి మాకు ముందుగానే బంధువులు హెచ్చరించారు. అదే సమయంలో ఏదో ఒక రాజకీయ పార్టీ వారు రాస్తారోకో కూడా నిర్వహించనున్నట్లు తెలిసింది.

విజయవాడ నుండి రోడ్డు మార్గాన్ని కూడా నిలిపివేయ బోతున్నారుట. ఇలాంటి సమయంలో అమరావతికి వెళ్ళడం ఉచితం కాదని, మా దగ్గరి బందువులు ఎంతగానో మమ్మల్ని వారించారు. కానీ మా అబ్బాయి నిఖిల్ మాత్రం అమరావతికి వెళ్ళి ధ్యాన మహాచక్రంలో పాల్గొనడానికి మొగ్గు

చూపాడు. ఈ ప్రయాణం వాయిదా వెయ్యటానికి కానీ, రద్దు చెయ్యటానికి కానీ ఒప్పుకోలేదు. నిఖిల్ చూపుతున్న ఆసక్తిని గమనించి మావారు "ధ్యాన మహా చక్రంలో పాల్గొనాలన్న గట్టి సంకల్పం మన అందరికీ ఉంది. కాబట్టి హృదయం చెప్పినట్లు చేద్దాము, మిగిలినది సంకల్పానికి వదిలేద్దాం" అన్నారు. అలా మేము అమరావతికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాం.

సంకల్ప శక్తి మీద మాకున్న అపారమైన నమ్మకం చేత మేము ఎట్టకేలకు అమరావతికి ప్రయాణం అయ్యాము. సాయంత్రం నాలుగు గంటల కల్లా అమరావతికి చేరుకోవలసిన మేము భారీ వర్షాల కారణంగా రాత్రి ఎనిమిది గంటలకు చేరాము.

మాకున్న గట్టి సంకల్పం వలన మేము అమరావతికి చేరుకోవడమైతే, చేరుకున్నాము. కానీ అక్కడి పరిస్థితి మేము ఏమాత్రం ఊహించలేదు. పల్లె ప్రాంతం కావడం వలన రహదారులు అంత బాగా లేవు. ఉన్న అంతంత మాత్రం, రోడ్డు కూడా విపరీతమైన వర్షాల వలన పాడైపోయి ఉన్నాయి. ఎక్కడ చూసినా బురద, కుండపోత వర్షాలతో అక్కడక్కడా గుంతలు పడి ఉన్నాయి.

ఆ గుంతలన్నీ కూడా వర్షపు నీటితో నిండి ఉన్నాయి. ఎలాగోలా మాకోసం నిర్మించిన 'తాత్కాలిక వసతి గృహం' వద్దకు చేరుకున్నాము. అక్కడి పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

ఆ వసతి గృహం నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. గచ్చు అంతా నీటితో నిండి పోయి ఉంది. నీటి వసతి ఇంకా కల్పించబడలేదు. నేను అంత కలియ చూసి హతాశురాలినయ్యాను. ఇప్పుడేమిటి చెయ్యటం? ఇక్కడ రాత్రి గడపటం ఎలా? ఇలాంటి పరిస్థితులని ఇంతకు ముందు

ఎన్నడూ ఎదుర్కొనని మా పిల్లలు, ఇలాంటి వాతావరణంలో ఎలా ఉండగలరు?

అలసట, ఆకలితో ఉన్న మాకు కాస్సేపటి వరకు బుర్ర పని చేయలేదు. రాత్రి సమయం కావడంతో మరెక్కడికి వెళ్ళలేని పరిస్థితి. నా కుటుంబంతో ఏదైనా ప్రత్యామ్నాయం గురించి ప్రస్తావించాను. వారు ఎంతో ఆనందంగా, ఇక్కడే గడపడానికి ఒప్పుకున్నారు. "మేము బాధ పడటం లేదు, ఇదంతా ఒక అనుభవంగా తీసుకుని ఈ రాత్రి సమయాన్ని ఆనందంగా గడుపుదాం" అన్నారు పిల్లలిద్దరు.

వారి మాటలకు నేను ఎంతో ఆశ్చర్యపడ్డాను. అప్పుడప్పుడు వారు పాఠశాల తరపున తోటి విద్యార్థులతో కలసి, ఆస్ట్రేలియా అడవులలో క్యాంపులకు వెళ్ళడం కద్దు. కానీ ఇక్కడ నేల అంతా నీటితో నిండి ఉండడంతో, పూర్తి కాని వసతి గృహాలలో ఉండడానికి పెద్ద రాద్ధాంతం చేస్తారేమోనని అనుకున్న నాకు, మా పిల్లలు ఇచ్చిన సమాధానం ఎంతో ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలగ చేసాయి. వాళ్ళు దేనికి బాధ పడటం లేదు. జరుగుతున్నదంతా ఎంతో సరదాగా తీసుకుంటున్నారు. అలా, ఇక్కడే రాత్రి గడపడానికి నిర్ణయించుకున్నాము.

మా బ్యాగులంతా మాకు కేటాయించబడిన నిర్ణీత, పూర్తికాని అదే వసతిగృహంలో పెట్టేసి, మేము ధ్యాన సభకు వెళ్ళిపోయాము. ధ్యాన సభ ఎంతో ఆకర్షణీయంగా, అనేక దీపాలు వెలిగించబడి మిరుమిట్లు గొలుపుతోంది. ఆ సభా స్థలము, అమరేశ్వరులవారి ఆలయానికి అతి సమీపంలో ఉన్నది. వాతావరణం ఇప్పుడు చాల ఆహ్లాదకరంగా ఉంది. వందలకొద్దీ, వేలకొద్దీ ధ్యానులతో ఆ ప్రాంగణం అంతా నిండి పోయి ఉంది.

పత్రీజీ గారు స్టేజీ మీద పిల్లనగ్రోవి వాయిస్తూ, అందరి చేత ధ్యానం చేయిస్తూ ఉన్నారు. మేము కూడా అన్నీ మరచిపోయి తరువాతి రెండు గంటలు ధ్యాన నిమగ్నులమై పోయాము.

ధ్యానం తరువాత పత్రీజీ గారితో మాట్లాడినప్పుడు మాకున్న అలసట, సందేహాలూ అన్నీ పటాపంచలై పోయాయి. ఆయన మమ్మల్ని భోజనశాలకు తీసుకు వెళ్ళి, ఒక బల్ల దగర కూర్చో పెట్టారు. అప్పుడు మాకు ఆకలి గుర్తుకొచ్చింది. గత ఇరవై నాలుగు గంటలుగా మేము సరియైన భోజనం తినలేదు. పత్రీజీ గారి సమక్షంలో కూర్చుని, ఇంత రుచికరమైన భోజనం తింటూ ఉంటే ఎంతో అద్భుతంగా ఉంది.

ధ్యాన మహా చక్రానికి నాయకత్వ బాధ్యతలు వహిస్తూనే, పత్రీజీ గారు మాకు ఏమాత్రం అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు అన్ని శ్రద్ధలు తీసుకున్నారు. అదే పత్రీజీ గారంటే.

భోజనానంతరం తిరిగి మా వసతి గృహానికి చేరుకున్నాము. దాదాపు రాత్రి పన్నెండు కావస్తూ ఉంది. మళ్ళీ ఉదయం నాలుగు గంటల ధ్యానానికి లేవాలి, పిల్లలు లేవగలరో, లేరో అనుకున్నాను. ఎందుకంటే ముందు రోజంతా ప్రయాణంలోనే గడచిందాయే. అందరమూ మంచాల మీద పడుకున్నామన్నమాటే కానీ ఎవ్వరికి నిద్ర పట్టలేదు. కొత్త ప్రదేశం, మరియు ఆ ప్రాంతమంతా గంతులు వేస్తున్న కప్పలు మరియు వాటి బెకబెకమని శబ్దాలు. ఇది మాకు వింతైన, అరుదైన అనుభవం. నేను ఎప్పటికి మరచిపోలేనిది.

ఉదయం మూడున్నర గంటలకు అలారం మ్రోగింది. అందరము మేలుకునే ఉన్నామాయే. చకచకా తయారై ధ్యానానికి వెళ్ళి పోయాము.

అమరేశ్వరుల వారి సన్నిధిలో, ఇంత మంది ధ్యానులతో కలసి, మధురమైన సంగీతం వింటు ధ్యానం చెయ్యడం, ఎంత ఆనందాన్నిచ్చిందో, మాటల్లో చెప్పలేను. నాలుగు గంటలు ఎలా గడచి పోయాయో తెలియలేదు. నేను ధ్యానం చెయ్యటానికి కూర్చున్న వెంటనే నాకు ఒక దృశ్యం కనిపించింది. ఒక పెద్ద, పొడవైన సొరంగం కనిపించింది. అందులో చాలా వేగంగా, నీరు పారుతు ఉంది. సొరంగం అంతా చిమ్మ చీకటిగా ఉంది. సొరంగం చివరి వైపు ఒక చిన్న దీపపు కాంతి మిణుకు మిణుకు మంటూ కనిపిస్తూ ఉంది.

ఉన్నట్టుండి ఆ పారుతున్న నీటిలో ఒక పెద్ద శివలింగం కనిపించింది. ఈ పెద్ద శివలింగం చుట్టూ లక్షలాది చిన్న, చిన్న శివలింగాలు నీటి మీద తేలియాడుతున్నాయి. నీటి వేగానికి, శివలింగాలు అన్నీ సొరంగం చివరికి, అంటే దీపం వైపుకు చేరుకుంటున్నాయి. నేనిప్పుడు సొరంగం బయటికి వచ్చేసాను. ఆ తెల్లటి మిరుమిట్లు గొలుపుతున్న కాంతి వలన నా కళ్ళకు ఏమీ కనిపించటం లేదు. ఆ పెద్ద శివలింగం తనతో పాటు అన్ని శివలింగాలని సొరంగం బయటకు, ఆ కాంతి వైపుకు తీసుకువెళుతోంది, అన్నీ బయటకు వెళ్ళి అదృశ్యమై పోయాయి.

ఉన్నట్టుండి నా మనస్సుకు తట్టింది, ఆ పెద్ద శివలింగం “పత్రీజీ” గారు వారు మన అందరినీ ఈ భవసాగరమనే సొరంగం నుంచి తప్పించి, వెలుతురు అంటే ఆత్మ సాక్షాత్కారం వైపుకు తీసుకుని వెళుతున్నారు. ఇంతలో అందరూ చప్పట్లు కొట్టడం వినిపించింది. ధ్యానం పూర్తయ్యింది అన్నమాట. ఆ దృశ్యం ఆ రోజంతా నా హృదయ ఫలకంపై అలా నిలిచి ఉంది.

ధ్యానానంతరం మేము టిఫిను తినడానికి అమరావతి నగరంలోకి

వెళ్ళాము. అక్కడ మాకు ఒక మోస్తరుగా ఉన్న హోటలులో గది ఒకటి అద్దెకు దొరికింది.

అందులోనే మేము నలుగురమూ సర్దుకోవాలి. అదనపు పరుపులు వేయించుకుని, ఎలాగోలా సర్దుకున్నాము. అక్కడ ఆ పూర్తికాని వసతి గృహం కంటే ఇది ఎంతో నయం. మా పిల్లలు జరుగుతున్న దానికి దేనికి పిర్యాదు చెయ్యలేదు. ఎలాంటి పరిస్థితులైనా చెదరకుండా, నిబ్బరంగా ఉన్న వారి క్షమతను చూసి ఎంతో సంతోషించాను. వారి గట్టి సంకల్పానికి కృతజ్ఞతలు.

మా బ్యాగులన్నీ తీసుకుని హొటలు గదికి వెళ్ళి పోయాము. అందరము తయారయ్యి, తిరిగి ధ్యాన సభకు చేరుకున్నాము. మేము వెళ్ళి కూర్చోగానే పత్రీజీ గారు నన్ను స్టేజీ మీదకు ఆహ్వానించారు. "స్పిరిచ్యువల్ మాస్టర్ ఫ్రమ్ ఆస్ట్రేలియా" అని నన్ను సభకు పరిచయం చేస్తూ, నా యొక్క ధ్యాన అనుభవాలని అందరితో పంచుకోవలసినదిగా కోరారు. అది పత్రీజీ గారి విధానం. అందరిని ఎంతో ఎత్తైన పీఠం మీద కూర్చోబెట్టేస్తారు. దానికి అనుగుణంగా మనం నడుచుకోవాల్సి వస్తుంది. ఆయన అందరిని గురువులుగా చూడటం నాకు ఎంతో నచ్చింది. అందరిలోని గొప్ప గుణాలను బయటకు తీయటానికి ఇది ఎంతో సహాయకారి అయ్యింది.

నేను నెమ్మదిగా స్టేజీ మీదకి వెళ్ళి గురువు గారి పక్కన కూర్చున్నాను. నేను కూర్చున్న చోటు నుంచి చూస్తే ఎదురుగుండా ఇసుక వేస్తే రాలనంత జన సమూహం. అందరు గొప్ప గొప్ప మాస్టర్స్. ఉదయం వీరందరితో కలసి ధ్యానం చేసుకున్న నేను, అందరికి నమస్కరించి ప్రసంగించడం మొదలు పెట్టాను.

బహిరంగ సభలలో మాట్లాడటం అన్నది నాకున్న బలం. నా ఆధ్యాత్మిక ప్రయాణం గురించి, నేను పొందిన ధ్యాన అనుభవాల గురించి ఒక అర్ధ గంట సేపు మాట్లాడాను. అలా అందరి ముందు ధ్యాన అనుభవాలని పంచుకోవడం నాకు చాల సహజంగా అనిపించింది. తరువాత నిఖిల్‌ని స్టేజీ మీదకు ఆహ్వానించారు. కానీ తెలుగు భాషపై అంతగా పట్టు లేనందున నిఖిల్ ముందు, కొంత సంశయించాడు. పత్రీజీ గారు కల్పించుకుని, నిఖిల్‌ని ఆంగ్లంలోనే మాట్లాడమని చెప్పారు. ఆయన స్వయంగా, నిఖిల్ మాట్లాడిన ప్రతి వాక్యానికి, తెలుగు అనువాదం చెప్పారు.

ఆ ఉదయం నిఖిల్, సభాముఖంగా పంచుకున్న ఆధ్యాత్మిక విషయాలు నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చాయి. ఇలాంటి ఆత్మ సాక్షాత్కారం కలిగిన కుమారుణ్ణి చూసి ఎంతో గర్వపడ్డాను. నిఖిల్ ప్రసంగం విన్న పత్రీజీ గారు కాస్సేపటి వరకూ ఏమీ మాట్లాడలేదు. తరువాత తనని తాను సంభాళించుకుని తెలుగు అనువాదం ఇలా ప్రారంభించారు" ఈ యువకుడి నుండి ఇలాంటి అధ్యాత్మిక విషయాలు వినడం నాకు ఎంతో పులకరింపు కలిగించింది".

నిఖిల్ ఆ రోజు పంచుకున్న రెండు ముఖ్యాంశాలు ఏమిటంటే,

1. మరణం అన్నది లేదు, 2. సమయం అన్నది లేదు.

తరువాత పత్రీజీ గారు మిగిలిన మా కుటుంబ సభ్యుల్ని కూడా స్టేజీ మీదకి ఆహ్వానించారు. హరీష్ గారు, నవ్య ఇద్దరు కూడ, స్టేజీ మీదకు రావడానికి, ముందు కొద్దిగా తటపటాయించారు. కానీ పత్రీజీ గారు మరల, మరల ఆహ్వానించడంతో వారిరువురూ స్టేజీ మీదకి వచ్చారు. మేము నలుగురం, స్టేజీ మీద ఒకరి పక్కన ఒకరం కూర్చుని ఉన్నాము. ఉన్నట్టుండి పత్రీజీ గారు లేచి మమ్మల్ని సన్మానించాలని అనుకుంటున్నట్లు

సభకు తెలియ చేసారు.

తరువాత జరిగినదంత ఒక కలలాగా గడిచింది. ఒకవైపు సన్నాయి మేళం మ్రోగుతోంది. అక్కడున్న వందల, వేల మంది ధ్యానుల ముందు అంత పెద్ద గొప్ప గురువుగారి చేత సత్కరింప బడటం మా కుటుంబం చేసుకున్న సుకృతంగా భావిస్తున్నాను. సున్నితంగా చందనం అద్దీ, పన్నీరు చల్లి, బంగారు వన్నె అంచుగల శాలువాలు కప్పి, అందరి కరతాళ ధ్వనుల మధ్యన మా నలుగురిని సత్కరించారు.

తాదాత్మ్యంతో మాకు ఇదంతా కలో, యధార్థమో అర్థం కాలేదు. అర్థం అయ్యేసరికి హరీష్ గారైతే ఆనంద భాష్పాలు రాల్చేసారు. స్టేజీ దిగి కిందికి వచ్చేసరికి, వందలాది మంది ధ్యానులు మమ్మల్ని చుట్టుముట్టారు. ఆ గొప్ప గురువుగారు మమ్మల్ని ఎంతో ప్రముఖమైన వ్యక్తుల లాగా భావించేలా చేసేసారు.

ఇప్పుడు కూడా ఆ సంఘటన గుర్తుకు వస్తే, నిన్ననే జరిగినట్టు, కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది, ఆ దృశ్యం. ఇప్పటికి ఆ శాలువాలు మా బీరువాలో ఎంతో పదిలంగా దాచుకున్నాను. అమరావతి నుండి తిరిగి వచ్చినప్పటికి మేము, మా కుటుంబ సభ్యులకి ఎవ్వరికి కూడా అక్కడ జరిగిన విషయాలు ఏవీ చెప్పలేదు. పత్రీజీ గారి ద్వారా అందుకున్న ఈ గొప్ప ఆధ్యాత్మిక బహుమతి, ఎక్కడో మా అందరి హృదయాంతరాలలో ఒక "అపురూపమైన స్మృతి" గా నిలచి పోయింది. దానిని మాటలలో పెట్టడం మాకెవరికి సాధ్యం కాలేదు.

ఏదేమైనప్పటికి, మేము అందుకున్నది ఎంతో గౌరవ ప్రదమైన పురస్కారం నా దృష్టిలో.

15.స్వామి జీవానంద

2011 డిసెంబర్ నెలలో మేము ఢిల్లీకి వచ్చాము. మా కుటుంబానికి సన్నిహితుడైన 'హరి' వివాహ వేడుకలలో కలుసు కోవడానికి మేము నలుగురము వచ్చాము.

డిసెంబర్ నెలలో ఢిల్లీ ఎంతో అందంగా ఉంటుంది. మరీ ఉదయం సమయాల్లో అయితే దట్టమైన పొగమంచు కురుస్తూ, చలిచలిగా, అప్పుడే ప్రారంభమవుతున్న శీతాకాలాన్ని స్వాగతిస్తున్నట్లు ఉంటుంది. వివాహ వేడుకలు ముందు రోజు రాత్రి పూర్తి అయ్యాయి. ఇక ఆ రోజు మధ్యాహ్నానికి మేము విమానంలో హైదరాబాద్ వెళ్ళాలి, అక్కడి బంధువులని కలుసుకోవడానికి.

అది ఎంతో అందమైన ఉదయం సమయం. ఎంతో ఆనందంగా, ఘనంగా జరిగిన హరి వివాహ వేడుకల అనంతరం, మేమందరము సరదాగా హోటల్ నుంచి బయటికి వచ్చాము. ఆ ఉదయం అంతా ఖాళీ ఉండడంతో అలా ఢిల్లీ తిరిగి వద్దామని, ఒక కారు అద్దెకు తీసుకుని బయలుదేరాము. ఆ టాక్సీ డ్రైవర్, ఢిల్లీ గురించి తనకు తెలిసినదంతా, ఇంకొంచెం రంగులు పులిమి ఏదేదో చెప్తు, మమ్మల్ని వినోదింపచేస్తున్నాడు. ఢిల్లీలో ఇంకా మేము చూడవలసిన ప్రాంతాలు ఏవి? అని ఆలోచిస్తుంటే హరీష్ గారు, మరియు టాక్సీ డ్రైవర్ ఇద్దరు అక్షరధామ్‌కు వెళితే బాగుంటుందన్నారు. సమయాభావం వలన పోయినసారి ఢిల్లీ వచ్చినప్పుడు కూడా అక్షరధామ్ గుడికి వెళ్ళలేకపోయాము, కాబట్టి అక్కడికి వెళ్ళడానికే మొగ్గు చూపాము.

ఎంతో ప్రణాళిక వేసుకుని పోయినసారి ఢిల్లీ అంతా చూసాము. ట్రాఫిక్ ఇంతల ఉంటుందని అనుకోలేదు. అక్షరధామ్ చివర్న చూద్దామనుకుని వెళుతూ ఉండగా, విపరీతమైన ట్రాఫిక్‌లో చిక్కుకు పోయాము. దాదాపు ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించడానికి ట్రాఫిక్ కారణంగా నాలుగు గంటలసేపు పట్టింది. ఫ్లైట్‌కు సమయం అవుతు ఉండటంతో విమానాశ్రయానికి తిరుగు ప్రయాణం అవ్వవలసి వచ్చింది. ఢిల్లీ ట్రాఫిక్ అంతగా ఉంటుంది. మేము ఒకరికి ఒకరం దీని గురించి ఏమీ చెప్పుకోక పోయినప్పటికి అందరికి కొంత నిరాశ కలిగిన మాట వాస్తవం.

అందుకే ఇప్పుడు అక్షరధామ్ అనగానే అందరం ఏకగ్రీవంగా ఒప్పేసుకున్నాము. ఈ సారి అన్నిటికంటే ముందు అక్షరధామ్ చూడాలని నిర్ణయించుకున్నాము. అర్ధగంటలోపే అక్కడికి చేరుకున్నాము. అంత పెద్ద గుడిని చూసి ఆశ్చర్యపోయాము. దూరం నుంచి చూస్తే గోపుర శిఖరాలు తప్ప ఇంకేమీ కనిపించనంత ఎత్తైన ప్రాకారాలు.

ఆలయం లోపల వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది. గర్భ గుడిలో మూలవిరాట్ దర్శనానంతరం అలా కూర్చున్నాము. అక్కడి ఆహ్లాదకరమైన మరియు నిశ్చలతత్వాన్ని ఆస్వాదిస్తు కాస్సేపు గడిపాము. అక్కడ గడిపిన సమయం నా మనస్సులో చెరగని ముద్ర వేసింది. జీవితం నాకు గొప్పగాను, సంపూర్ణంగాను కనిపిస్తు ఉంది. నేను కోరుకోవడానికి ఇంకేమీ లేదు.

ఈక్షణంలో నేను, ఈ విశ్వంలో అత్యంత ఆనందాన్నీ, సమృద్ధిని కలిగి ఉన్నాను. నా చుట్టూ ఉన్న అత్యంత అందమైన ప్రపంచాన్ని, ఎంతో ఎరుకతో గమనిస్తు నేను ఈ క్షణంలో సంపూర్ణంగా జీవిస్తున్నాను. నా చుట్టు ఉన్న హడావిడి జీవితం నన్ను ఏమాత్రం కదిలించడం లేదు. మన

లోపలి ప్రపంచంలో ప్రశాంతత ఉన్నప్పుడు, బయటి ప్రపంచంలో, ఆటోమేటిగ్గా ప్రశాంతతను పొందగలుగుతాము అన్న విషయం గుర్తుకు వచ్చింది. ఆనందంగా ఉండాలంటే కూడా ఇదే మార్గాన్ని అవలంభించాలి అన్న విషయం కూడా గుర్తుకు తెచ్చుకున్నాను. ఆ ఆలయ ప్రాంగణంలో ఒక్కొక్క అడుగు నేను వేస్తున్నప్పుడు "జీవించు", అనడం ప్రారంభించాను. ప్రతి అడుగు వేస్తున్నప్పుడు "జీవించు" అనడం మూలాన, ఈ అద్భుతమైన క్షణం నాకు చాలాకాలం వరకు గుర్తుండిపోవాలన్నది నా ఉద్దేశ్యం. నాకు ఇరువైపులా నడుస్తున్న మా పిల్లలు ఇద్దరు కూడా నాతో కలిసి ప్రతి అడుగుకి "జీవించు" అనడం మొదలు పెట్టారు. నడుస్తూనే నేను కొద్ది సేపయ్యాక గుడిలో నాకు కలిగిన అనుభవాన్ని చెప్పాను. ఉన్నట్టుండి మా అబ్బాయి నిఖిల్ "ఇదుగో స్వామి జీవానంద" అన్నాడు. నేను చివుక్కున తల తిప్పి చుట్టూ చూశాను.

కాషాయ వస్త్రాలు కట్టుకుని ఎవరైనా స్వామీజీ ఉన్నారేమోనని. పకపకా నవ్వుతూ నిఖిల్ "అమ్మా మనమే స్వామి జీవానంద" అన్నాడు. మనం కూడ మన జీవితంలో వేసే ప్రతి అడుగులోను ఆనందంగ (ఆనంద), సంపూర్ణంగాను, జీవించాలి (జీవించు అన్నది నిరంతరము గుర్తు చేసుకుంటు ఉండాలి). అప్పుడే జీవించడం అనేది మనకు అనుభవంలోకి వస్తుంది.

మా అబ్బాయి అభిప్రాయంతో ఏకీభవిస్తూ, నేను ఇద్దరిని చెరొక చేత్తో పట్టుకుని దగ్గరకు తీసుకున్నాను, పిల్లల తెంపరితనానికి మురిసిపోతు. తల్లిగా నాకింతకంటే ఏమి కావాలి. వాళ్ళే నాకు జీవించడం ఎలా అన్నది గుర్తు చేస్తు ఉంటారు.

అక్షరధామ్ గుడి నుంచి, ఈ "జీవించడం ఎలా" అన్న గొప్ప సత్యాన్ని

మాతో పాటు తీసుకుని, అక్కడ జరిగినవన్నీ గుర్తు చేసుకుంటూ బయటికి నడిచాము. ఎప్పుడైనా జీవితంలో పట్టు కొల్పోతున్నామేమోనని తోచినప్పుడు మేమందరము కూడ "స్వామి జీవానంద"ని తలచుకుంటు ఉంటాము. మళ్ళీ జీవించడం మొదలు పెడతామన్నమాట.

16. నా దినచర్యలో ధ్యానం

నేను గొప్ప అశాంతికి, ఉద్విగ్నతకు గురై ఉన్నప్పుడు నాకు ఒక పిన్నిగారు ధ్యానం నేర్పించారని పూర్వం చెప్పి ఉన్నాను. ఆ రోజు నుండి ఈ రోజు వరకు క్రమం తప్పకుండా ధ్యానం చేస్తూనే ఉన్నాను.

ఆ జరిగినదంతా, ఇప్పుడు తలచుకుంటే హాస్యాస్పదంగా అనిపిస్తుంది. స్మృతిపథంలో ఎన్నో జ్ఞాపకాలలో ఇదొకటి. నాకు భౌతిక పరంగా అన్ని సదుపాయాలూ ఉండేవి. ఎంతో ప్రేమగా చూసుకునే భర్త, ఇద్దరు ఆరోగ్యమైన, అందమైన రత్నాల్లాంటి పిల్లలు, మంచి ఉద్యోగం, మంచి జీతం, సంఘంలో మంచి పలుకుబడి ఇలా అన్నీ ఉన్న నేను, ఏదో తెలియని వెలితి, అశాంతికి గురైయ్యాను.

ఆ రోజు కార్యాలయంలో జరిగిన సన్నివేశం, ఆ తరువాత నా జీవితంలో జరగబోయే మార్పులకి నాంది అన్నమాట. ఇది ఒక మేలుకొలుపు లేదా హెచ్చరింపు అని అనుకుంటున్నాను. రోజురోజు నేను జీవిస్తున్న బిజీ జీవితం నుండి నన్ను 'సరిగ్గా జీవించడం' వైపుకు తీసుకు వెళ్ళడానికి జరిగిందది.

ఈ భౌతిక తలం మీదకు రావడానికి ముందు నేను తయారు చేసుకున్న దివ్య ప్రణాళికలో భాగమే ఇది. అందరికి కూడా జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి హెచ్చరింపు చేసే సన్నివేశాలను ఎదుర్కోవలసి వస్తుందని తరువాత తెలుసుకున్నాను. చాలావరకు ఇలాంటి సందర్భాలు మనకు ముప్పైనలభై ఏళ్ళ వయసు వచ్చినప్పుడు చాలా మంది ఎదుర్కొనేవే, దీన్ని

'మధ్య జీవిత సంక్షోభం' అంటారు. ఏదేమైనా నా జీవితంలో వచ్చిన ఈ 'మధ్య జీవిత సంక్షోభం' నాలో ఎంతో గొప్ప మార్పుకు దోహద పడింది. ఇప్పుడు జీవితానికి ఒక అర్థం అంటు ఉంది. "నా ఆత్మ పురోగమనం" కోసం ఈ భౌతిక తలం మీద మరొక జన్మ తీసుకుని వచ్చాను.

మనం ఈ భూతలం మీద ఎన్ని జన్మలు తీసుకుని ఉంటాము? ప్రతిసారి "మనుగడ కోసం పోరాటం" తోనే జన్మలు గడచి పోతాయి. అంతకంటే ఇంకేమీ చెయ్యటం లేదు. అనుభవాలు పొందటానికి మనం ఈ భూతలం మీదకి వచ్చినపుడు అవి సంపూర్ణంగా, ఆనందంగా అనుభవించాలి.

ఏడ్చుకుంటూ, బాధ పడుతూ ఉండకూడదు. ఈ అనుభవాల కోసమే భూమ్మీదకు వచ్చామన్నది గుర్తించాలి.

ఇప్పుడు ప్రతిదాన్నీ, నేను చూస్తున్న దృష్టికోణం మారిపోయింది. మంచి లేదు, చెడు లేదు, నేను ఉన్నది ఎంత సత్యమో, అవి కూడా అలాగే ఉన్నాయి. నన్ను నేను ఆమోదిస్తూ, అంగీకరిస్తు ముందుకు సాగాలి, నా చుట్టు ఉన్న అంతటిని ఎలా ఉంటే అలాగే స్వీకరించాలి. **"రేపు" అన్నది లేదు. ఉన్నదల్లా "ప్రస్తుతం"** మాత్రమే. ఇప్పుడు ఈ క్షణం మాత్రమే ఉంది. ఇందులోనే జీవించాలి, ఈ క్షణం లోనే నేను పొందవలసిన అనుభవం ఉంది.

డిసెంబర్ 2002, వేసవికాలం, ఒకానొక మధ్యాహ్న సమయంలో, నా జీవితంలో మరో కొత్త అధ్యాయం మొదలైంది. ఆ రోజు నుంచీ నా జీవితం "ధ్యానం", "స్వాధ్యాయం", "సజ్జన సాంగత్యం"లతో కూడుకుని ఉంది. ధ్యానం చెయ్యడం, ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చెయ్యడం, నేర్చుకున్నదంతా 'ఆధ్యాత్మికత ' గురించి తెలిసి ఉన్న నా స్నేహితులతో

పంచుకోవడం అన్నది నా దినచర్యలో భాగంగా మారిపోయింది.

ఈ ఆధ్యాత్మిక జ్ఞానం పెంచుకోవాలన్న తృష్ణ నాలో రోజు రోజుకి పెరిగి పోసాగింది. ఎన్నో గొప్ప, గొప్ప ఆధ్యాత్మిక గ్రంధాలు చదవడం ప్రారంభించాను. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వారి వెబ్‌సైట్‌లో ఆన్ లైన్ గ్రంథాలయం ఉంది. నాలాంటి ఎంతోమంది ధ్యానులు, వారి వారి ధ్యాన అనుభవాల గురించి రాసిన అనేక వ్యాసాలు అందులో దొరికేవి. అవి చదువుతు ఉంటే "నా లోపలి ప్రయాణం" పట్ల ఉత్సుకత పెరిగింది. సత్యం తెలుసుకోవాలన్న ఆర్తుత నాలో మరింత కలిగింది.

"భగవంతుని సామ్రాజ్యం మనలోనే ఉంది" అనేవారుట, ఏసుక్రీస్తు గారు. కాబట్టి గంటలు, గంటలు ధ్యానం చేసేదాన్ని, తద్వారా ఇంతకు ముందు ఎన్నడు కలుగని ప్రశాంతతను, సంతృప్తిని పొంద గలుగుతున్నాను.

మా కుటుంబ సభ్యులతో, నా ధ్యాన అనుభవాల్ని పంచుకోవడం ప్రారంభించాను. నెమ్మదిగా మా పిల్లలకి ధ్యానం చెయ్యటం నేర్పించాను. వారి వయస్సు అప్పటికి తొమ్మిది మరియు ఆరు సంవత్సరాలు మాత్రమే.

చక్కగా నేర్చుకున్న మా పిల్లలు, క్రమం తప్పకుండా, ప్రతి రోజు, సునాయాసంగా "ధ్యానం" చేసేవారు. ప్రతి రాత్రీ నేను వారికి ఆ రోజు చదివిన గ్రంథాలలోని జ్ఞాన సారాంశాన్ని వివరంగా చెప్పేదాన్ని. వారు 'స్పాంజీ'ల లాగా అన్నిటిని సంగ్రహించేవారు. ప్రతి రాత్రీ భోజనానంతరం అందరము కుర్చుని ధ్యానం చేసేవాళ్ళము. ధ్యానం, "లోపల ఈ అశాంతికి గురి చేసే మనస్సు యొక్క రణగొణ ధ్వనుల్ని" శాంత పరుస్తుంది. అది మేము శ్వాస మీద ధ్యాసతో ప్రారంభించాము.

ధ్యానం చెయ్యడం చాల సులభం.

“కళ్లుమూసుకుని, మన సహజమైన శ్వాస మీద ధ్యాస పెట్టడమే”.

ధ్యానం చెయ్యడం వలన మన మనస్సు ద్వారా మనకు కలిగే అలజడిని శాంత పరుస్తుంది. తద్వారా ఆత్మశక్తి చేకూరి “మంచి ఆరోగ్యం”, “మానసిక ప్రశాంతత” మరియు “ఆత్మ జ్ఞానం” లాంటివి అన్నీ లభ్యమవుతాయి.

పిరమిడ్ లోపల కానీ, పిరమిడ్ కింద కానీ చేసే ధ్యానాన్ని “పిరమిడ్ ధ్యానం” అంటారు. పిరమిడ్ లోపల చేసే ధ్యానం, మామూలు ధ్యానం కంటే మూడింతలు శక్తివంతమైనది.

ఈ భౌతిక శరీరం, సహజంగా, ఒక క్రమ పద్ధతిలో శ్వాస తీసుకుంటు ఉంటుంది. ధ్యానం చేసేటప్పుడు మన మనస్సు ఈ సహజమైన క్రమ పద్ధతిలో ఉన్న శ్వాసతో లయమై పోతుంది.

ఆస్ట్రేలియాకు వచ్చినప్పటి నుండి నేను ఎల్లప్పుడు ఇంటిపై బెంగ పెట్టుకొని బాధ పడుతు ఉండేదాన్ని. మా వాళ్ళు అందరు భారత దేశం లోనే ఉన్నారు కాబట్టి. ఈ బాధ నాకు నిరంతరము కష్టం కలిగిస్తూ ఉండేది.

అప్పటికి, ప్రతి సంవత్సరము మేము సెలవులలో ఇంటికి వచ్చి వెళ్ళేవాళ్ళం. అయినా, మా కుటుంబ సభ్యులకి వీడ్కోలు చెబుతూ, మళ్ళీ తిరిగి ఆస్ట్రేలియాకు బయలుదేరేటప్పుడు గుండెల్ని పిండేసే అంత బాధ కలిగేది.

అదంతా కూడ ధ్యానం ప్రారంభించిన తరువాత నాలో అదృశ్యమైంది. జీవితంలో వచ్చే సమస్యల్ని, భయాల్ని అధిగమించగలుగుతున్నాను. జీవితం యొక్క "మొత్తం చిత్రం" అర్థం అయ్యాక ఇక భయాలు, పశ్చాత్తాపాలు ఏమీ లేవు. నాచుట్టు ఉన్న వారిని నేను అర్థం చేసుకునే తీరు మెరుగైంది. అందరితో చక్కగా మసలగలుగుతున్నాను.

ఇక ఇప్పుడు, మా కార్యాలయంలో విచిత్రమైన సంఘటనలు జరగడం ప్రారంభమైయ్యాయి. కార్యాలయంలో కొంతమంది నా దగ్గరికి వచ్చి వారి సమస్యల్ని, బాధల్ని చెప్పుకునేవారు.

తొలుత వారి సమస్యల్ని కూర్చుని వింటూ ఉండేదాన్ని. ఇలా చాలామంది వచ్చి నాతో వారి సమస్యల్ని, భయాలని చెప్పుకునేవారు. ఉద్యోగ పరంగాను, వ్యక్తిగత సమస్యలతోను బాధ పడుతున్న కొంత మంది నిస్పృహకు, ఆత్మన్యూనతకు, గురయ్యేవాళ్ళు, వారి బాధలను వినడం తప్ప నేనేమీ చెయ్యలేనా? వీరి కొరకు నేను ఏదైనా చెయ్యాలని అనుకున్నాను.

మునుపెన్నడు ఇలా మా తోటి ఉద్యోగస్తులు నాతో వారి కష్టాలనీ, బాధలనీ పంచుకునేవారు కాదు. ఇదంతా ఈ మధ్యనే మొదలైంది. ఏదో కారణం చేత వీరందరు నా దగ్గరికి వస్తున్నారు. అప్పుడు నేను నా కుటుంబానికే కాకుండా, బయటి వారికి కూడా ధ్యానం నేర్పడం ప్రారంభించాను.

చాలా మంది ధ్యానం నేర్పించమని అడుగుతుండడంతో, మధ్యాహ్న భోజనానంతరం, విరామ సమయంలో ధ్యానం నేర్పించడం ప్రారంభించాను.

వారికి "జీవిత ఉద్దేశ్యం" గురించి, "జీవించడం" గురించి, ఈ

మధ్యకాలంలో నేను నేర్చుకున్నదంతా చెప్పేదాన్ని, ప్రతి వారము, ఇలా అశాంతికి గురైన ఒకరో, ఇద్దరో వచ్చి నన్ను అడిగేవారు. వారితో నేను నేర్చుకున్న జ్ఞానం అంతా పంచుకుని, ధ్యానం నేర్పి మరీ వారిని ఈ నిరాశ, నిస్పృహల నుంచి బయట పడడానికి సహాయ పడుతు ఉండేదాన్ని.

అలా, ఈ పార్ట్ టైం, అనధికారిక ''కౌన్సిలింగ్ సెషన్లు'' ప్రారంభించాను. అన్ని కౌన్సిలింగ్ సెషన్లు కూడా ధ్యానంతో ముగించేదాన్ని. ఈ ధ్యానం అన్న పనిముట్టుని వారందరు విరివిగా ఉపయోగించు కోవాలని చెప్పేదాన్ని. ఎందుకంటే మళ్ళీ జీవితంలో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు ఈ ధ్యానం అనే 'పరిష్కారం చూపించే తాళం చెవి ' వారి దగ్గర పెట్టుకొమ్మని చెప్పేదాన్ని.

ఆ తరువాత నాకు మా ఇంటికే ఫోన్ కాల్స్ రావడం ప్రారంభమైంది. ఎవరో నిస్పృహకు లోనై చాలా బాధ పడుతున్నారని, నన్ను చూడ కోరుతున్నారని చెప్పేవారు. కొంతమంది తెలిసినవారు, కొంతమంది పూర్తిగా అపరిచితులు, అదంతా నేను పట్టించుకునేదాన్ని కాదు. వారికి అవసరం ఉంది, నేను వారికి ఏవిధంగా సహాయపడగలను? ఇంతే నా ఆలోచన ఉండేది. నా చుట్టూ ఉన్న మనుష్యులకి ఆ విధంగా సహాయ పడడానికి ప్రయత్నించేదాన్ని.

కొంతమంది ఇంటికి వచ్చేసేవారు. చాలాసేపు కూర్చుని మాట్లాడి ధ్యానం నేర్చుకుని వెళ్ళిపోయేవారు. ఇలా ధ్యానం నేర్చుకున్న కొంతమంది మాత్రం అప్పుడప్పుడూ వచ్చి వెళ్ళేవారు, కొంతమంది తిరిగి రాలేదు.

తరువాత నేను ప్రతి ఆదివారం, ఇంట్లోనే ధ్యాన తరగతులు

నిర్వహించడం ప్రారంభించాను. ఉచితంగా ఎవరైనా వచ్చి ధ్యానం నేర్చుకుని వెళ్ళవచ్చు.

ధ్యానుల నుండి వెలువడుతున్న పాజిటివ్ శక్తి తరంగాలతో మా ఇల్లు నిండిపోయేది. నాకింకేమి కావాలి?

ధ్యానం, భౌతిక పరమైన, ఆధ్యాత్మిక పరమైన ఆరోగ్యాన్ని ఖచ్చితంగా ఇస్తుంది.

"ధ్యానం" అన్నది మన జీవితాలకు మనం ప్రయత్న పూర్వకంగా ఇచ్చుకునే గొప్ప "బహుమతి"

17. నాలుగు ఆత్మల ప్రయాణం

మా అమ్మాయి నవ్య, జే. కే. రౌలింగ్ గారి గొప్ప అభిమాని. ఆవిడ రాసిన హ్యారీ పాటర్ నవలలు అంటే తనకి ప్రాణం.

ఒకరోజు తను "అమ్మా! మీకు తెలుసా? జే.కే.రౌలింగ్ గారు హ్యారీ పాటర్ మొదటి భాగము, ఒక 'ఫలహార శాల'లో కూర్చుని రాసారట, మీరు కూడా ఎప్పుడైనా అలా రాయాలి" అంది. అప్పటికి నవ్వేసాను. కానీ నిజంగానే ఈ రోజు ఒక కేఫేలో కూర్చుని రాస్తున్నాను. ఈ 'ఫలహార శాల' బర్వుడ్ ఈస్ట్ కెమార్ట్ ప్లాజాలో ఉంది.

ఈ రోజు మంగళవారం. ఈ హోటల్ వారు మంచి ఘుమఘుమ లాడుతున్న, వేడి వేడి కాఫీ తెచ్చి నా ముందు పెట్టారు. చూడటానికి ఎంతో బాగుంది, యాలకులు వేసి ఒక డోనట్ కూడా దానితో పాటు తెచ్చి ఇచ్చారు.

మొదటి ఆత్మ యొక్క ప్రయాణం:

నా గురించి మరియు నా ఆత్మ ప్రయాణం గురించి నేను చాలా వరకు చెప్పేసాను. పూర్వ జన్మల గురించి నేను ప్రస్తావించడం లేదు కానీ ఈ జన్మలో మాత్రం, చక్కగా ప్రణాళిక వేసుకుని వచ్చాను. నేను ఎప్పుడైనా, ఏవైనా సమస్యల్లో ఉన్నప్పుడు నా దగ్గరి వాళ్ళు ఎవరో ఒకరు, నాకు తోడుగా నిలిచేవారు. తద్వారా నాకు ఎంతో ధైర్యం, మానసిక స్థైర్యం

కలిగేది.

వివాహానికి ముందు, వివాహం తరువాత కూడా మా కుటుంబ సభ్యులు నాతో ఎంతో ప్రేమగా ఉండేవారు. మా తల్లిదండ్రులు, మా తోబుట్టువులు అందరు నా పట్ల ఎంతో ప్రేమ, ఆప్యాయతలు కలిగి ఉండేవారు. నేను కూడా వారితో అలాగే ఉండేదాన్ని. మా అక్కయ్యలకు కానీ, తమ్ముడికి కానీ ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు వారికి నేను తోడుగా నిలిచేదాన్ని. నా వివాహానంతరం కూడా ఇలాగే చేసేదాన్ని. నా జీవితంలో భర్త, పిల్లలకు అందరికంటే అధిక ప్రాముఖ్యం ఇచ్చేదాన్ని. ఇప్పటికి కూడా నా కుటుంబ సభ్యులు అందరు భోజనం చేశాక కానీ, నేను భోజనం చేయను. ఈ ప్రేమ, క్షమాతత్వం అంతా కూడ నా కుటుంబం వరకు మాత్రమే పరిమితమై ఉండేది.

నా, ఈ ఆధ్యాత్మిక ప్రయాణం మొదలు పెట్టాక మాత్రమే "ప్రేమ" అన్న మాటకు నిజమైన అర్థం తెలిసింది. ప్రేమంటే ఎదుటివారి కోసం ఏదైనా ఇవ్వడం, ఏదైనా చేసెయ్యడం కాదు. ప్రేమంటే ప్రతి ఒక్క దాన్ని, ప్రతి ఒక్కరిని ఎలా ఉంటే అలానే ఉండనివ్వాలి, అలాగే స్వీకరించాలి.

ఈ జ్ఞానం, నా ఆలోచనా విధానాన్ని, నా జీవన శైలినే మార్చేసింది. ప్రేమను నిర్వచించడం చాలా సులభం అనిపిస్తుంది. ప్రేమంటే ఏదేదో చేసేయ్యడం కాదు, "ఏమీ చెయ్యకుండా ఉండడమే ప్రేమ". ఎంత వింతైన విషయం! కానీ ఇదే సత్యం. ఏమీ చెయ్యాల్సిన అవసరం లేదు. మన హృదయ కుహరాన్ని తెరిచి, ఏది ఎలా ఉంటే అలాగే స్వీకరించాలి. మనం "సరి" చేయాల్సింది ఏమీ లేదు.

ఈ సృష్టిలో ప్రతీదీ పరిపూర్ణంగానే ఉంది. ప్రతీదీ ఎలా ఉండాలో

అలానే ఉన్నాయి. మనం ఇక్కడ ఈ అనుభవాలని పొందడానికి వచ్చి, మన నిజాలని మనమే సృష్టించుకుంటున్నాం.

అలాంటప్పుడు మిగతా సృష్టి పరిపూర్ణంగా లేదని ఎలా అనుకుంటాము, అవి అలానే సృష్టించబడ్డాయి. వెరసి ఈ సృష్టిలో ఏదీ 'మంచి–చెడు' అన్నవి లేవు,ఈ 'సృష్టి' ఉంది, అంతే!

కానీ ఇదంతా చెప్పుకునేంత సులభమా? తరతరాలుగా మనం ప్రతి దాన్నీ బేరీజు వేస్తూ, మనకు అనుగుణంగా ఎదుటివారిని, మరియు ప్రతి దాన్నీ మార్చుకోవడానికే ప్రయత్నిస్తూ ఉంటాము. మనకున్న పరిమితమైన జ్ఞానం వలన ప్రతిదానికి 'ఇది మంచి, ఇది చెడు' అని ముద్ర వేసేస్తు ఉంటాము.

ప్రేమకు నిర్వచనం చాలా సాధారణంగా, చాలా సులువుగా ఉన్నప్పటికి మన యొక్క సంక్లిష్టమైన వైవిద్యభరితమైన వ్యక్తిత్వాల కారణంగా అది చాలా క్లిష్టంగా, అర్థం కాని విధంగా తోస్తుంది. కానీ మనం "మనస్సుకు" రవ్వంత శిక్షణ ఇచ్చి, ఉదార హృదయంతో, ప్రతి వస్తువుని, ప్రతి వ్యక్తిని 'ఎలా ఉన్నాయో' లేదా 'ఎలా ఉన్నారో" అలాగే ఉండనివ్వాలి, అలానే స్వీకరించాలి, ఇదే ప్రేమంటే.

నా జీవితంలో నన్ను, నేను ఎల్లప్పుడూ చాలా విమర్శించుకునే దాన్ని. ప్రతీది సమయం ప్రకారం, నేను అనుకున్న విధంగా జరగాలి అనుకునేదాన్ని. ఏ రోజైనా కొద్దిగా తేడా జరిగిందో, ఇక అంతే! ఇంకెవరినైనా తప్పుపట్టడం కాదుకానీ, నన్ను నేను బాగా నిందించుకునే దాన్ని. అందుకని అన్నీ సవ్యంగా ఉన్నాయో లేదోనని ఒకటికి నాలుగు సార్లు తనిఖీ చేసుకునే దాన్ని. ఏదీ పొల్లుపోకుండా నేనెలా అనుకుంటే అలాగే జరగే లాగా

చూసుకునే దానిని, కాబట్టి నాకు నిత్య జీవితం కూడా పరీక్ష లాగుండేది. నేను చక్కగా ప్రణాళిక వేసుకుని అన్నీ చేసుకుంటూ వేళ్ళేదాన్ని. అన్నీ సవ్యంగా జరిగాయా?

మంచిది జరగలేదనుకోండి, నా ప్రణాళికను ఒకటికి పది సార్లు మళ్ళీ, మళ్ళీ తనిఖీ చేసుకుని, ఎక్కడ తప్పు జరిగిందోనని సరి చేసుకునేదానిని. జీవితం అంటే ఇంత కష్టపడక్కర్లేదని నాకు తొందరగానే అర్థమైంది. ప్రతి రోజూ పరీక్ష లాగా బాధపడవలసిన అవసరం లేదు. "ఇంకా బాగా జీవించగలిగిన అర్హత నాకూ ఉంది" అన్న ఆలోచన కలిగింది.

'క్షమాతత్వం' గురించి నేను మొదటిసారి చదివినప్పుడు, నా జీవితంలో ఈ క్షమాతత్వం లోపించిందని గుర్తించాను. ఇతరులను క్షమించడం తరువాతి సంగతి. ముందు నన్ను నేను క్షమించుకోగలగాలి. మనల్ని మనం క్షమించు కోలేనప్పుడు ఇతరుల్ని ఎలా క్షమించగలము?

నేను నెమ్మదిగా "నన్ను, నేను క్షమించుకోవడం" మొదలు పెట్టాను. అప్పుడు నాకు ఉదారంగా, ఇతరుల్ని క్షమించ గలిగే క్షమత కలిగింది. ఇప్పుడు నాకు నచ్చని వారంటూ ఎవరూ లేరు. శత్రువులు కూడా ఎవరూ లేరు. "నాకు నచ్చని మరియు నన్ను ఇబ్బందికి గురిచేసే వారి జాబితా" ఎంతో పెద్దగా ఉండేది కానీ, నా ఆధ్యాత్మిక పరిజ్ఞానం పెరుగుతూ ఉంటే, క్రమక్రమంగా ఆ జాబితా బహు చిన్నదై పోయి, అదృశ్యమైపోయింది.

ప్రేమ, క్షమాతత్వంల యొక్క నిజమైన నిర్వచనం నాకు అర్థమైన తరువాత జీవితం నాకు భారంగా అనిపించడం లేదిప్పుడు. నాకు జీవితం మరింత ఆనందంగా, అందంగా కనిపిస్తూ ఉందిప్పుడు. నా వరకూ అయితే ఆనందం అన్నది మన లోపలనుండి రావాలి. ఎందుకంటే అదే మన

"నిజస్వభావం" కనుక, బయటి ప్రపంచం నుంచి ప్రశంసలు నేను ఎదురు చూడటం లేదిప్పుడు. ఒకవేళ అలా ఎదురుచూస్తే నా ఆనందం, వారి వ్యక్తిగత అభిప్రాయాల మీద ఆధారపడి ఉండేది. మనం ఆనందంగా ఉండాలా వద్దా అన్నది ఎదుటివారికి అందచేసినట్లేనన్న మాట. అంటే మనం ఆనందంగా ఉండడానికి కావలసిన రిమోట్ కంట్రోల్ వారి చేతికి ఇచ్చేసినట్లే, కదా మరి..

ఎల్లప్పుడూ గురుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే "నీ వాస్తవానికి నువ్వే సృష్టి కర్తవు". నీ జీవితానికి నువ్వే భాధ్యత వహించాలి.

రెండవ ఆత్మ యొక్క ప్రయాణం:

1988వ సంవత్సరం మార్చి నెలలో, ఈ జన్మకు, నా ఆత్మ ప్రయాణానికి తోడుగా నిలవడానికి "హరీష్ గారు" నా జీవిత భాగస్వామి అయ్యారు.

నాకు ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే నేను ముందు చెప్పినట్లు ప్రేమ, క్షమాతత్వంల గురించి ఎంతో తెలుసుకుని, సాధన చెయ్యటానికి కొంత సమయం పట్టింది నాకు. కానీ హరీష్ గారు స్వభావ సిద్ధంగానే ఈ గుణాలను కలిగి ఉన్నారు. చాలా సాధారణమైన వ్యక్తిలా కనిపించడం ఈయన ప్రత్యేకత.

జీవితంలో అడుగడుగునా నాకు తోడై నిలిచారు. నామీద అపారమైన నమ్మకం విశ్వాసం కలిగి ఉండటం చేత జీవితంలోని కీలకమైన నిర్ణయాలు నన్నే తీసుకోనిచ్చేవారు. అటు ఉద్యోగ బాధ్యతలు, ఇటు పసి పిల్లల ఆలనా పాలనలతో నాకు ఎక్కువ ఒత్తిడి కానీయకుండా తగు జాగ్రత్తలు తీసుకునేవారు. అన్నిటికి చేదోడు వాదోడుగా, నేనున్నానంటు నాకు వెన్నంటే ఉండేవారు.

హరీష్ గారి తోడు లేకుండా ఇప్పటివరకు నేను ఏదైనా ముఖ్యమైన కార్యక్రమాలు చేసినట్టు నాకు గుర్తు లేదు. నావరకు ఆయన ఒక గొప్ప స్నేహితుడు, మంచి మనసున్న భర్త, అన్నిటికి మించి నా ఆత్మీయుడు.

నా ఈ ఆధ్యాత్మిక పరిణామ క్రమంలో, హరీష్ గారు నన్ను ఎన్నడు విమర్శించలేదు. జరుగుతున్నదంతా ఆయనకు అర్థం అయినా, కాకున్నా నాకు తోడుగా నిలబడ్డారు. అంతటి సహనశీలి..

ప్రస్తుతానికి హరీష్ గారు కూడా క్రమం తప్పకుండా ధ్యానం చేస్తారు. నా ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో కూడ నాకు తోడు-నీడగా నిలిచారు. "హరీష్ గారి"ని జీవితభాగస్వామిగా పొందిన నేను "అదృష్టవంతురాలిని".

మూడవ ఆత్మ యొక్క ప్రయాణం:

1992, డిసెంబర్ నెలలో మా కుమారుడుగా మా జీవితాల్లోకి ప్రవేశించాడు "నిఖిల్". మా 'తల్లీ కొడుకు'ల మధ్య ఒక అపూర్వమైన, అద్వితీయమైన గట్టి బంధం ఉంది. అద్భుతమైన స్వభావం కలిగినవాడు, చిన్నారి నిఖిల్.

తొమ్మిదేళ్ళ ప్రాయంలోనే 'నిఖిల్ 'కు ధ్యానం నేర్పించాను. ఆ క్షణం నుంచే ఎంతో క్రమశిక్షణతో ప్రతి నిత్యం ధ్యానం చేసేవాడు. తన పదవ ఏట నుండే మా ఆధ్యాత్మిక గ్రంధాలయంలోని ఎన్నో గ్రంథాలను చదవడం ప్రారంభించాడు. రాంతా గారి "యు ఫర్ ఎవర్" లాంటి ఎన్నో పుస్తకాలను చదివి, తనకు స్ఫురించిన సత్యాలను, విషయాలను నాతో పంచుకునే వాడు.

మేము ఎన్నడూ 'నిఖిల్'ని చిన్న పిల్లవాడిగా చూడలేదు. నేను చదివిన గ్రంథాల సారాంశాన్ని ఎంతో సంతోషంగా నిఖిల్ తో పంచుకునే దాన్ని.

"ఓషో" గారి గ్రంథాలు, "లోబ్ సంగ్ రాంతా" గారి గ్రంథాలు చదవమని సూచించాను. అవన్నీ ఎంతో శ్రద్ధగా చదివే వాడు నిఖిల్. మేము గంటలు, గంటలు కూర్చుని ధ్యానం చేసేవాళ్ళం. నిఖిల్ కూడా నా ఈ ఆత్మ ప్రయాణంలో నిజమైన తోడుగా నిలిచాడు.

నాలుగవ ఆత్మ యొక్క ప్రయాణం:

1996లో "నవ్య మంజరి" మా కుమార్తెగా జన్మ తీసుకుని మా జీవితాల్లోకి ప్రవేశించింది. నేనూ, హరీష్ గారు ఇద్దరము కూడా "నవ్య" రాకతో మా కుటుంబం పూర్తి అయ్యింది అనుకున్నాము.

తను ఎంతో చలాకీతనం, తెలివి, సున్నితత్వం కలిగిన అమ్మాయి. బంగారం లాంటి హృదయం కలిగినది. హరీష్ గారి లాగానే తను కూడా ఎవరితోనూ గట్టిగా మాట్లాడటం కానీ, ఎవరి గురించైనా చెడుగా మాట్లాడటం కానీ నేను వినలేదు. నవ్య ఇతరుల భావాలకు, భావోద్వేగాలకు ఎంతో సున్నితంగా స్పందించేది.

నిఖిల్ తొమ్మిదేళ్ళ ప్రాయంలోనే ఆధ్యాత్మిక ప్రపంచంలోకి అడుగు పెట్టిన అదృష్టవంతుడు అనుకుంటుంటే, నవ్య ఆరు సంవత్సరాలకే తన ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభించింది. అప్పటి నుండి తను కూడా క్రమం తప్పకుండా ధ్యానం చేస్తుంది. తన అన్నయ్యగారి అడుగుజాడల్లో, ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తోంది. అన్నయ్య గారంటే తనకి ఎంతో ప్రేమ, విశ్వాసం.

ఈ ఇద్దరు మమ్మల్ని "తల్లి తండ్రులు"గా ఎందుకు ఎన్నుకున్నారో నాకు అర్థమైంది. ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి ప్రవేశించడానికి వారికి ఎక్కువకాలం నిరీక్షించాల్సిన అవసరం లేదిప్పుడు. ఇంత చిన్న వయసు లోనే ఆధ్యాత్మికత గురించి, జీవించడం గురించి మరియు జీవిత

ఉద్దేశ్యం గురించి తెలిసిన పిల్లలు ఎంతమంది ఉన్నారు?

అలా మేము నలుగురం ఈ ఆధ్యాత్మిక మార్గంలో కలసి ప్రయాణం చేస్తున్నాము. వీరందరి తోడు దొరికిన నేను అదృష్టవంతురాలిని. ఒకరి నుంచి ఒకరం ఎంతో నేర్చుకుంటూ ఈ జీవిత ప్రయాణం సాగిస్తున్నాము. వయో అంతరం కానీ, ఆడ మగ అన్న భేదం కానీ మా మధ్య ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో లేనే లేదు.

జీవితం లోని ఒక్కో మైలు రాయి వద్ద ఒక్కొక్కరు వచ్చి నా ఈ ఆధ్యాత్మిక ప్రయాణంలో చేరారు. నాకు తోడుగా నిలచి, "సంపూర్ణంగా జీవించడం ఎలా" అన్నది అడుగడుగునా గుర్తు చేస్తున్న నా ఈ కుటుంబ సభ్యులకి నా హృదయ పూర్వక దన్యవాదాలు.

శుభం